




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 29 శుక్రవారం ఆగస్టు 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 345

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur







## హిమాచల్‌పై ప్రకృతి ప్రకోపం.. 310 మంది మృతి



3

## కోతి దెబ్బకు రూ. 28 వేలు గల్లంతు



2

## గణేష్ పూజ కోసం పూజారిని కిడ్నాప్ చేసిన భక్తులు..



2

---

40 దేశాల్లో భారత్ స్పెషల్ ప్రోగ్రామ్స్

# ఇండియా మాస్టర్ ప్లాన్

- ట్రంప్ టారిఫ్‌ల దెబ్బ.. 50% సుంకాలతో ఇబ్బంది
- ప్రభావిత రంగాల రక్షణకు మోదీ సర్కార్ ప్రణాళికలు
- ట్రంప్ టారిఫ్‌లకు కౌంటర్..
- జౌళి వస్తువులు, దుస్తులు, జెమ్స్-జ్యువెలరీలపై దృష్టి
- ఇంగ్లాండ్ నుంచి జపాన్ దాకా ప్రధాన మార్కెట్లలో ఫోకస్
- ఉత్పత్తుల నాణ్యత, సుస్థిరతపై ప్రత్యేక ప్రచారం
- సరికొత్త టెక్స్‌టైల్ ఉత్పత్తులతో మార్కెట్‌లో ఆధిపత్యం లక్ష్యం
- ప్రతిపాదిత దేశాల్లో 590 బిలియన్ డాలర్ల మార్కెట్ అవకాశాలు
- సూరత్, పానిపట్, తిరుపూర్ ఉత్పత్తులకు గ్లోబల్ ప్రమోషన్



**న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు నిన్నటి నుంచి అమల్లోకి వచ్చిన వేళ భారత్ కౌంటర్ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ అదనపు టారిఫ్‌లు, జరిమానాలతో తక్షణం ప్రభావితమయ్యే రంగాలను రక్షించుకునేందుకు మోదీ సర్కారు చర్యలు చేపట్టింది. మన జౌళి వస్తువులు, దుస్తులు, జెమ్స్, ఆభరణాలు వంటి ఎగుమతులపై 40 దేశాల్లో ప్రత్యేక ప్రోగ్రామ్‌లు నిర్వహించబోతున్నట్టు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇంగ్లాండ్, రష్యా, బెల్జియం, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్, నెదర్లాండ్స్, పోలండ్, కెనడా, మెక్సికో తదితర దేశాలో బారత్ ప్రతేక ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహించబోతోంది. ఆయా దేశాల్లో మన ఉత్పత్తులకు మార్కెట్‌ను మరింత విస్తరించేలా ఈ ప్రోగ్రామ్‌లు ఉండనున్నాయి. మన వస్తువుల నాణ్యత, సుస్థిరత గురించి ఆయా దేశాలకు చాటిచెప్పేలా ఈ ప్రోగ్రామ్స్ డిజైన్ చేస్తున్నారు.

సరికొత్త టెక్స్‌టైల్ ఉత్పత్తు లతో ఆయా మార్కెట్లలో మన దేశం ప్రధాన పాత్ర పోషించాలనే లక్ష్యంతో ఈ కార్యాచరణ ప్రతిపాదించారు. ప్రస్తుతం భారత్ 220 దేశాలకు ఎగుమతులు చేస్తోంది. ఇందులో ఈ ప్రతిపాదిత 40 దేశాలు కీలకమైనవి. ఈ దేశాలన్నీ కలిపి ఏటా 590 బిలియన్ డాలర్లకు పైగా విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈ దేశాల్లో మన మార్కెట్ షేర్ పెంచుకుంటే అది మన పరిశ్రమలకు విస్తృత అవకాశాలు కల్పించనుందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. మార్కెట్ మ్యాపింగ్, డిమాండ్ ఎక్కువగా ఉండే ఉత్పత్తులను గుర్తించడం, సూరత్, పానిపట్, తిరుపూర్, బదోహి వంటి ప్రాంతాల్లో పేరొందిన స్వదేశీ ఉత్పత్తులకు ఈ 40 దేశాల్లో ప్రచారం కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టేందుకు ఇప్పుడు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్లు, వాణిజ్య మేళాలు, అమ్మకం-కొనుగోలుదారులతో సమావేశాలు, యునిఫైడ్ బ్రాండ్ ఇండియా విజన్ కింద ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించబోతోంది భారత్. తద్వారా భారత వాణిజ్య రంగాన్ని రక్షించుకోవాలని చూస్తోంది.

---

వందేళ్ల అవసరాలను గుర్తించి

# మూసీ అభివృద్ధి

మూసీ రివర్ డెవలప్‌మెంట్, భారీ వర్షాలపై సీఎం సమీక్ష

- హైదరాబాద్ భవిష్యత్తు 100 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టిన ప్రణాళికలు
- గేట్‌వే ఆఫ్ హైదరాబాద్, గాంధీ సరోవర్ అభివృద్ధిపై దృష్టి
- సిగ్నల్ రహిత జంక్షన్ల ఏర్పాటుపై సీఎం కీలక ఆదేశాలు
- పర్యావరణహితంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచనలు
- డీపీఆర్ త్వరగా సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని ఆదేశం
- భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అధికారులు అప్రమత్తం
- పురాతన ఇళ్లలోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్న ఆదేశం
- వినాయక చవితి సందర్భంగా భక్తుల భద్రతపై ప్రత్యేక చర్యలు
- సీజనల్ వ్యాధులపై ఆరోగ్యశాఖ హెచ్చరికలు, ప్రజలకు సూచనలు

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

మూసీ రివర్ డెవలప్ మెంట్ మాస్టర్ ప్లాన్ పై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ నగరం వచ్చే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మూసీ నదీ పరివాహక ప్రాంతం అభివృద్ధి జరగాలని అధికారులకు సూచించారు. గేట్ వే ఆఫ్ హైదరాబాద్, గాంధీ సరోవర్ అభివృద్ధితో పాటు జంక్షన్ల ఏర్పాటు, రోడ్ల అభివృద్ధిపై అధికారులకు పలు సూచనలు చేశారు. గాంధీ సరోవర్ అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సిగ్నల్ రహిత జంక్షన్లను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మూసీ రివర్ డెవలప్మెంట్, గేట్ వే ఆఫ్ హైదరాబాద్, గాంధీ సరోవర్ అభివృద్ధితో పాటు జంక్షన్ల ఏర్పాటు, రోడ్ల అభివృద్ధి వంటి అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు. మూసీ రివర్ డెవలప్మెంట్



ప్రణాళికలను అధికారులు వివరించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సిగ్నల్ రహిత జంక్షన్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. గాంధీ సరోవర్ అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించారు. అభివృద్ధి పర్యావరణహితంగా ఉండేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. వీలైనంత త్వరగా డీపీఆర్ సిద్ధం చేసి పనులు మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు తెలంగాణ వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా

---

# బీహార్‌లోకి ముగ్గురు జైషే ఉగ్రవాదుల చొరబాటు

- బీహార్‌లో రాష్ట్రవ్యాప్తంగా హైఅలర్ట్ ప్రకటించిన పోలీసులు
- ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించిన ముగ్గురు ఉగ్రవాదులు
- కాఠ్మాండులో ఆశ్రయం తీసుకుని భారత్‌లోకి ప్రవేశించిన ముష్కరులు
- మధుబని, సీతామఢీ, సుపౌల్ జిల్లాల్లో భద్రతా బలోపేతం
- సరిహద్దు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు, గూఢచార నిఘా పెంపు
- ఉగ్రవాదుల పాస్‌పోర్ట్ వివరాలు, ఫోటోలు పోలీస్ స్టేషన్లకు పంపిణీ
- రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మరింత అప్రమత్తమైన పోలీసులు



2

**న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి**

పాకిస్థాన్‌కు చెందిన ముగ్గురు జేషే మహ్మద్ ఉగ్రవాదులు రాష్ట్రంలోకి చొరబడినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో.. బీహార్ అప్రమత్తం అయింది. ముఖ్యంగా బీహార్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ గురువారం రోజు రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించింది. ముగ్గురు ఉగ్రవాదుల ఫొటోలతో పాటు వారి పేర్లు, ఇతర వివరాలను విడుదల చేసింది. వీరు నేపాల్ మీదిగా బీహార్‌లోకి చొరబడ్డట్లు స్పష్టం చేసింది. ఈ ఘటనతో సరిహద్దు ప్రాంతాలతో పాటు మొత్తం రాష్ట్రంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఆ ముగ్గురూ జైషే మహ్మద్ ఉగ్రవాదులే..

నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం.. అనుమానిత ఉగ్రవాదులను హస్నైన్ అలీ (రావల్పిండి, పాకిస్థాన్), అదిల్ హుస్సేన్ (ఉమర్‌కోట్, పాకిస్థాన్), మహమ్మద్ ఉస్మాన్ (బహవల్పూర్, పాకిస్థాన్)గా గుర్తించారు. వీరు ముగ్గురూ ఆగస్టు మొదటి వారంలో కాఠ్మాండుకు చేరుకుని ఆ తర్వాత గత వారం బీహార్‌లోని సుపౌల్ జిల్లా గుండా భారత్‌లోకి చొరబడినట్లుగా ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి. ఈ ఉగ్రవాదుల చొరబాటుతో బీహార్‌తో పాటు ఇతర సరిహద్దు రాష్ట్రాల భద్రతపై కూడా ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి అందిన సమాచారం మేరకు సరిహద్దు జిల్లాలు అయిన మధుబని, సీతామఢీ, సుపౌల్, అరేరియా, తూర్పు, పశ్చిమ చంపారన్‌లలో భద్రతా ఏజెన్సీలు నిఘా,

---



# కరచాలనం

- కేంద్ర మంత్రి బండి సంజయ్,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- కేటీఆర్ పరస్పరం ఎదురైన అరుదైన సంఘటన
- ఆప్యాయంగా ఒకరినొకరు పలుకరించుకొన్న వైనం
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన బండి సంజయ్, కేటీఆర్
- వరద పరిస్థితిని కేంద్ర మంత్రికి వివరించిన కేటీఆర్

**సిరిసిల్ల జిల్లా-నవభూమిబ్యూరో**

వరుస వర్షాలతో అతలాకుతలమైన సిరిసిల్ల జిల్లాలో అరుదైన దృశ్యం కనిపించింది. సాధారణంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ ఎదురుపడ్డారు. గంభీరావుపేట వద్ద వరదల్లో చిక్కుకున్న రైతులను రక్షించే కార్యక్రమం తర్వాత ఈ ఇద్దరు నాయకులు ఒకరినొకరు కలుసుకున్నారు. వారు కరచాలనం చేసుకొని, నవ్వుతూ కొద్దిసేపు మాట్లాడుకున్నారు. ఈ సంఘటన స్థానిక ప్రజలను, ఇరువురు నాయకుల అనుచరులను ఆశ్చర్యపరిచింది. తెలంగాణలో కురిసిన వర్షాలు పలు జిల్లాలను అతలాకుతలం చేశాయి. సిరిసిల్లలో వందల ఇళ్లు నీట మునిగిపోయి, పంటలు నష్టపోయి, రహదారులు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో వరద బాధితులను పరామర్శించడానికి స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం సిరిసిల్ల చేరుకున్నారు. మల్లారెడ్డిపేటలో వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకున్నారు. బాధితులకు ఆర్థిక సాయం

---

# కామారెడ్డి జిల్లాలో వరద బీభత్సం

- చెరువుల్లా మారిన కాలనీలు
- ఫస్ట్ ఫ్లోర్ వరకు చేరిన వరదనీరు, ప్రజలు ఇబ్బందులు
- జలదిగ్బంధంలో చిక్కుకున్న ప్రజలు సహాయం కోసం ఎదురుచూపు
- నేషనల్ హైవే-44పై వరద నీరు, ఆగిపోయిన రాకపోకలు
- వాహన రాకపోకలకు పోలీసులు డైవర్షన్ అమలు
- హెవీ వెహికిల్స్ మేడ్చల్ నుంచి డైవర్ట్, చిన్న వాహనాలకు కొత్త మార్గం
- కామారెడ్డి జిల్లా ముంపులో, 500 మందికి పైగా రెస్క్యూ ఆపరేషన్
- కామారెడ్డి మార్గంగా హైదరాబాద్ వెళ్లవద్దని ఎస్పీ హెచ్చరిక
- అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, హెల్ప్‌లైన్ నంబర్లు వినియోగించాలని సూచన



2


**కామారెడ్డి -నవభూమిబ్యూరో**

రాష్ట్రంలో కామారెడ్డి వరద ధాటికి కకావికలంగా మారింది. కామారెడ్డి జిల్లాలోని పలు కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్ మునిగి, ఫస్ట్ ఫ్లోర్ వరకు వరదనీరు చేరుకోవడంతో అనేక కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రజలు తమను కాపాడాలంటూ వేడుకుంటున్నారు. కామారెడ్డి దగ్గరలోని జాతీయ రహదారి ఎన్ హెచ్ 44 పైకి వరద నీరు వచ్చి చేరడంతో రోడ్డు డ్యామేజ్ అయింది. దీంతో ఈ రహదారిలో వాహన రాకపోకలను దారి మళ్లిస్తున్నారు. జాతీయ రహదారి NH-44 డ్యామేజ్.. వాహన రాకపోకలు బంద్ భారీ వర్షాల కారణంగా కామారెడ్డి దగ్గరలోని జాతీయ రహదారి NH-44 డ్యామేజ్ కావడంతో 25% రాకపోకలు మాత్రమే జరుగుతున్నాయని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి మేడ్చల్- రామాయంపేట- కామారెడ్డి-డిచ్పల్లి దారిలో కాకుండా వేరే ప్రత్యామ్నాయ మార్గాల గుండా వెళ్లాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా ఎన్ హెచ్ 44 పై హెవీ వెహికిల్స్ అన్ని మేడ్చల్ నుంచి డైవర్ట్ చేయడం జరిగిందన్నారు. వాహనాలను దారి మళ్లిస్తున్న పోలీసులు చిన్న వెహికల్ అన్నీ కూడా రామాయంపేట నుంచి డైవర్ట్ చేయడం జరిగిందని ఈ విషయాన్ని ప్రయాణికులు అందరూ గమనించాలని పేర్కొన్నారు. అంతేకాదు కుండపోతగా కురుస్తున్న వర్షాలతో కామారెడ్డి జిల్లా మొత్తం వరద ముంపులో

---

# ఎనిమిదోసారి జపాన్‌కు ప్రధాని

- భారత్-జపాన్ 15వ వార్షిక శిఖరాగ్ర సదస్సు
- జపాన్‌లో 2 రోజుల పాటు మోదీ టూర్
- బుల్లెట్ రైలు, సెమి-కండక్టర్లలపై ఒప్పందం



2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

ఆగస్టు 29, 30 తేదీలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జపాన్‌లో పర్యటించనున్నారు. ప్రధాని అయిన తర్వాత మోదీ ఆ దేశానికి వెళ్లడం ఇది ఎనిమిదోసారి కావడం చెప్పుకోదగ్గ అంశం. శుక్రవారం షిగేరు ఇషిబా, మోదీలు కలిసి భారత్-జపాన్ 15వ శిఖరాగ్ర సదస్సును నిర్వహించనున్నారు. "15వ శిఖరాగ్ర సమావేశం ప్రధానమంత్రులు ఇద్దరూ ద్వైపాక్షిక సంబంధాలను లోతుగా సమీక్షించడానికి గత కొన్నేళ్లుగా వివిధ రంగాలలో సాధించిన పురోగతిని అంచనా వేయడానికి, ఎప్పటిలాగే, ప్రాంతీయ, ప్రపంచ ప్రాముఖ్యత గల అంశాలపై అభిప్రాయాలను పంచుకోడానికి అవకాశాన్ని కల్పిస్తుంది" అని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ మీడియాకు వెల్లడించారు. అమెరికా టారిఫ్‌ల వేళ.. మోదీ జపాన్ టూర్‌కి ప్రాధాన్యత ఏర్పడింది. "ఇది ఇరు దేశాల సంబంధాల్లో మరింత స్థిరత్వం పెంచడానికి, కొత్త అవకాశాలు, సవాళ్లకు ప్రతిస్పందించడానికి అనేక కొత్త కార్యాచరణలు ప్రారంభించడానికి కూడా ఒక అవకాశం అవుతుంది" అని తెలిపారు. విదేశాంగ శాఖ ప్రకటన ప్రకారం.. భారత్, జపాన్‌ల మధ్య ఉన్న రక్షణ, భద్రత, వాణిజ్యం, ఆర్థిక, టెక్నాలజీ, ఆవిష్కరణలు, ప్రజల మధ్య సంబంధాలు సహా ప్రత్యేక వ్యూహాత్మ, అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని ఇరువురు ప్రధానులు సమీక్షించనున్నారు. అలాగే, ప్రాంతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యత అంశాలపై కూడా చర్చిస్తారని పేర్కొంది. సెమీ-కండక్టర్ పరిశ్రమలకు గుర్తింపు పొందిన సెండాయ్

---

భారీ వర్షాల కారణంగా విద్యా సంస్థలకు సెలవు

# పరీక్షలు రద్దు



**నిజామాబాద్-నవభూమిబ్యూరో**


తెలంగాణలోని పలు జిల్లాల్లో కురుస్తోన్న భారీ వర్షాల కారణంగా తెలంగాణ వర్సిటీ పరిధిలో శుక్ర, శనివారాల్లో జరగాల్సిన అన్ని పరీక్షలు రద్దు చేశారు. పరీక్షలు ఎప్పుడు నిర్వహించేదీ తేదీని త్వరలో నిర్ణయిస్తామని వర్సిటీ వీసీ, ప్రొఫెసర్ యాదగిరి రావు వెల్లడించారు. కామారెడ్డిలో రేపు, ఎల్లుండి కూడా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. మెదక్ జిల్లాలో విద్యాసంస్థలకు రేపు సెలవు ప్రకటించారు.

---

# బెజవాడలో కృష్ణమ్మ మహోగ్రరూపం

- ప్రకాశం బ్యారేజికి ఇన్ ఫ్లో 3.13 లక్షల క్యూసెక్కుల వరద నీరు
- 69 గేట్లను పూర్తిగా ఎత్తి మొత్తం వరద నీరు దిగువకు విడుదల
- లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు
- ఈ ప్రాంతాలకు రెడ్ అలర్ట్!

2



**అమరావతి-నవభూమిబ్యూరో**


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వర్షాలు దంచి కొడుతున్నాయి. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా గత 48 గంటలుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో పాటు ఈదురు గాలుల ప్రభావం జిల్లాపై ఎక్కువగా ఉంది. ఇదిలా ఉంటే ఏపీలో మాత్రమే కాకుండా, కృష్ణా నది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ

---

# తక్షణమే ఉల్లి కొనుగోలు

ఉల్లి రైతుకు సీఎం గుడ్ న్యూస్


## సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు..



**అమరావతి-నవభూమిబ్యూరో**

రైతుల నుంచి ఉల్లి కొనుగోళ్లపై రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మార్కెటింగ్ విభాగం అధికారులు హాజరయ్యారు. గురువారం నుంచే క్వింటాకు రూ.1,200 చొప్పున రైతుల వద్ద నుంచి ఉల్లిని కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఉల్లి పంటను తక్షణమే కొనుగోలు చేసి నిల్వ చేయాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లను అద్దెకు తీసుకుని ఉల్లిని ఆరబెట్టాలని ఆదేశాలు జారీ చేశారు సీఎం చంద్రబాబు. ఉల్లికి రేటు వచ్చే వరకూ కమ్యూనిటీ హాళ్లల్లో నిల్వ చేయడానికి రైతులకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. వచ్చే పది రోజుల్లో ఐదువేల మెట్రిక్ టన్నుల ఉల్లి పంట వస్తుందని అధికారులు వివరించారు.

## భారీ వర్షాలకు 50 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఢిల్లీ సహా జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల్లో కుంభవృష్టి కురుస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుంభవృష్టికి ఎక్కడికక్కడ వరదలు సంభవిస్తున్నాయి. పలుచోట్ల భారీగా కొండచరియలు విరిగిపడి రోడ్లన్నీ బ్లాక్ అవుతున్నాయి.


భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం వల్ల చండీగఢ్-కులు హైవేపై దాదాపు 50 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ఢిల్లీ-ఎన్సీఆర్‌కు పండ్లు, కూరగాయలు తీసుకెళ్లే వందలాది ట్రక్కులు సహా వేలాది వాహనాలు ఆ మార్గంలో నిలిచిపోయాయి.



చండీగఢ్-మనాలీ హైవేపై చాలా చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో వాహనాలను అధికారులు ఎక్కడికక్కడ నిలిపివేశారు. దీంతో పలు వాహనాలు రోడ్లపై కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి.ట్రాఫిక్ కారణంగా ట్రక్కు డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయల విలువైన సరకు కుళ్లిపోతోందని వాపోయారు. ప్రతి ట్రక్కు విలువ దాదాపు రూ.4 నుంచి రూ.5 లక్షల వరకూ ఉంటుందని పేర్కొన్నారు. ఇక దాదాపు రూ.50 కోట్ల విలువైన ఆపిల్ సరకు ఇక్కడ నిలిచిపోయిందని తెలిపారు. ఓ ట్రక్కు డ్రైవర్ మాట్లాడుతూ.. సాహిబాబాద్ పండ్ల మార్కెట్‌కు ఆపిల్ లోడ్‌తో వెళ్తున్నానని అయితే, భారీ వర్షం, వరదల కారణంగా ఐదు రోజులుగా కులులో చిక్కుకుపోయినట్లు చెప్పారు. సాహిబాబాద్, ఆజాద్‌పూర్ మండీలకు వెళ్లే వేలాది ట్రక్కులు ఇక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయినట్లు పేర్కొన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
శుక్రవారం
29 । ఆగస్టు । 2025

## మిన్నియాపాలిస్ మృత్యు ఘోష: భారత్, ట్రంప్ పేర్లు రాసుకున్న దుండగుడు



**మిన్నియాపాలిస్-నవభూమి:** మిన్నసోటా రాష్ట్రం మిన్నియాపాలిస్‌లో జరిగిన కాల్పుల ఘటన అమెరికాను కుదిపేసింది. ఓ స్కూల్ వద్ద ప్రార్థనల్లో పాల్గొంటున్న చిన్నారులపై రాబిన్ వెస్ట్‌మన్ విచక్షణ రహితంగా కాల్పులు జరపగా 8, 10 ఏళ్ల వయస్సు గల ఇద్దరు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. మరో 17 మంది గాయపడ్డారు. వారిలో 14 మంది విద్యార్థులే ఉండటం విషాదకరం. రైఫిల్, షాట్‌గన్, పిస్టల్ వంటి ప్రాణాంతక ఆయుధాలను ఉపయోగించిన రాబిన్, అనంతరం తనను తాను కాల్చుకుని చనిపోయాడు. భయానక సందేశాలు దుండగుడి తుపాకులపై రాసిన రాతలు అధికారులు విస్తుపోయేలా చేశాయి. "కిల్ ట్రంప్", "న్యూక్ ఇండియా", "ఇజ్రాయెల్ మస్ట్ ఫాల్", "వేర్ ఈజ్ గాడ్?" వంటి సందేశాలు స్పష్టంగా కనిపించాయి. అంతేకాక, గతంలో స్కూల్ కాల్పులు జరిపిన ఇతర దుండగుల పేర్లు కూడా ఆయుధాలపై రాసుకున్నాడు. అదేవిధంగా, సిరిలిక్ లిపిలో (రష్యా, బల్గేరియా, ఉక్రెయిన్ వంటి దేశాల్లో ఉపయోగించే లిపి) రాసిన గూఢసందేశాలు కూడా లభించాయి. -యూట్యూబ్‌లో వీడియోలు కాల్పులకు కొన్ని గంటల ముందు రాబిన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో రెండు వీడియోలు పోస్ట్ చేశాడు. అందులో తుపాకులు, మ్యాగజైన్లు, రాసిన సందేశాలు కనిపించాయి. "ఇది నా కోసం.. అవసరమైతే ఉపయోగిస్తాను" అని చెప్పిన వీడియో కూడా లభించింది. రెండు జర్నల్స్ కూడా సిరిలిక్ లిపిలో రాసినట్లు అధికారులు గుర్తించారు. ఆ వీడియోలను ఇప్పటికే యూట్యూబ్ తొలగించగా, అవి ఏ ఉద్దేశంతో పోస్ట్ చేశాడనే దానిపై దర్యాప్తు ముమ్మరమైంది. ఎఫ్‌బీఐ దర్యాప్తు ఎఫ్‌బీఐ ఈ ఘటనను దేశీయ ఉగ్రవాదంగా పరిగణిస్తోంది. ముఖ్యంగా కేథలిక్స్‌పై ద్వేషపూరిత దాడి జరిపినట్లు అనుమానిస్తోంది. రాబిన్‌కి ఎలాంటి క్రిమినల్ రికార్డు లేకపోవడం, చట్టబద్ధంగానే ఆయుధాలు కొనుగోలు చేయడం మరింత ఆందోళన కలిగిస్తోంది. విచారణలో భాగంగా అతని కుటుంబం ప్రస్తుతం పరారీలో ఉందని సమాచారం. అధికారుల ఆందోళన యూఎస్ హోంల్యాండ్ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ మాట్లాడుతూ "అతని ఆయుధాలపై రాసిన సందేశాలను బట్టి, తీవ్ర మానసిక సమస్యలు ఉన్నట్లు అర్థమవుతోంది. ఈ స్థాయి హింస ఊహించలేనిది" అని అన్నారు. మిన్నియాపాలిస్ పోలీస్ చీఫ్ బ్రియాన్ ఒహారా కూడా "ఇది అమాయక పిల్లలపై ఉద్దేశపూర్వక దాడి.. అమానుషం" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ స్పందన ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుల పట్ల గౌరవ సూచకంగా జాతీయ జెండాను సగం ఎగరేయాలని ఆదేశించారు. - పెరుగుతున్న స్కూల్ కాల్పులు ఈ ఏడాదిలో ఇప్పటివరకు అమెరికాలో చోటుచేసుకున్న 146వ స్కూల్ కాల్పుల ఘటన ఇదే కావడం గమనార్హం. చిన్నారుల ప్రాణాలు బలికావడం, దుండగుడి భయానక సందేశాలు అమెరికా సమాజాన్ని కలవరపెడుతున్నాయి.

## సిలిండర్ పేలడం వల్లే గాయాలు, మరణానికి ముందు వైద్యులతో నిక్కీ



**నొయిడా-నవభూమి:** గ్రేటర్ నొయిడా వరకట్న వేధింపుల కేసులో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. ముఖ్యంగా ఇప్పటి వరకు భర్త, అత్తమామలే నిక్కీపై పెట్రోల్ పోసి నిప్పంటించారని వార్తలు రాగా.. తాము కళ్లారా చూశామని నిక్కీ సోదరి, ఆమె ఐదేళ్ల కుమారుడు తెలిపారు. కానీ తీవ్రమైన కాలిన గాయాలతో బాధ పడుతూ ఆసుపత్రిలో మరణించిన నిక్కీ భాటి మాత్రం చనిపోవడానికి ముందు ఇచ్చిన వాంగ్మూలంలో షాకింగ్ విషయాలు చెప్పినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆమె మరణానికి వరకట్నం వేధింపులు కారణం కాదని.. గ్యాస్ సిలిండర్ పేలుడే కారణమని నిక్కీ వైద్యులతో చెప్పినట్లు పోలీసుల విచారణలో తేలింది.మొదట నిక్కీ భాటి కుటుంబం ఆమె అత్తమామలు, భర్త విపిన్‌పై తీవ్ర ఆరోపణలు చేసింది. వరకట్నం కోసం నిక్కీని వేధించి పెట్రోల్ పోసి నిప్పంటించి చంపారని ఆమె సోదరి కంచన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిక్కీ ఐదేళ్ల కుమారుడు కూడా.. నాన్నే తన తల్లిని చంపాడని చెప్పాడు. ఈక్రమంలోనే కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిక్కీ భర్త విపిన్ భాటితో పాటు అతని తల్లిదండ్రులు, సోదరుడు రోహిత్‌ను అరెస్ట్ చేశారు. అలాగే వరకట్నం కోసం వేధిస్తూ.. విపిన్, అతడి తల్లిదండ్రులు నిక్కీపై దాడి చేసిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇలా ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.అయితే నిక్కీ భాటి చనిపోవడాని ముందు ఇచ్చిన మరణ వాంగ్మూలంలో.. షాకింగ్ విషయాలను వెల్లడించింది. ముఖ్యంగా ఫోర్టిస్ ఆసుపత్రిలో వైద్యులు, ఒక నర్సు ముందు నిక్కీ చేప్పిన విషయాలు విచారణను మలుపు తిప్పాయి. ఆ వాంగ్మూలంలో నిక్కీ.. తన గాయాలు వరకట్న వేధింపుల వల్ల కాలేదని, తన అత్తగారింట్లో జరిగిన సిలిండర్ పేలుడు వల్ల సంభవించాయని స్పష్టం చేసింది. ఈ వాంగ్మూలం ఆమె కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలకు పూర్తిగా విరుద్ధంగా ఉండడంతో.. పోలీసులు గందరగోళానికి గురవుతున్నారు.

ఈ మరణ వాంగ్మూలం వెలువడిన తర్వాత పోలీసులు రెండు కోణాల్లో విచారణను కొనసాగిస్తున్నారు. వరకట్నం కోసం హత్య చేశారా లేదా సిలిండర్ పేలుడు నిజంగానే జరిగిందా అని పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా కుటుంబంలో ఉన్న ఇతర విభేదాలను కూడా విచారణలో భాగంగా పరిశీలిస్తున్నారు. నిక్కీ, ఆమె సోదరి ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేయడం, బ్యూటీ పార్లర్ నడపడం వంటి విషయాలపై కూడా అత్తమామలతో వారికి గొడవలు ఉన్నట్లుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.ప్రస్తుతం పోలీసులు ఈ కేసులో రెండు వాదనలను ధృవీకరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఆసుపత్రిలో రికార్డు చేసిన నిక్కీ వాంగ్మూలం ఎంత వరకు నిజమనే దానిపై, అలాగే ఆమె కుటుంబం చేసిన ఆరోపణల వెనుక ఉన్న నిజాలను తెలుసుకోవడానికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకు నిక్కీ మరణానికి అసలు కారణం ఏమిటో తెలియడం కష్టమే.

## 34 మంది చనిపోయినా

## వైష్ణోదేవి యాత్రను ఎందుకు కొనసాగిస్తున్నారు: ఒమర్ అబ్దుల్లా



**కశ్మీర్-నవభూమి:** జమ్మూ కశ్మీర్‌లో కొండచరియలు విరిగిపడి, ఆకస్మిక వరదలు రావడంతో వైష్ణో దేవి యాత్రలో 34 మందికి పైగా యాత్రికులు మరణించిన ఘటనపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ దుర్ఘటనపై లెఫ్టినెంట్ గవర్నర్ ఆధ్వర్యంలోని దేవస్థానం బోర్డును తీవ్రంగా ప్రశ్నించారు. భారీ వర్షపాతం ఉంటుందని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించినప్పటికీ.. యాత్రను ఎందుకు నిలిపివేయలేదని అధికారులను అడిగారు. కొండచరియలు విరిగిపడటంతో జరిగిన ఈ విషాదంపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ విషయమై ఒమర్ అబ్దుల్లా తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. అందులో "వాతావరణ హెచ్చరికలు ఉన్నాయని తెలిసినప్పుడు.. వైష్ణో దేవి యాత్రను ఎందుకు కొనసాగించారు? భక్తుల భద్రతకు సంబంధించి అధికార యంత్రాంగం ఏ చర్యలు తీసుకుంది?" అని సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. అమర్‌నాథ్ యాత్రను వాతావరణ పరిస్థితుల ఆధారంగా తరచుగా నిలిపివేస్తుంటారని గుర్తు చేస్తూ.. అదే నిబంధనలు వైష్ణో దేవి యాత్రకు ఎందుకు వర్తించలేదని అధికారులను నిలదీశారు.గత కొన్ని రోజులుగా జమ్మూ కశ్మీర్‌లో రికార్డు స్థాయిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీని ఫలితంగా రాష్ట్రంలో పలుచోట్ల ఆకస్మిక వరదలు వచ్చాయి. అలాగే కొండచరియలూ విరిగిపడ్డాయి. వైష్ణో దేవి పుణ్యక్షేత్రం ఉన్న రియాసీ జిల్లాలో ఈ విషాదం చోటు చేసుకుంది. కొండచరియలు విరిగిపడటంతో సుమారు 34 మంది యాత్రికులు దుర్మరణం చెందారు. ఇందులో 14 మంది మృతదేహాలను గుర్తించి జమ్మూలోని మెడికల్ కళాశాలకు తరలించారు. వీరిలో ఎక్కువ మంది పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందినవారు.ప్రస్తుతం ఆ ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాల కింద ఇంకా ఎవరైనా చిక్కుకుపోయారా అనే అనుమానంతో సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఈ దుర్ఘటనపై లెఫ్టినెంట్ గవర్నర్ అధికార యంత్రాంగం ఒక ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. దీనిపై పూర్తి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను కోరింది. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కూడా ప్రకటించినట్లు అధికారులు తెలిపారు.ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలను నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఒమర్ అబ్దుల్లా విమర్శించారు. భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయంలో.. యాత్రను నిలిపి వేయడంలో దేవస్థానం బోర్డు విఫలం అయిందని ఆయన ఆరోపించారు. ఈ విషాదం ప్రభుత్వానికి ఒక గుణపాఠం కావాలని.. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒమర్ అబ్దుల్లా చేసిన ఈ వ్యాఖ్యలు జమ్మూ కశ్మీర్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి.

## యూఎస్ స్కూల్ ప్రేయర్ వేళ కాల్పులు.. ఇద్దరు చిన్నారులు మృతి



**మిన్నెసోటా-నవభూమి:** అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి కాల్పుల ఉదంతం తెర మీదకు వచ్చింది. తాజా ఉదంతంలో ముక్కుపచ్చలారని ఇద్దరు స్కూల్ విద్యార్థులు మృతి చెందారు. ఈ ఉదంతం అమెరికాలో షాకింగ్ గా మారింది. మిన్నెసోటా మినియాపొలిస్ లో ఒక క్యాథలిక్ స్కూల్లో ప్రేయర్ జరుగుతుండగా ఈ దారుణం చోటు చేసుకుంది. ఈ కాల్పుల ఉదంతంలో మొత్తం 17 మందికి గాయాలు కాగా.. వారిలో పద్నాలుగు మంది పిల్లలే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. స్కూల్ స్టార్ట్ అయిన మూడు రోజులకే ఈ కాల్పుల ఉదంతం చోటు చేసుకోవటం గమనార్హం. ఆయుధాలు ధరించి స్కూల్ కు వచ్చిన నిందితులు.. విద్యార్థులు ప్రార్థనలు చేస్తుండగా.. చర్చి కిటికీలో నుంచి విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. ఈ షాకింగ్ ఉదంతంలో కాల్పులకు పాల్పడిన నిందితుడ్ని పోలీసులు కాల్చేశారు. నిందితుడి వయసు 23 ఏళ్లుగా చెబుతున్నారు. కాల్పులకు ఉపయోగించిన పిస్టల్ ను చట్టబద్ధంగా కొనుగోలు చేశారని తెలుస్తోంది. అయితే.. పోలీసులు కాల్పులు జరుపుతున్న నిందితుడ్ని కాల్చేశారు. అతడ్ని రాబిన్ వెస్ట్ మ్యాన్ గా పిలుచుకుందామని పేర్కొన్నారు. కాల్పుల కోసం మొత్తం మూడు పిస్టళ్లను ఉపయోగించినట్లుగా గుర్తించారు. అతడి బ్యాక్ గ్రౌండ్ చెక్ చేయగా.. ఎలాంటి నేరచరిత్ర లేని వ్యక్తిగా పోలీసులు చెబుతున్నారు. ఈ ఉదంతంపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. అయితే.. కాల్పులు ఎందుకు జరిపారన్న అంశాన్ని మాత్రం గుర్తించలేదు. స్కూల్ కాల్పుల ఘటనపై మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్ స్పందిస్తూ.. ఈ తరహా ఘటనలు చోటు చేసుకోవటంపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.


## ఆంధ్రాకు ఆడనని శపథం.. త్రిపురకు వెళ్లిపోయిన క్రికెటర్



**హైదరాబాద్-నవభూమి:** సరిగ్గా ఎన్నికల ముంగిట గత ఏడాది ఆంధ్రా-హైదరాబాద్ క్రికెటర్ హనుమ విహారి భారీ సంచలనం రేపాడు. అప్పటి అధికార పార్టీ వైసీపీకి చెందిన ఓ చోటా నాయకుడి మీద ఆరోపణలు చేస్తూ.. భవిష్యత్తులో ఇంకెప్పుడూ ఆంధ్రాకు ఆడను అని భీషణ ప్రతిజ్ఞ చేశాడు. వాస్తవానికి ఆ సమయంలో విహారి ఆంధ్రా జట్టు కెప్టెన్. దేశవాళీ క్రికెట్ లో కీలకమైన రంజీ ట్రోఫీ జరుగుతోంది. అలాంటి సమయంలో విహారి ప్రకటన కలకలం రేపింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)లో అప్పట్లో వైసీపీ నాయకులు, వారి దగ్గరివారు హవా సాగిస్తుండడంతో చివరకు అప్పటి ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చింది. అదంతా పక్కనపెడితే... ఏపీలో ప్రభుత్వం మారాక సైతం విహారి నిరుడు ఆంధ్రాకే ఆడాడు. ఇప్పుడు మాత్రం ఆంధ్రాను వీడి వేరే రాష్ట్రానికి వెళ్లిపోతున్నాడు.. 3వ వంతుపైగా ఫీజు ఫైన్ ఈశాన్య రాష్ట్రం తరఫున.. ఆంధ్రాలో పుట్టి హైదరాబాద్ లో పెరిగి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీఏ) ద్వారా వెలుగులోకి వచ్చాడు విహారి. తొలుత హైదరాబాద్ కు రంజీల్లో ఆడిన అతడు.. అనంతరం ఆంధ్రాకు మారాడు. 2004 ప్రారంభంలో వివాదం కారణంగా ఆ జట్టును వీడతానని ప్రకటించినా, గత సీజన్ కూడా ఆడాడు. ఇప్పుడు మాత్రం ఈశాన్యం రాష్ట్రం త్రిపురకు మారుతున్నాడు. 2025-26 దేశవాళీ సీజన్ లో ఆ రాష్ట్రం నుంచి ఆడబోతున్నట్లు ప్రకటించాడు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ... విహారికి నిరభ్యంతర పత్రం జారీ చేసింది.అయినా ఆ జట్టు ఓడింది ఏపీఎల్ టాపర్.. టి20 లీగ్ ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) ఇటీవల జరిగింది. ఇందులో విహారినే ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ. అయినా అతడికి టి20 ఫార్మాట్ లో ఆంధ్రా జట్టులో చోటుపై హామీ దక్కలేదు. మూడు ఫార్మాట్లలో ఆడాలనేది విహారి కోరిక. దీంతోనే త్రిపురకు వెళ్లాడు. వన్డే, టి20 ఫార్మాట్లలో ఏసీఏ యువ ఆటగాళ్ల కోసం చూస్తోందని 32 ఏళ్ల విహారి తెలిపాడు. అందుకనే అతడికి అవకాశాలు ఇవ్వలేమని ఏసీఏ స్పష్టం చేసింది. త్రిపురకు బలం... ఈశాన్య రాష్ట్రమైన త్రిపుర రంజీ ట్రోఫీలో ఎలైట్ సి లో ఉంది. ఆంధ్రా మాత్రం ఎలైట్ ఎలో ఉంది. ఈలెక్కన చూస్తే వ్యక్తిగతంగా విహారికి నష్టమే అని చెప్పాలి. దేశవాళీల్లో బలమైన ఆంధ్రాకు కూడా నష్టమే. పెద్దగా పేరు లేని త్రిపురకు మాత్రం కచ్చితంగా లాభం. విహారి వంటి అంతర్జాతీయ క్రికెటర్ రాక ఆ జట్టుకు ఉపయోగపడుతుంది.

## జమ్మూ కాశ్మీర్‌లో ఆపరేషన్ నౌషేరా నార్-4..

## ఇద్దరు ఉగ్రవాదుల హతం



**పూంచ్-నవభూమి:** జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో భారత సైన్యం మరోసారి తన ధైర్య సాహసాలను ప్రదర్శించింది. సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వెంబడి దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఉగ్రవాదుల యత్నాన్ని భద్రతా దళాలు విజయవంతంగా భగ్నం చేశాయి. ఈ ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం అయ్యారు. చొరబాటుకు ప్రయత్నించిన మిగతా ఉగ్రవాదుల కోసం ఆ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఓవైపు విపరీతంగా వర్షం కురుస్తున్నా ఏమాత్రం పట్టించుకోకుండా.. ముష్కరులను పట్టుకునేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాయి.జమ్మూ కాశ్మీర్‌లో వాతావరణ పరిస్థితులు క్షీణించినప్పుడల్లా ఉగ్రవాదులు దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నిస్తుంటారు. ప్రస్తుతం భారీగా వర్షాలు కురుస్తుండగా.. ఇదే అదునైన సమయం అని భావించి ఇద్దరు ఉగ్రవాదులు చొరబాటుకు యత్నించారు. ముఖ్యంగా పూంచ్ జిల్లాలోని ఎల్ఓసీ వద్ద నుంచి కంచె దాటాలని ప్రయత్నించారు. అయితే ఎప్పటిలాగే వాతావరణ పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నా సైనికులు మాత్రం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలోనే సరిహద్దు వెంబడి అనుమానాస్పద కదలికలను గుర్తించారు. వెంటనే అప్రమత్తమై ఉగ్రవాదులను ఎదుర్కొన్నారు.ముఖ్యంగా ఆపరేషన్ నౌషేరా నార్ 4 పేరిట సైనికుల ధాటికి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. సైనికుల సకాలంలో స్పందించడం వల్ల పెద్ద ముప్పు తప్పిందని రక్షణ వర్గాలు తెలిపాయి. ఉగ్రవాదులు భారీ ఆయుధాలతో దేశంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించినట్లు సమాచారం. ఈ ఆపరేషన్ తర్వాత కూడా సైనికల బలగాలు ఆ ప్రాంతంలో.. మరికొంత మంది ఉగ్రవాదులు దాక్కుని ఉండవచ్చు అనే అనుమానంతో భారీ ఎత్తున గాలింపు చర్యలను చేపట్టాయి. అటవీ ప్రాంతం, కొండ ప్రాంతాలను క్షుణ్ణంగా జల్లెడ పడుతున్నాయి. భద్రతా దళాలు ప్రతి మూలను గాలిస్తూ ఉగ్రవాదుల జాడ కోసం వెతుకుతున్నాయి. ఈ గాలింపు చర్యలు ముగిసే వరకు ఆ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేయాలని అధికారులు నిర్ణయించారు.

నెల రోజుల క్రితమే భారత సైన్యం ఆపరేషన్ అఖాల్ చేపట్టి.. మొత్తంగా ఆరుగురు ఉగ్రవాదులను హతమార్చింది. ఈ ఘటనలో ఓ సైనికుడు కూడా గాయపడ్డాడు. ఆగస్టు 2వ తేదీన అఖాల్ అటవీ ప్రాంతంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో భద్రతా దళాలు ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. ఆ తర్వాతి రోజుల్లో మరో ముగ్గురుని హతమార్చాయి. దట్టమైన అటవీ ప్రాంతంలో ముష్కరులు ఉన్నట్లు వచ్చిన సమాచారంతో నిఘా పెట్టి ఈ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. అయితే ఈ హతులు అంతా నిషేధిత లష్కరే తోయిబా ప్రాక్సీ సంస్థ అయన ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌తో అనుబంధంగా ఉన్నారని కూడా అధికారులు గుర్తించారు.

## హిమాచల్‌పై ప్రకృతి ప్రకోపం.. 310 మంది మృతి



**సిమ్లా-నవభూమి:** హిల్ స్టేట్ హిమాచల్ ప్రదేశ్ ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తు న్నాయి. క్లౌడ్‌బరస్ట్, ఆకస్మిక వరదలకు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఈ ఏడాది జూన్ 20న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు కలిపి రూ.2,62,336.38 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది.రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ తెలిపిన వివరాల ప్రకారం.. రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి అంటే జూన్ 20 నుంచి ఆగస్టు 27 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా మరణించిన వారి సంఖ్య 310కి చేరింది. అందులో వర్షం కారణంగా సంభవించిన ప్రమాదాలు.. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు, క్లౌడ్‌బరస్ట్‌లు, ఇళ్లు కూలిపోవడం, నీటిలో మునిగిపోవడం, విద్యుత్ షాక్ వంటి ప్రమాదాల కారణంగా 158 మంది మరణించగా.. రోడ్డు ప్రమాదాల్లో 152 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 369 మంది గాయపడ్డారు. 38 మంది గల్లంతయ్యారు.ఈ వర్షాలకు మండి జిల్లా అత్యధికంగా ప్రభావితమైంది. అక్కడ 51 మంది మరణించారు. అందులో 29 మరణాలు వర్ష సంబంధించినవి కాగా, 22 రోడ్డు ప్రమాదాల కారణంగా సంభవించినవి. ఇక కాంగ్రాలో 49, చంబాలో 36, సిమ్లాలో 28 మరణాలు నమోదయ్యాయి. ఈ వర్షాలకు భారీగా ఆస్తి నష్టం సంభవించింది. మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. ఇళు ధ్వంసమయ్యాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. విద్యుత్, నీటి సరఫరా పథకాలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు కలిపి మొత్తం రూ.2,62,336.38 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా.రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ ప్రకారం.. బుధవారం సాయంత్రం నాటికి రెండు జాతీయ రహదారులు సహా దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 582 రోడ్లు బ్లాక్ అయ్యాయి. కులు, మండి, కాంగ్రా, సిమ్లా జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కులు జిల్లాలో మాత్రమే %చీఎ-03, చీఎ%-305లను అధికారులు మూసివేశారు. 1,155 విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. 346 నీటి సరఫరా పథకాలు పనిచయడం లేదు.

## ఊహించని విషాదం.. మొదటి పుట్టిన రోజునాడే తిరిగిరాని లోకాలకు..

**పాల్‌ఘర్-నవభూమి:** మహారాష్ట్రలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బిల్డింగ్ కుప్పకూలిన ఘటనలో 17 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇక్కడ అత్యంత విషాదకరమైన విషయం ఏంటంటే.. మొదటి పుట్టిన రోజు వేడుక జరుగుతుండగానే ఓ చిన్నారి కూడా ప్రాణాలు పోగొట్టుకుంది. చిన్నారి కుటుంబం మొత్తం శిథిలాల కింద సజీవ సమాధి అయింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. పాల్‌ఘర్ జిల్లా విరార్‌కు చెందిన ఆరోహి జోయల్, ఓమ్‌కార్ జోయల్‌లు రామ్‌భాయ్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు.ఆగస్టు 27వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో ఈ దంపతుల కూతురు ఉత్కర్ష మొదటి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా మొదలయ్యాయి. పెద్దఎత్తున జనం వచ్చారు. సరిగ్గా 12 గంటల సమయంలో పాప కేక్ కట్ చేసింది. తర్వాత అందరూ ఫొటోలు దిగుతూ ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఊహించని విషాదం చోటుచేసుకుంది. 13 ఏళ్ల క్రితం కట్టిన ఆ భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. శిథిలాల కింద పడి చిన్నారి కుటుంబంతోపాటు మొత్తం 17 మంది చనిపోయారు.

## నాలుగుసార్లు మోదీకి ఫోన్ చేసిన ట్రంప్.. అయినా నో రిప్లయ్?



**వాషింగ్టన్-నవభూమి:** అదనపు సుంకాలపై భారత్, అమెరికాల మధ్య వివాదం కొనసాగుతున్న వేళ.. అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడటానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విముఖత వ్యక్తం చేసినట్టు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జర్మన్ పత్రిక ఫ్రాంక్‌ఫర్టర్ అల్గెమైన్ జైటుంగ్ ఓ కథనం ప్రచురించింది. నాలుగు సార్లు ట్రంప్ ఫోన్ చేసినా.. స్పందించలేదని నివేదించింది. ఇది 'ఆయన మోదీ అసహనం, అలాగే హెచ్చ రిక' ఫలితంగా జరిగిందని నివేదిక పేర్కొంది. జపాన్ దినపత్రిక నిక్కై ఆసియా సైతం ఇటువంటి వాదనలే చేసింది. ప్రధానమంత్రి మోదీ ట్రంప్ కాల్స్‌కు స్పందించడం లేదని, ఇది 'అమెరికా అధ్యక్షుడిలో నిరాశను పెంచుతోంది' అని పేర్కొంది. బ్రెజిల్ తప్ప మరే దేశానికి లేనంతంగా భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలను 50 శాతానికి పెంచిన తర్వాత.. న్యూఢిల్లీ- వాషింగ్టన్ మధ్య సంబంధాల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తుందని ఆరోపిస్తూ అదనపు సుంకాలను విధించారు. అయితే, భారత్ మాత్రం ఈ బెదిరింపులకు లొంగేది లేదని తేల్చిచెప్పింది. తాము ఒత్తిడిని ఎదుర్కొడానికి సిద్ధంగా ఉన్నామని, దేశ రైతుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీపడ బోమని ప్రధాని నరేంద్ర మోదీసుంకాలకు సంబంధించిన అమెరికా ఒత్తిడిని ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని భారత్ స్పష్టం చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం దేశ రైతుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీపడబోమని ప్రతిజ్ఞ చేసిన విషయాన్ని భారత్ నొక్కి చెప్పింది. అమెరికా-భారత్ వాణిజ్య ఘర్షణలో ట్రంప్ ఒత్తిడికి న్యూఢిల్లీ తలొగ్గదనడానికి ఇది సంకేతమని జర్మన్ పత్రిక నివేదించింది. 'మోదీ అవమానంగా భావిస్తున్నారనే సంకేతాలు ఉన్నాయి' అని ఎఫ్ఏజెడ్ నివేదించింది, ట్రంప్‌తో మాట్లాడటానికి మోదీ ఇష్టపడకపోవడం చూస్తే అమెరికా అధ్యక్షుడి చర్యల వల్ల ఆయన ఎంత అసహనానికి గురయ్యారో తెలియజేస్తుందని జోడించింది. పాకిస్థాన్‌తో సంబంధాలను పెంచుకునే ప్రణాళిక గురించి ట్రంప్ చేసిన ప్రకటనల కారణంగా.. భారత అవగాహనలో ఆయన ఇమేజ్ గణనీయంగా మారిందని కూడా ఆ వార్తాపత్రిక పేర్కొంది. మే నెల నుంచి ట్రంప్ పదే పదే భారత్, పాకిస్థాన్ మధ్య అణు యుద్ధాన్ని తానే ఆపేశానని చెప్పుకుంటున్నారు దీనిని భారత్ మాత్రం ఖండించింది. ట్రంప్ 'ఆడంబరమైన, బెదింపుల దౌత్యం' రెండు దేశాల సంబంధాలలో మరొక ఒత్తిడి అంశంగా మారిందని జపాన్ పత్రిక నివేదిక తెలిపింది. ఇదిలా ఉండగా, భారత వస్తువులపై డొనాల్డ్ ట్రంప్ విధించిన 25 శాతం కలిపి మొత్తం 50 శాతం అదనపు టారీఫ్‌లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి వచ్చాయి.

## 20 కళాశాలలకు బాంబు బెదిరింపులు.. పోలీసులు అలర్ట్

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశరాజధాని ఢిల్లీలోని పలు విద్యాసంస్థలకు వరుస బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే నగరంలోని పలు పాఠశాలలకు, కళాశాలలకు వరుసగా ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా దాదాపు 20 కళాశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి.ఈ మెయిల్స్ ద్వారా ఈ బాంబు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఢిల్లీలోని చాణక్యపురి లోగల జీసస్ అండ్ మేరీ కాలేజ్ సహా దాదాపు 20 కళాశాలలకు ఈ బెదిరింపులు వచ్చినట్లు చెప్పారు. బెదిరింపు మెయిల్స్‌తో అప్రమత్తమైన ఆయా కళాశాలల యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఢిల్లీ పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన కళాశాలల వద్దకు చేరుకొని తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో కళాశాలల ప్రాంగణంలో క్షుణ్ణంగా సోదాలు చేశారు.

## పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్.. స్కూళ్లకు కీలక సూచన



న్యూఢిల్లీ-నవభూమి: మన దేశంలో ప్రతి ఒక్కరికీ ఆధార్ నెంబర్ ఎంత కీలకమో అందరికీ తెలిసిందే. ఇక పిల్లల విషయానికి వస్తే, ఆధార్ డేటా సరైనంగా ఉండడం మరింత అవసరం. అయితే చాలా మంది తల్లిదండ్రులు దీనిని సరిగా పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా దీని గురించి స్కూళ్లను అలర్ట్ చేస్తూ, ఈ ప్రక్రియను ముందే పూర్తిచేయాలని కోరుతోంది. చెప్పింది ఏమిటంటే, పిల్లలు 5 సంవత్సరాల వయసు చేరినప్పుడు ఒకసారి, ఆ తరువాత 15 సంవత్సరాల వయసులో మళ్లీ ఒకసారి ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ చేయాల్సి ఉంటుంది. ఇది తప్పనిసరి. ఈ అప్డేట్ వల్ల పిల్లల ఆధార్ డేటాలో ఫింగర్ ప్రింట్, ఐరిస్ స్కాన్ లాంటి బయోమెట్రిక్ వివరాలు కరెక్ట్‌గా నమోదు అవుతాయి. స్కూళ్లను ముందుకు తీసుకురావడం.. ఇప్పుడు స్కూళ్లను ముందుకు తీసుకురావడం ద్వారా ఈ ప్రక్రియను సులభతరం చేయాలనుకుంటోంది. స్కూళ్లకు సంబంధించిన విద్యా డేటాను నిర్వహించే అనే అప్లికేషన్‌లో విద్యార్థుల బయోమెట్రిక్ స్టేటస్ కనిపించేలా మార్పులు చేశారట. అంటే, స్కూల్ యాజమాన్యానికి వెంటనే తెలిసిపోతుంది. ఎవరి అప్డేట్ పెండింగ్‌లో ఉందనేది.

**ఎందుకు అవసరం ఈ అప్డేట్?**

ఇది ఆలస్యం అయితే పిల్లలు భవిష్యత్తులో ఎన్నో ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొనవచ్చు. ముఖ్యంగా లాంటి కీలక పరీక్షలకు నమోదు చేసుకునే సమయంలో ఆధార్ తప్పనిసరిగా ఉండాలి. ఆ సమయానికి బయోమెట్రిక్ లోపం ఉంటే, అప్పుడు ఇబ్బందులు తప్పవు. ఇదంతా ఉండకూడదని అనుకుంటే ముందుగానే అప్డేట్ చేసుకోవడం మంచిది.

## ఆధార్ అనుసంధానంతోనే ఓటు అక్రమాలకు చెక్

భారతదేశ ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అతిపెద్దది. వందల కోట్ల జనాభా మధ్యా పౌర హక్కులను కాపాడుతూ, సమానత్వంతో ఎన్నికలు నిర్వహించడం ఒక మహత్తరమైన సవాలు. ప్రతి ఐదు సంవత్సరాలకోసారి జరిగే సాధారణ ఎన్నికలతో పాటు మధ్యంతర ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు కలిపి దేశంలో ఎప్పటికప్పుడు ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది. కానీ ఈ ఎన్నికల పట్ల ఎప్పటినుంచో ఒకే విధమైన అనుమానం, ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి. అదే "ఓటు అక్రమాలు". డూప్లికేట్ ఓటర్ ఐడీలు, లేని చోట ఓట్ల చేర్పు, ఉన్న చోట తొలగింపులు, వలసల ద్వారా బినామీ ఓటర్లు, ప్రాక్సీ ఓటింగ్%ఖుశ్రీశ్రీ% ఇవన్నీ ప్రజాస్వామ్య నమ్మకాన్ని దెబ్బతీసే అంశాలు. తాజాగా రాహుల్‌గాంధీ లేవనెత్తిన ఓటు చోరీ ఆరోపణలు కొత్తవి కావు. ఇది దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్య. ఇలాంటి సందర్భంలో ఆధార్ అనుసంధానం మాత్రమే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం ఇవ్వగలదనే అభిప్రాయం మరింత బలపడుతోంది. ఎన్నికల కమిషన్ ఎప్పటినుంచో ఓటరు జాబితాలను సవరించడంలో బిజీగా ఉంటుంది. ప్రతి ఎన్నిక ముందు బూత్ స్థాయిలో పరిశీలనలు చేస్తూ, ఒకే వ్యక్తికి రెండు సార్లు పేర్లు వచ్చాయా లేదా, మరణించిన వ్యక్తుల పేర్లు తొలగించాయా లేదా అనే ప్రక్రియలో విపరీతమైన మానవ శక్తి, ధనం వృథా అవుతోంది. కానీ ఎప్పటికీ శాశ్వత పరిష్కారం కనిపించడం లేదు. అసలు సమస్య రూట్ లెవల్‌లో ఉంది. భారతదేశంలో పౌరులని ప్రత్యేకంగా గుర్తించే ఒకే విధమైన, పకడ్బందీ గుర్తింపు వ్యవస్థ చాలా కాలం లేదు. పాస్‌పోర్ట్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీఇవన్నీ వేరువేరు డేటాబేస్‌లుగా ఉండిపోయాయి. ప్రతి డేటాబేస్‌లో తప్పులు ఉండటంతో ఓటరు గుర్తింపు సమస్య ఎప్పటికీ పరిష్కారం కాని దానిగా మారింది. ఇదే సమయంలో ఆధార్ కార్డు ప్రవేశపెట్టబడింది. ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో ప్రతి వ్యక్తికి బయోమెట్రిక్ ఆధారంగా ఒక రికార్డు తయారవ్వడం ఒక విప్లవాత్మక అడుగు. కానీ ప్రారంభ దశలో డిజైన్ లోపాల వలన ఆధార్ ప్రాజెక్ట్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్‌గా మారింది. వ్యక్తి వివరాలతో పాటు చిరునామా, తల్లి తండ్రి పేర్లు, ఫోన్ నెంబర్, గ్యాస్ కనెక్షన్ నెంబర్ వంటి వాటిని సేకరించారు. దీని వలన గోప్యత సమస్యలు తలెత్తాయి. సుప్రీంకోర్ట్ జోక్యం చేసుకోవడంతో ఆధార్‌ను ఐచ్ఛికం చేశారు. ఆ క్షణం నుంచే అసలు లక్ష్యం నీరుగారిపోయింది. పౌరులు ప్రయోజనం ఉన్న దగ్గర ఆధార్ వాడుతున్నారు, తప్పించుకోవాల్సిన చోట వేరే ఐడీలు వాడుతున్నారు. ఇప్పుడు అసలు ప్రశ్న: ఆధార్‌ను ఓటింగ్ ప్రక్రియకు కచ్చితంగా అనుసంధానం చేస్తే ఓటు అక్రమాలకు చెక్ పడుతుందా? సమాధానం అవును. కానీ దానికోసం కొన్ని మార్పులు తప్పనిసరి. ముందుగా ఆధార్‌ను రెండు విభాగాలుగా విభజించాలి1) ఆధార్ ఐడీ 2) ఆధార్ అడ్రస్. ఆధార్ ఐడీ కార్డులో కేవలం ఫోటో, పేరు, యూనీక్ నెంబర్ మాత్రమే ఉంచాలి. చిరునామా, ఫోన్ వంటి వివరాలను తొలగించాలి. ఇవి కేవలం ఐడెంటిటీని సూచించాలి. మరోవైపు ఆధార్ అడ్రస్ కార్డులో శాశ్వత చిరునామా, ప్రస్తుత చిరునామా రెండూ వేరువేరుగా ఉండాలి. ప్రస్తుత చిరునామాను వ్యక్తులు డిజిటల్‌గా, స్వీయ ధృవీకరణ పద్ధతిలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకునే వీలు కల్పించాలి. ఈ విధంగా యుటిలిటీ సర్వీసులు, స్థానిక సేవలు చిరునామా ఆధారంగానే అందేలా వ్యవస్థ రూపొందించాలి. ఇది అమలు చేస్తే రెండు ప్రయోజనాలు కలుగుతాయి. ఒకటి, ప్రతి వ్యక్తి వలస చరిత్ర రికార్డు అవుతుంది. అతను ఏ రాష్ట్రం నుండి ఏ రాష్ట్రానికి వెళ్ళాడు, ఏ గ్రామం నుండి ఏ పట్టణానికి మారాడు అన్నది సిస్టమ్‌లో సులభంగా ట్రేస్ చేయవచ్చు. రెండవది, ఎక్కడ ఓటు హక్కు వినియోగించుకోవాలో స్పష్టత వస్తుంది. డూప్లికేట్ ఓటర్ల సమస్య స్వయంగా పరిష్కారమవుతుంది. మరో ముఖ్య అంశం జనన మరణాలను నేరుగా ఆధార్‌తో అనుసంధానం చేయాలి. ప్రతి పుట్టుకకు వెంటనే ఆధార్ నెంబర్ ఇవ్వాలి. ప్రతి మరణం తర్వాత ఆ ఆధార్ నెంబర్ రద్దు చేయాలి. ఈ ప్రక్రియను "నేషనల్ హ్యూమన్ రిజిస్టర్"గా అభివృద్ధి చేయాలి. ఈ రిజిస్టర్ దేశంలోని ప్రతి జీవించి ఉన్న మనిషి డేటాబేస్ అవుతుంది. 18 సంవత్సరాలు నిండిన వ్యక్తులకు ఆటోమేటిక్‌గా ఓటర్ ఐడీ విడుదల కావాలి లేదా ఆధార్ ఐడీని ఓటింగ్‌కు ఎనేబుల్ చేయాలి. ఈ విధానం అమల్లోకి వస్తే ఎలక్షన్ కమిషన్‌కు ప్రతిసారి ఓటర్ జాబితా సవరణ పనులు ఉండవు. హోమ్ మినిస్ట్రీ దగ్గర ఉన్న జాబితా ఆధారంగా ఎన్నికలకు సిద్ధం కావచ్చు. ఎన్నికల ప్రక్రియలో డిజిటలైజేషన్ కూడా కీలకం. పోలింగ్ బూత్‌లలో ట్యాబ్‌ల వాడకం మొదలు పెట్టాలి. ప్రతి నియోజకవర్గం ఓటర్ల జాబితా ఆ ట్యాబ్‌లలో ఉండాలి. ఓటరు పోలింగ్ బూత్‌కి వచ్చాక తన ఓటర్ ఐడీ లేదా ఆధార్ ఐడీలో ఉన్న బార్‌కోడ్ స్కాన్ చేయాలి. తర్వాత బయోమెట్రిక్ (థంబ్) లేదా ఓటీపీ ద్వారా తనని తాను ధృవీకరించుకోవాలి. అవసరమైతే ట్యాబ్ ద్వారా ఓటరు ఫోటో కూడా తీసుకోవచ్చు. ఈ విధంగా ఫేక్ ఓటింగ్, బినామీ ఓటింగ్ పూర్తిగా నిలిచిపోతాయి. డిజిటల్ ట్యాబ్ వాడకం వల్ల మరో ప్రయోజనం ఉంటుంది. అదే రియల్ టైమ్ మోనిటరింగ్. ప్రతి బూత్‌లో ఎంతమంది ఓటేశారు అన్నది క్షణక్షణం సెంట్రల్ సర్వర్‌లో అప్‌డేట్ అవుతుంది. పోలైన ఓట్లు, సంతకాల మధ్య తేడా ఉండదు. అంతే కాకుండా ఓటర్లు తమ నియోజకవర్గంలో ఎక్కడ ఉన్నా, ఏ బూత్‌లోనైనా ఓటు వేయగలరు. ఈ విధంగా ఓటింగ్ శాతం పెరుగుతుంది. తరచూ బయటకు వెళ్ళేవారు, వలస వెళ్లిన వారు కూడా సులభంగా ఓటు వేయగలరు. మొత్తంగా చూస్తే భారతదేశంలో ఎన్నికల పట్ల ఉన్న అనుమానాలను, ఆరోపణలను, వ్యతిరేకతలను తొలగించాలంటే ఆధార్ అనుసంధానం తప్పనిసరి. ఆధార్ ప్రాజెక్ట్‌ను సరైన విధంగా విభజించి, గోప్యతకు భంగం కలగకుండా మార్పులు చేస్తే ఈ వ్యవస్థ మరింత పకడ్బందీ అవుతుంది. ఓటరు గుర్తింపు సమస్య ఒకసారిగా పరిష్కారం అవుతుంది. ఎలక్షన్ కమిషన్ భారమూ తగ్గుతుంది. ముఖ్యంగా ప్రజాస్వామ్యం పట్ల నమ్మకం పెరుగుతుంది. భారతదేశం వంటి విస్తారమైన దేశంలో నిష్పాక్షిక ఎన్నికలు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. ఈ స్థంభం కూలిపోతే దేశం అస్థిరత వైపు నడుస్తుంది. కాబట్టి ఆధార్ ఆధారిత ఓటరు వ్యవస్థను అమలు చేయడం అత్యవసరం. అది వాస్తవానికి ఎన్నికల న్యాయపరతను కాపాడే ఒకే ఒక శాశ్వత మార్గం. ఈ మార్గంలో ముందడుగు వేస్తేనే ప్రజాస్వామ్యాన్ని కాపాడినట్లవుతుంది.

## అశోక చక్రవర్తి శాసనాలు మన దేశ చరిత్రకు మూలస్తంభాలు



***భారతదేశంలో ఎక్కడ తవ్వకాలు జరిపిన బౌద్ధ మూలాలు లభిస్తున్నాయి***

***అఖండ భారత దేశంలో సామ్రాట్***

అశోక చక్రవర్తి రాతి పలకలపై ఇనుప శిల్పంతో చెక్కించకపోతే బౌద్ధ ధర్మం విస్తరణ, ప్రజలకు ఇచ్చిన నీతి సందేశాలు, అతని పరిపాలనలో జరిగిన మార్పులు ఇవన్నీ కాలగర్భంలో కలిసిపోయేవి. చరిత్రను మనకు అందించిన ఆ శాసనాలు నిజానికి అద్దం పట్టాయి. లేకపోతే అబద్ధాలు, కపట కథనాలు రాజ్యమేలేవి. అందుకే అశోకుని శాసనాలు కేవలం రాతి రాయలే

మన జాతి నిజ చరిత్రను వెలుగులోకి తీసుకువచ్చిన శాశ్వత సాక్ష్యాలు ఇవి . ఇప్పుడు అశోకుని 14 ప్రధాన రాతి శాసనాలు ఒక్కొక్కటి ఏమి చెబుతున్నాయో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది . 1వ రాతి శాసనం :ప్రాణులను చంపడాన్ని నిషేధించాడు. వేట, బలి, క్రూరత్వాన్ని తగ్గించమని ఆదేశించాడు. 2వ రాతి శాసనం :

మానవులు, జంతువుల కోసం వైద్యశాలలు, చెరువులు, బావులు, రహదారుల వద్ద నీటి వసతులు ఏర్పాటుచేయమని చెప్పాడు. 3వ రాతి శాసనం:అధికారులకు ప్రజలతో ధర్మం గురించి



బోధించమని ఆజ్ఞాపించాడు. 4వ రాతి శాసనం: అతని పాలనలో లిలిక్రూరత్వం తగ్గి, ధర్మం పెరిగిందనిలిలి తెలిపాడు.

5 వ రాతి శాసనం :"ధర్మ మహామాత్రులు" అనే ప్రత్యేక అధికారులను నియమించాడు, వారు ప్రజల సంక్షేమం చూసుకోవాలి అన్నాడు. 6వ రాతి శాసనం: తన కర్తవ్యాన్ని జాగ్రత్తగా చేస్తానని, ఎప్పుడూ ప్రజల మేలే తన ధర్మం అని చెప్పాడు. 7వ రాతి శాసనం: అన్ని మతాలను గౌరవించమని, మతమతాల మధ్య సమరసత కలిగించమని ప్రబోధించాడు.

8వ రాతి శాసనం:యుద్ధ యాత్రల కన్నా ధర్మ యాత్రలు శ్రేష్ఠమని బోధించాడు. 9వ రాతి శాసనం:ప్రజలు పండగలు, వ్రతాలు, యజ్ఞాలు చేసే బదులు, ధర్మాచరణం చేయాలని ప్రబోధించాడు. 10వ రాతి శాసనం:తన పేరు చరిత్రలో నిలిచిపోవాలన్నది తన కోరిక కాదని, ప్రజలు ధర్మపరులు కావడం తనకు ముఖ్యమని అన్నాడు. 11వ రాతి శాసనం:ధర్మం యొక్క అసలు విలువ దయ, కరుణ, తల్లిదండ్రుల సేవ, సత్యం అని స్పష్టం చేశారు.


12వ రాతి శాసనం : మత సహనం ప్రతి మతం గౌరవించబడాలి. ఒకరి మతం మరొకరి మతాన్ని తక్కువ చేయకూడదు. 13వ రాతి శాసనం ప్రసిద్ధమైనది : కలింగ యుద్ధం తరువాత తనకు కలిగిన పశ్చాత్తాపం గురించి చెప్పాడు. యుద్ధంలో చనిపోయినవారి బాధ చూసి తాను ఇకపై ధర్మ విజయం కోరుకుంటానని ప్రకటించాడు. 14వ రాతి శాసనం:తన శాసనాలు అన్ని ప్రాంతాలలో చెక్కబడ్డాయని, ప్రజలందరికీ అర్థమయ్యేలా వ్రాయబడినాయని తెలిపాడు. ఈ 14 శాసనాలు కలిపి చూస్తే, అశోకుని అసలు రూపం మనకు తెలుస్తుంది: యుద్ధం చేసిన చక్రవర్తి పశ్చాత్తాపం చెందినవాడు ధర్మాన్ని రాజధర్మంగా మార్చినవాడు. సామ్రాట్ అశోక..రాతి పలకపై ఇనుప పెన్నుతో మన దేశ చరిత్రని రాయకుండా ఉండి ఉంటే.. ఈరోజు చరిత్ర బయటపడేది కాదు.. కాలగర్భంలో కలిసిపోయేది.. అబద్ధం రాజ్యమేలేది. ఇప్పటికే భారత దేశంలోనే ఏ మూలలో తవ్వకాలు జరిపిన బౌద్ధ మత అవశేషాలు బయటకు వస్తున్నాయి. బౌద్ధమతం చివరిలో అనేక దేవాలయాలను శివాలయాలుగా, వైష్ణవ ఆలయాలుగా మార్చారని అనేక విమర్శలు ఆరోపణలు ఉన్నాయి . బౌద్ధమతం భారతదేశం కన్నా బయట దేశాల్లోనే ఎక్కువ ప్రాచుర్యం పొందింది. ఇప్పుడిప్పుడే విద్యావంతులైన యువతి యువకులు మహాత్మ జ్యోతిబాపూలే , అంబేద్కర్ వారసులుగా బౌద్ధ మతాన్ని స్వీకరిస్తున్నారు. ప్రపంచ దేశాలకు అతిపెద్ద సామ్రాజ్యాన్ని ఏలిన ఏకైక చక్రవర్తి సామ్రాట్ అశోకుడు. ఇప్పటికీ మనం పాఠ్యపుస్తకాల్లో అశోకుడు చెట్లు నాటించే ను రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించారని మాత్రమే చెప్తాం . కానీ బుద్ధుడు బోధించిన పంచశీలాలు, అష్టాంగ మార్గం గురించి ఎవరు ప్రచారం చేయడం లేదు .

**అస శ్రీరాములు**
**సీనియర్ జర్నలిస్ట్**
**9440037196**

## నిద్రలో గుండెపోటు రాకుండా ఉండాలంటే



నిద్రలో గుండెపోటు రాకుండా ఉండేందుకు సరైన నిద్ర, శారీరకంగా ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం చాలా అవసరం. గుండెపోటు (మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్) అంటే గుండెకు రక్తప్రసరణ ఆగిపోవడం వల్ల సంభవించే తీవ్ర పరిస్థితి. ఇది నిద్రలో సంభవిస్తే ప్రమాదకరం ఎందుకంటే బాధితుడు సకాలంలో సహాయం పొందలేకపోవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) 2020 నివేదిక ప్రకారం, కార్డియోవాస్కులర్ వ్యాధుల వల్ల సంవత్సరానికి సుమారు 17.9 మిలియన్ మంది మరణిస్తున్నారు. వీటిలో గుండెపోటు, స్ట్రోక్‌లు 85 శాతం కాబట్టి చాలా హానికరం. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ (ఏహెచ్‌ఎ) 2021 అధ్యయనం ప్రకారం, రాత్రి 2 నుండి 5 గంటల మధ్య గుండెపోటు ప్రమాదం ఎక్కువగా జరుగుతుంది. ఇది మన శరీరంలోని సర్కేడియన్ రిథమ్, రక్తపోటు తగ్గుదల, స్లీప్ అప్నియా వంటి శ్వాస సమస్యల వల్ల సంభవిస్తుంది. ఈ సమయంలో శరీరం పూర్తిగా విశ్రాంతిలో ఉండి, కొత్త అరుణోదయాన్ని స్వాగతించేందుకు తగిన శక్తిని సేకరిస్తుంది. భారతదేశంలో గుండెపోటు మరణాలు పెరుగుతున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బి) 2022 డేటా ప్రకారం, గుండెపోటు కారణంగా 32,457 మంది మరణించినట్లు ఉంది. ఇది 2021తో పోల్చితే 12.5 శాతం పెరుగుదల. మరణాల్లో 57 శాతం సడన్ డెత్‌లు, అంటే ఆకస్మికంగా జరిగే మరణాలు. మహారాష్ట్రలో 12,591, కేరళలో 3,993, గుజరాత్‌లో 2,853 మంది గుండెపోటుతో మృతి చెందారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) 2016 నివేదిక ప్రకారం, 1990 నుండి 2016 వరకు గుండె జబ్బుల వ్యాధి భారం 30 శాతం నుంచి 55 శాతం పెరిగింది. ముఖ్యంగా 40-69 ఏళ్ల వయస్సులో గుండెపోటు ప్రమాదం ఎక్కువగా ఉంది. లాన్సెట్ గ్లోబల్ హెల్త్ 2023 అధ్యయనం ప్రకారం, 25-44 ఏళ్ల యువకులలో గుండె సంబంధిత సమస్యలు 15 శాతం పెరిగాయని తెలిపింది. దీనికి కారణం జీవనశైలి మార్పులు, అధిక ఒత్తిడి. గుండెపోటు ప్రమాదాన్ని పెంచే కారణాలు అధిక రక్తపోటు, చెడు కొవ్వు (ఎల్డిఎల్), మధుమేహం, ఊబకాయం, పొగతాగడం, అధిక మద్యం సేవనం, స్లీప్ అప్నియా. రాత్రి నిద్ర సమయంలో సర్కేడియన్ రిథమ్ ప్రకారం రక్తపోటు సహజంగా కొంత తగ్గుతుంది, కానీ ఈ సమయంలో శ్వాస ఆగిపోవడం లేదా రక్తప్రసరణలో ఆటంకం ఉంటే గుండెపోటు ప్రమాదం ఎక్కువుతుంది. కోవిడ్-19 తర్వాత గుండె సమస్యలు 20 శాతం పెరిగాయని ఐసిఎంఆర్ 2024 అధ్యయనం తెలిపింది. జర్నల్ ఆఫ్ క్లినికల్ స్లీప్ మెడిసిన్ 2022



ప్రకారం, స్లీప్ అప్నియా ఉన్నవారిలో గుండెపోటు ప్రమాదం 30 శాతం ఎక్కువ. నిద్రలో గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించేందుకు రోజూ కనీసం 7-8 గంటల సమతుల్యమైన నిద్ర అవసరం. నేషనల్ స్లీప్ ఫౌండేషన్ 2020 సూచన ప్రకారం, సరైన నిద్ర గుండె ఆరోగ్యానికి ఉపయోగకరం. ఆహారంలో తక్కువ సోడియం, ఎక్కువ ఫైబర్ ఉండే పదార్థాలు తీసుకోవాలి. సాయంత్రం కాఫీ, టీ, మద్యం తగ్గించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సూచన ప్రకారం, వారానికి కనీసం 150 నిమిషాలు మితమైన ఏరోబిక్ వ్యాయామం చేయాలి. ఒత్తిడిని తగ్గించడానికి యోగా, ధ్యానం, శ్వాస వ్యాయామాలు ఎంతో సహాయపడతాయి. స్లీప్ అప్నియా ఉన్నవారు వైద్య సలహా మేరకు సీప్యాప్ పరికరాలు వాడాలి. రక్తపోటు, షుగర్, కొలెస్ట్రాల్ లాంటి ఆరోగ్య సూచికలను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలి. ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోలేకపోవడం, చెమటలు పడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలి. గుండెపోటు నివారణకు ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య నిద్ర, సకాలంలో వైద్య పరీక్షలు తప్పనిసరి. దేశంలోని మహారాష్ట్ర, కేరళ, గుజరాత్ రాష్ట్రాల్లో గుండెపోటు మరణాలు ఎక్కువగా ఉన్నాయి. కోవిడ్-19 తర్వాత గుండె సమస్యలు పెరిగాయి. సరైన అవగాహన, జీవనశైలి మార్పులు, తగిన వైద్య సహాయం గుండె ఆరోగ్యాన్ని రక్షిస్తాయి. గుండె ఆరోగ్యం జీవితం, నిద్రలో గుండెపోటు ప్రమాదాన్ని నివారించేందుకు జాగ్రత్తలు తప్పనిసరి. అనారోగ్య సంకేతాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించండి. సకాలంలో తీసుకున్న జాగ్రత్తలు మాత్రమే మీ హృదయాన్ని, మీ జీవితాన్ని రక్షించగలవు. జాగ్రత్త పడండి, హృదయానికి జాగ్రత్త వహించండి ౹ జీవితం మీ చేతుల్లోనే ఉంది.

**మహమ్మద్ అక్బర్**
**జర్నలిస్ట్, నవభూమి ప్రతినిధి , మహబూబాబాద్**

## జియోనిస్టు ఇజ్రాయెల్‌పై స్పష్టమైన, సమన్వితమైన రాజకీయ, ఆర్థిక సైనిక చర్య అత్యవసరం!



అమెరికా-జియోనిస్టు దోస్తీ గాజాపై తుదిదశ సంహార యుద్ధాన్ని ప్రకటించిన సందర్భంలో, అంతర్జాతీయ సమాజం నుండి చర్యలు లేని మాటలతో కూడిన ప్రకటనలు అర్థరహితమైపోతున్నాయి!

ఇప్పుడు గాజాను పూర్తిగా ఆక్రమించాలనే వారి తుదిపథకంలో భాగంగా, ట్రంప్-నేతన్యాహూ ద్వయం పాలస్తీనీయులపై చేసిన క్రూరదారుణ మారణకాండలు ఇంతవరకు జరిగిన క్రూర దారుణ కాండని మించిపోయాయి. అయినా, ఐక్యరాజ్యసమితి వ్యవస్థ సహా, అంతర్జాతీయ సమాజం, యూరోపియన్ యూనియన్ నేతలు జియోనిస్టుల అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనలపై కేవలం ఒట్టి మాటలకే పరిమితమవుతున్నారు. జియోనిస్టులపై విమర్శనాత్మక ప్రకటనలు చేస్తున్నవారూ కూడా, "అంతర్జాతీయ పోలీసు"గా చెప్పుకునే అమెరికా ప్రభుత్వం నేతన్యాహూకి అందిస్తున్న సంపూర్ణ మద్దతుపై నిశ్శబ్దంగా ఉన్నారు. ఇంకా, యూరోపియన్ యూనియన్‌లోని అనేక ప్రధాన ప్రభుత్వాలు మాటల్లో జియోనిస్టుల దుర్మార్గాన్ని మానవ సంహారాన్ని ఖండిస్తూ, మరోవైపు ఇజ్రాయెల్‌కి ఆయుధాలను ఎగుమతి చేస్తూనే ఉన్నాయి. ఈ ద్వంద్వ వైఖరి, యూరోపియన్ నూతన ఫాసిస్టు మరియు భారత్ వంటి ఫాసిస్టు ప్రభుత్వాల మద్దతు నేతన్యాహూకి మరింత ధైర్యం కలిగించింది.

గాజా పై జియోనిస్టుల వ్యవస్థీకృత సంహారం ఇప్పటివరకు చూడని అమానుష స్థాయిలను చేరుకుంది. ఆకలితో అలమటిస్తున్న పాలస్తీనీయులను సహాయ కేంద్రాలకు ఆకర్షించి, బలవంతంగా సమూహ హత్యలు చేయడం అమెరికా మద్దతుతో నడుస్తున్న "కుకీర్తిపొందిన "గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్" అమలు చేసిన దారుణ పద్ధతుల్లో ఒకటి. ఇప్పుడు గాజా నగరమంతటా ఈ విధానం విస్తరించబడుతోంది. ఆకలితో మృత్యువు ఒడిలోకి నెడుతూ, బాంబులు వేస్తూ, ముట్టడి చేసి, వ్యాధులు వ్యాప్తి చేస్తూ, అమానుష హత్యలు చేస్తూ గాజాను నరకంగా మార్చివేయడం సాధారణ విషయమైపోయింది అని "అమ్నేస్టీ ఇంటర్నేషనల్ "వంటి స్వతంత్ర సంస్థలు నివేదిస్తున్నాయి. ఈ నరమేధం యుద్ధం కాదుబీ ఇది పూర్తిగా రక్షణలేని, ఆకలితో ఉన్న పిల్లలు, గర్భిణీలు, తల్లిపాలను ఇస్తున్న మహిళలు, వికలాంగులు వంటి సాధారణ పౌరులపై జరిగే ఏకపక్ష (హోలో కాస్ట్ )దహనార్పణ మానవ హోమం . ఐక్యరాజ్యసమితిలో ఆహారాన్ని మౌలిక మానవహక్కుగా గుర్తించే తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసినవారు కేవలం అమెరికా మరియు ఇజ్రాయెల్ మాత్రమే. అయితే ఇప్పటికే ఆకలితో మరణించిన పిల్లల సంఖ్య 300 దాటింది. అయినా, యూరోపియన్ యూనియన్ శక్తివంతమైన దేశాలు జియోనిస్టుల ఆక్రమణ, విధ్వంసం, సంహారంపై కేవలం మాటలకే పరిమితమై, రాజకీయ, ఆర్థిక, సైనిక చర్యలకు దూరంగా ఉన్నాయి. మరోవైపు, జియోనిస్టులు అణ్వాయుధాలను తయారు చేస్తుండగా మౌనంగా ఉన్న యూరోపియన్ యూనియన్, "నాటో"



దేశాలు ఇప్పుడు అమెరికా-జియోనిస్టు దోస్తీతో కలసి ఇరాన్‌పై నిరంతరం ఆరోపణలు చేస్తూ బెదిరిస్తున్నాయి. ఇదంతా వారి అంతర్గత ఇస్లామోఫోబియా మరియు జియోనిస్టు అనుకూల ధోరణికి నిదర్శనం. బ్రిటన్‌లో స్టార్మర్ ప్రభుత్వం గాజా సంహారంపై నిరసనలు వ్యక్తం చేసే ప్రజలను "ఘోరస్తులు"గా ముద్ర వేస్తోంది. మరోవైపు ట్రంప్, లాటిన్ అమెరికా దేశాలు అయిన బ్రెజిల్, వెనిజులాలపై పాలస్తీనీయులకు మద్దతు ప్రకటించినందుకు ఆర్థిక మరియు సైనిక బెదిరింపులు చేస్తున్నాడు.


అమెరికా బానిసలైన అనేక అరబ్ పాలక వర్గాలు మాత్రం తమ పెట్రోడాలర్ సంపద రక్షణపైనే దృష్టి సారించి, ఈ సంహారంపై మౌనం వహించడం అత్యంత నిరాశాజనకమైన విషయం. కానీ అదే సమయంలో నేతన్యాహూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా లక్షలాదిమంది లౌకికవాదులైన యూదులు ఈ దారుణ మారణకాండ కు వ్యతిరేకంగా నిలబడటం స్ఫూర్తిదాయకం. స్వతంత్ర విశ్లేషకుల ప్రకారం, ఇజ్రాయెల్ సైన్యంలో పెరుగుతున్న అసంతృప్తి, తిరుగుబాటు ఏ క్షణమైనా నియంత్రణ తప్పవచ్చు. ట్రంప్ ఆర్థిక, సైనిక మద్దతు ఉన్నప్పటికీ, ఇజ్రాయెల్ అంతర్గతంగా సంక్షోభం పేలవచ్చని అనేకులు అంచనా వేస్తున్నారు.

ఈ సందర్భంలో, ప్రపంచ దేశాలు ఇక ఆలస్యం చేయకుండా ముందుకు వచ్చి, స్పష్టమైన రాజకీయ, ఆర్థిక, సైనిక చర్యా ప్రణాళికను రూపొందించి, అమెరికా-జియోనిస్టు దోస్తీని ఒంటరిచేసి, పాలస్తీనాపై ఉన్న క్రూరమైన జియోనిస్టు పట్టు తొలగించడానికి తగిన జోక్యం చేసుకోవాలి. అమెరికా ఆధ్వర్యంలోని ప్రస్తుత ఐక్యరాజ్యసమితి వ్యవస్థ తన విశ్వసనీయతను కోల్పోయింది. కాబట్టి ఈ బాధ్యత ఆఫ్రో-ఆసియా-లాటిన్ అమెరికా దేశాలకు, అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న అణగారిన వర్గాలకు, ప్రజలకు, మంచి మనసున్న కార్మిక వర్గ ప్రగతిశీలురందరికీ ఈ ఘోరాన్ని ఖండించవలసిన బృహత్తర కర్తవ్యం తప్పదని స్పష్టమవుతోంది.

**పి జె జేమ్స్, ప్రధాన కార్యదర్శి ,సిపిఐ (ఎమ్.ఎల్) రెడ్ స్టార్,**
**తెలుగు స్వేచ్ఛానుసరణ:**
**లికొల్లిపర వెంకటేశ్వరరావులి, కేంద్ర కమిటీ సభ్యుడు, సిపిఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్.**
**93923 25652**
vkollipara75@gmail.com.


## స్థపతి స్థాపత్య వేదం

భక్తి



దేవాలయం వినాయత్ర ఏకకాలం నవాసయేత్'... దేవాలయం లేని చోట ఒక్క క్షణం కూడా ఉండకూడదని 'కారణాగమం' చెబుతోంది. కాబట్టి అలాంటి ఆలయాలను, అందు లోని విగ్రహాలను నిర్మించడానికి సాక్షాత్తూ భగవంతుడే మహర్షులకు శిల్పశాస్త్రాన్ని ఉపదేశిం చాడు. కాగా పరమశివుడు కాశ్యపునికి శిల్పశాస్త్రాన్ని ఉపదేశిం చాడని 'కాశ్యప శిల్పశాస్త్రం' చెబుతోంది. ఈ శిల్ప శాస్త్రాలను కలిపి 'స్థాపత్యవేదం' అని అంటారు. ఆలయాల నిర్మాణం గురించి తెలిపిన ఆ భగవంతుడే ఆలయాలలోని అర్చనా విధానాలను, ఉత్సవ విధానాలను తెలిపే ఆగమశాస్త్రాలను అనుగ్రహిం చాడు. పరమేశ్వరునిద్వారా శివాగమాలు, మహావిష్ణువు ద్వారా వైష్ణవాగమాలు, శక్తినుంచి శాక్త్యాగమాల బోధన జరిగింది. ఈ స్థాపత్య వేదాన్ని అభ్యసించినవారినే 'స్థపతి' అంటారు. నలుగురు ముఖ్యులు... దేవాలయాలను శిల్ప శాస్త్ర ప్రకారంగా స్థపతి ద్వారా నిర్మించాలి. ప్రజలందరూ పూజించే దేవుని విగ్రహాలు, ఆలయాలతో పాటు గ్రామాలను, నగరాలను కోటలను... వీటన్నిటినీ నిర్మించడానికి విశ్వకర్మ జన్మించాడు. సృష్టి ప్రారంభం నుంచి నేటిదాకా ప్రతి నిర్మాణానికి విశ్వకర్మ ఆశీస్సులు ఉన్నాయి. ఇంద్రుని అమరావతి పట్టణం, శ్రీకృష్ణుని ద్వారకాపట్టణం లాంటివి ఎన్నో ఆయన సృష్టించాడు. ఆయనకు మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞ అనే అయిదుగురు కుమారులు ఉన్నారు. కమ్మరం (ఇనుప పని), వడ్రంగం, లోహపు పని (కంచరం), శిల్పం ( శిలా విగ్రహాలు నిర్మించడం), స్వర్ణం (బంగారు ఆభరణాలు తయారు చేసే పని) అనే అయిదు పనులను వారికి ఆయన అప్పగించాడు. వారిలో నాలుగో కుమారుడైన శిల్పికి శిలావృత్తిని అప్పగించి... ప్రపంచంలో సుందరమైన ఆలయాలను, విగ్రహాలను నిర్మించడం ద్వారా ప్రజలను భక్తిభావం వైపు నడిపించాలని ఆదేశించాడు. ఈ శిల్పులలో నాలుగు రకాలైనవారు ఉన్నారు. వారు స్థపతి, వర్ధకి, తక్షకుడు, సూత్రగ్రాహి. స్థపతి: స్థపతి అంటే 'స్థాపన చేయడంలో నేర్పరి ' అని అర్థం. అతను సర్వ శాస్త్ర విశారదుడిగా, వేదాధ్యాయన పరుడిగా ఉండాలని, అన్ని శిల్ప శాస్త్రాలను ఆపోశన పట్టి ఉండాలని, వాస్తు విద్యా సముద్రాన్ని ఆకళింపు చేసుకోవాలని శాస్త్రాలు చెబుతున్నాయి. అంతేకాకుండా అతను వాస్తు, జ్యోతిషం, తత్త్వశాస్త్రం, ఖగోళ శాస్త్రం తదితర 64 కళలలో ప్రవీణుడై ఉండాలని, తన వృత్తి పట్ల మిక్కిలి శ్రద్ధ కలిగి, శీలవంతుడై, ఇతరుల పట్ల ద్వేష భావం, అసూయ లేకుండా ధార్మికబుద్ధి కలిగినవాడై ఉండాలని' విశ్వకర్మీయం' అనే ప్రాచీన శిల్ప శాస్త్ర గ్రంథం స్పష్టం చేసింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 హైదరాబాద్ శుక్రవారం 29 । ఆగస్టు । 2025




## క్యాష్ బ్యాగ్ ఎత్తుకెళ్లి, నోట్లు వెదజల్లిన కోతి.. తర్వాత ఏం జరిగిందంటే?



**లక్నో-నవభూమి:** బైక్‌లో ఉన్న క్యాష్ బ్యాగ్‌ను ఒక కోతి ఎత్తుకెళ్లింది. చెట్టుపైకి దానిని తీసుకెళ్లింది. ఆహారం కోసం ఆ బ్యాగ్‌లో వెతికింది. అందులో ఉన్న రూ.500 నోట్లను కిందకు వెదజల్లింది. దీంతో ఆ నోట్లు చేజిక్కించుకునేందుకు కొందరు వ్యక్తులు పోటీపడ్డారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని ఔరయ్య జిల్లాలో ఈ సంఘటన జరిగింది. దోదాపూర్ గ్రామానికి చెందిన ప్రైవేట్ టీచర్ రోహితాష్ చన్రా మంగళవారం మధ్యాహ్నం న్యాయవాదితో కలిసి బిధున తహసీల్ కార్యాలయానికి చేరుకున్నాడు. రిజిస్ట్రేషన్ కోసం సంబంధితన పత్రాలతో బిజీగా ఉన్నాడు. కాగా, రోహితాష్ తన బైక్‌లో ఉంచిన బ్యాగులో రూ.80,000 డబ్బు ఉన్నది. ఇంతలో ఒక కోతి ఆ బైక్ వద్దకు వచ్చి క్యాష్ బ్యాగ్ ఎత్తుకెళ్లింది. చెట్టుపైకి చేరిన తర్వాత ఆ బ్యాగ్ తెరిచి ఆహారం కోసం వెతికింది. ఆహారం కనిపించకపోవడంతో అందులో ఉన్న 80 వేల విలువైన రూ.500 నోట్లను కిందకు వెదజల్లింది. దీంతో ఆ కార్యాలయం వద్ద ఉన్న కొందరు వ్యక్తులు ఆ నోట్లు చేజిక్కించుకునేందుకు పోటీపడ్డారు. మరోవైపు క్యాష్ బ్యాగ్‌ను కోతి ఎత్తుకెళ్లడం గురించి తెలుసుకున్న రోహితాష్ షాక్ అయ్యాడు. తన డబ్బును దక్కించుకునేందుకు అతడు ప్రయత్నించాడు. కొందరు వ్యక్తుల సహాయంతో నోట్లు సేకరించాడు. అయితే రూ.52,000 మాత్రమే తిరిగిపొందాడు. మిగిలిన రూ.28,000 మాయం కావడంతో నిరాశ చెందాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## భారత్‌పై 50 శాతం సుంకాలు.. ఆ యూనివర్సిటీలో అమెరికా బ్రాండ్ల పానీయాలపై నిషేధం





**న్యూఢిల్లీ-నవభూమి:** రష్యా చమురు కొనుగోళ్లను సాకుగా చూపి భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించింది. ప్రపంచంలో ఏ దేశంపై లేని విధంగా కేవలం భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీగా సుంకాలు విధించారు. పెరిగన టారిఫ్‌లు బుధవారం (ఆగస్టు 27) నుంచి అమల్లోకి వచ్చాయి. దీనికి నిరసగా పంజాబ్‌లోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీ అమెరికా ఉత్పత్తులపై నిషేధం విధించింది. తమ క్యాంపస్‌లో అమెరికన్ బ్యాండ్ల శీతల పానీయాలను ఇకపై అమ్మేది లేదని స్పష్టం చేసింది. అగ్రరాజ్యం అహకారానికి వ్యతిరేకంగా చేపట్టిన స్వదేశీ 2. ఉద్యమంలో దేశం మొత్తం భాగస్వామ్యం కావాలని పిలుపునచ్చింది. అమెరికా విధించిన 50 శాతం దిగుమతి సుంకాలకు నిరసగా పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ తన క్యాంపస్‌లో అమెరికా బ్రాండ్ల పానీయాలపై పూర్తిస్థాయి నిషేధం విధించింది. కోకా-కోలా, పెప్సీ వంటి బ్రాండ్లు ఉత్పత్తులు ఇకపై విద్యార్థులకు అందుబాటులో ఉండవని తెలిపింది. ఈ మేరకు వర్సిటీ ఛాన్సలర్, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ అశోక్ కుమార్ మిట్టల్ వెల్లడించారు. భారతీయ ఉత్పత్తులపై సుంకాలను ఆర్థిక దౌర్జన్యంగా అభివర్ణించిన మిట్టల్.. భారతదేశం ఎవరి ముందూ తలవందని చెప్పారు. ఇది స్వదేశం 2.0 ఉద్యమమని చెప్పారు. భారతీయ మార్కెట్ నుంచి అమెరికా కంపెనీలు ఏడాదికి రూ.6.5 లక్షల కోట్లకుపైగా ఆదాయాన్ని పొందుతున్నాయి. ఒకవైపు లాభాలు ఆర్జిస్తూ, మరోవైపు ఆంక్షలు విధిస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మండిపడ్డారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఇప్పటికీ ఆపని అమెరికా, దాని యూరోపియన్ భాగస్వామ్య దేశాలు.. కేవలం భారత్‌నే లక్ష్యంగా చేసుకున్నాయని మండిపడ్డారు. దీని నిరసగా 40 వేలమంది విద్యార్థులతో దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ వర్సిటీల్లో ఒకటైన తమ ఎల్పీయూ క్యాంపస్‌లలో ఈ నిషేధం వెంటనే అమల్లోకి వస్తుందని చెప్పారు. కాగా, ఈ నిర్ణయాన్ని యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు స్వాగతించారు. సామాజిక మాధ్యమాల్లో స్వదేశీ2.0అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతున్నది.

## స్కూల్ టాయిలెట్‌లో నిప్పంటించుకున్న బాలిక.. తల్లిదండ్రులు ఆందోళన




**పాట్నా-నవభూమి:** ఐదో తరగతి చదువుతున్న బాలిక స్కూల్ టాయిలెట్‌లో నిప్పంటించుకున్నది. తీవ్ర గాయాలతో పడి ఉన్న ఆమెను స్కూల్ టీచర్లు, సిబ్బంది గమనించారు. చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు ఆ స్కూల్ వద్ద ఆందోళన చేపట్టారు. బీహార్ రాజధాని పాట్నాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం చిట్కోహ్రా ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల టాయిలెట్ నుంచి పొగలు రావడాన్ని కొందరు గమనించారు. స్కూల్ టీచర్లు, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ఐదో తరగతి బాలిక కాలిన గాయాలతో పడి ఉండటం చూశారు. పాట్నా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ఆమెను తరలించారు. ఆ బాలిక పరిస్థితి విషమంగా ఉన్నదని డాక్టర్లు తెలిపారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, బంధువులు ఆ ప్రభుత్వ స్కూల్ వద్దకు చేరుకున్నారు. స్కూల్ టీచర్లు, సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది గదిని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. ఇంతలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. బాలిక కుటుంబ సభ్యులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. మరోవైపు ఆ బాలిక నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించిందా? లేక ఎవరైనా ఆమెకు నిప్పంటించారా? మండే వస్తువు స్కూల్‌లోకి ఎవరు, ఎలా తెచ్చారు? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. స్కూల్ టీచర్లు, సిబ్బంది, విద్యార్థుల స్టేట్‌మెంట్లను రికార్డ్ చేస్తున్నారు. స్కూల్ ఆవరణలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. వాంగ్మూలం ఇవ్వలేని పరిస్థితిలో బాలిక ఉన్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## నో హెల్మెట్- నో ఫ్యూయల్.. సెప్టెంబర్ 1 నుంచి కొత్త రూల్స్ అమలు



ఎప్పటినుంచో కొత్త రోడ్ సేఫ్టీ క్యాంపెయిన్ అమలు చేస్తామని చెబుతోన్న ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ఎట్టకేలకు సిద్ధమైంది. ఈ క్రమంలో నో హెల్మెట్, నో ఫ్యూయల్ విధానాన్ని సెప్టెంబర్ 1 (సోమవారం) నుంచి సెప్టెంబర్ 30 (మంగళవారం) వరకు అమలు చేయనున్నట్లు ప్రకటించారు. అంటే మీరు టూ వీలర్ మీద హెల్మెట్ లేకుండా పెట్రోల్ బంక్‌కి వెళ్తే మీకు పెట్రోల్ పోయరు. టూ వీలర్ రైడర్స్‌తో పాటు వెనుక కూర్చునే పిలియన్ రైడర్స్ కూడా హెల్మెట్ పెట్టుకోవాలని, రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే ఈ క్యాంపెయిన్ లక్ష్యమని తెలిపారు.
ఈ క్యాంపెయిన్‌ను డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్స్ నేరుగా సూపర్వైజ్ చేస్తున్నారు. డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీలతో కలిసి పోలీసులు, రెవెన్యూ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ అంతా కలిసి ఈ ప్రోగ్రామ్‌ను సక్సెస్ చేయడానికి కష్టపడుతున్నారు. అంటే, రాష్ట్రమంతటా ఒకే రకమైన రూల్స్, ఒకే రకమైన అమలు ఉంటుంది. ఎక్కడైనా టూ, వీలర్ వెళ్లేవారు హెల్మెట్ లేకుండా కనిపిస్తే, ఇక వాళ్లకు ఫ్యూయల్ దొరకదని చెప్పవచ్చు. ఈ మోటార్ వెహికల్స్ యాక్ట్, 1988లోని సెక్షన్ 129 ప్రకారం, టూ-వీలర్ రైడర్‌తో పాటు వెనుక కూర్చునే వాళ్లు కూడా హెల్మెట్ పెట్టుకోవాల్సిందే. ఒకవేళ రూల్ బ్రేక్ చేస్తే, సెక్షన్ 194 ప్రకారం పెనాల్టీ ఉంటుంది. సుప్రీం కోర్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ కూడా హెల్మెట్ వాడకం పెంచాలని సూచించింది. అందుకే ఈ క్యాంపెయిన్‌ను మరింత కఠినంగా అమలు చేయాలని చూస్తున్నారు.
పెట్రోల్ బంక్‌లు కూడా టీమ్‌లోఈ క్యాంపెయిన్‌లో పెట్రోల్ బంక్‌లు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. వంటి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, పెట్రోల్ పంప్ స్టాఫ్‌కు స్పష్టమైన ఆర్డర్స్ వచ్చాయి. హెల్మెట్ లేని వాళ్లకు పెట్రోల్ లేదా డీజిల్ ఇవ్వొద్దు. ఈ విషయాన్ని ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్ డిపార్ట్‌మెంట్ మానిటర్ చేస్తుంది. అంటే, హెల్మెట్ లేకుండా బైక్ తీసుకొచ్చి పెట్రోల్ పోయాలని అడిగితే నో చెప్తారు. మేం ఎవరినీ శిక్షించడానికి ఈ రూల్ తేలేదని, ప్రజల ప్రాణాలు కాపాడడమే మా లక్ష్యమని ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ బ్రిజేష్ నారాయణ్ సింగ్ అన్నారు. ఈ కొత్త రూల్ రెస్పాన్స్‌ను బట్టి పొడిగించడంపై నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు.

## గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకుంటే.. నదిలో కొట్టుకుపోయిన ఫ్యామిలీ



**భిల్వారా-నవభూమి:** సాధారణంగా తెలియని ప్రదేశాలకు వెళ్లేటప్పుడు సులువుగా గమ్యానికి చేరుకోడానికి గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకుంటాం. కానీ, కొన్నిసార్లు మ్యాప్స్ తప్పుగా చూపించడంతో ప్రమాదాల బారినపడినవారు ఉన్నారు. టెక్నికల్, జీపీఎస్ అనుసంధానం లోపాల కారణంగా ఇలాంటివి జరిగే అవకాశం ఉంది. తాజాగా, రాజస్థాన్‌లో అటువంటి సంఘటనే చోటుచేసుకుంది. గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకుని వాహనం నడుపుకుంటూ వెళ్లిన ఓ కుటుంబం.. నదిలో కొట్టుకుపోయింది. ఈ ప్రమాదంలో నలుగుర్ని స్థానికులు కాపాడగా.. మరో ఐదుగురు గల్లంతయ్యారు. గతేడాది విజయవాడ సమీపంలోనూ ఓ టెక్కీ ఇలాగే ప్రాణాలు కోల్పోయాడు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. చిత్తోర్‌ఘర్ జిల్లా నఖేడ గ్రామానికి చెందిన ఓ ఫ్యామిలీకి చెందిన తొమ్మిది మంది మంగళవారం భిల్వారాలోని సవాయిభోజ్ ఆలయానికి వెళ్లారు. అక్కడ దర్శనాలు ముగిసిన అనంతరం రాత్రి 1 గంట ప్రాంతంలో బయలుదేరి రూట్ కోసం గూగుల్ మ్యాప్స్‌ను ఉపయోగించారు. ఈ క్రమంలో వాహనం బనాస్ నదిపై ఉన్న సోమి-ఉప్రెడా కల్వర్ట్ పైకి చేరుకున్నప్పుడు దానిపై ఉన్న గొతిలో పడింది. గత రెండు రోజులుగా కురుస్తోన్న వర్షాలకు బనాస్ నదిపై ఉన్న మాతృకుండియా డ్యామ్ పూర్తిగా నిండటంతో గేట్లు తెరిచి దిగువకు నీరు వదలిపెట్టారు. ఈ ప్రవాహ తీవ్రతకు వాహనం కొట్టుకుపోయి నదిలో మునిగిపోయింది. ప్రమాదం జరిగిన సమయానికి చీకటిగా ఉండడంతో స్థానికులు తక్షణమే గుర్తించలేకపోయారు. అయితే, కాసేపటి తర్వాత వరదలో చిక్కుకున్న బాధితుల కేకలు విని స్థానికులు పరుగెత్తుకొచ్చారు. కొట్టుకుపోతున్న నలుగురిని కాపాడగా.., మరో ఐదుగురు గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరు చిన్నారులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు.. అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైనవారిలో నలుగురు మృతిచెందగా.. వారి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఓ చిన్నారి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదని అధికారులు తెలిపారు. 'ప్రమాదంలో చిక్కుకున్నవారు మొబైల్ ఫోన్ ద్వారా మాకు సమాచారం ఇచ్చారు.. దాంతో మేము వెంటనే చర్య తీసుకున్నాం. గత మూడేళ్లుగా ఆ వంతెన మూసివేయడంతో ఆ మార్గంలో వాహనాలు వెళ్లడం లేదు' అని చెప్పారు. మాతృకుండియా డ్యామ్ గేట్లు తెరవడంతో, నదిలో ప్రవాహం అధికంగా ఉందని.. దీనివల్ల రెస్క్యూ కష్టంగా మారిందని పేర్కొన్నారు. అయితే, కాజ్వేను మూసివేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కాగా, రెండేళ్ల కిందట కేరళలోనూ ఇలాగే యువ వైద్యులు ప్రాణాలు కోల్పోయారు. అక్టోబరు 2, 2023న యువ వైద్యులు రాత్రిపూట కారులో వెళ్తూ. . గూగుల్ మ్యాప్‌లు ఉపయోగించారు. కానీ, పొరపాటున వారిని ఓ నదిలోకి తీసుకెళ్లింది. దీంతో అందులో మునిగి, వారు చనిపోయారు.

## మంత్రిపై గ్రామస్థుల దాడి.. కిమీ వరకు వెంబడించి!



**పట్నా-నవభూమి:** వారం రోజుల క్రితం ఓ రోడ్డు ప్రమాదం జరిగి 9 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే వీరి కుటుంబాలను పరామర్శించేందుకు ఓ మంత్రి వారి గ్రామానికి వెళ్లారు. అయితే సాదరంగా ఆహ్వానించి తమ కష్టాలు చెప్పుకుని సాయం చేయమని కోరుతారనుకున్న గ్రామస్థులు, బాధిత కుటుంబాలు మాత్రం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎవరూ ఊహించని విధంగా మంత్రిపై దాడికి పాల్పడ్డాయి. దీంతో షాకైన మంత్రి పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంటనే వచ్చి కాన్వాయ్ ఎక్కారు. కానీ గ్రామస్థులు మాత్రం ఆయన్ను వదల్లేదు. కిలో మీటర్ మేర వెంట పడి మరీ ఆయన కాన్వాయ్‌పై దాడి చేశారు. మరి ఈ చేదు అనుభవం ఏ మంత్రికి ఎదురైందో మనం ఇప్పుడు తెలుసుకుందామా..? ఎన్డీయే పాలిత బీహార్ రాష్ట్రంలో.. వారం రోజుల క్రితం ఓ రోడ్డు ప్రమాదం జరిగింది. దురదృష్టవశాత్తు ఈ దుర్ఘటనలో ఒకే గ్రామానికి చెందిన 9 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రావణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి జోగిపూర్ మలవాన్ గ్రామానికి వెళ్లారు. బుధవారం ఉదయమే అక్కడకు చేరుకోగా.. విషయం తెలుసుకున్న గ్రామస్థులంతా మంత్రి వద్దకు వచ్చారు. సాధరంగా ఆహ్వానించి సమస్యలు చెబుతారనుకుంటే.. ఒక్కసారిగా మంత్రిని చుట్టుముట్టారు.

**కిలో మీటర్ వరకు వెంబడించి మరీ..**

"గ్రామాన్ని ఆలస్యంగా సందర్శించడం, బాధిత కుటుంబాల పట్ల సానుభూతి చూపకపోవడం, ఎలాంటి పరిహారం ఇవ్వకపోవడం"పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి, ఎమ్మెల్యే సహా వారి వెంట ఉన్న జేడీయూ నేతలు అందరిపై దాడి చేయడానికి ప్రయత్నించారు. ఈ దాడిలో మంత్రి తప్పించుకుని వెళ్లి కాన్వాయ్ ఎక్కారు. అయినా సరే గ్రామస్థులు మంత్రిని వదల్లేదు. ఆయన కాన్వాయ్ వెనకాలే పరుగులు పెట్టారు. వాహనాల్లో పారిపోతున్న మంత్రిని, ఎమ్మెల్యేను దాదాపు కిలో మీటరు దూరం వరకు వెంబడించారు. అప్పటికే విషయం తెలుసుకున్న పోలీసులు.. హుటాహుటిన రంగంలోకి దిగారు. వెంట పడుతున్న జనాలను చెదరగొట్టారు. మంత్రి, ఎమ్మెల్యే వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే ఈ దాడిలో మంత్రికి, ఎమ్మెల్యేకు ఎలాంటి గాయాలు కాలేదు. కానీ మంత్రి బాడిగార్డుకు మాత్రం స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ప్రజలు దర్యాప్తు చేస్తున్నారు. నెట్టింట వైరల్ అయిన వీడియో ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఇన్ స్టాలో విడాకులు.. సింగర్‌తో దుబాయ్ యువరాణి నిశ్చితార్థం



**రియాద్-నవభూమి:** దుబాయ్ పాలకుడు.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రధానమంత్రి షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ కుమార్తె షేకా మహ్రా మొహమ్మద్ రషీద్ అల్ మక్తూమ్ (31) మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల తన భర్తకు విడాకులు ఇచ్చిన ఆమె, ఇప్పుడు ప్రపంచ ప్రసిద్ధ అమెరికన్ రాపర్ ఫ్రెంచ్ మోంటానా (41)తో నిశ్చితార్థం చేసుకుని అందరినీ ఆశ్చర్య పరిచారు. ఈ విషయాన్ని ఫ్రెంచ్ మోంటానా ప్రతినిధి అధికారికంగా ధృవీకరించారు.

**- ప్రేమ కథకు నాంది**

షేకా మహ్రా, ఫ్రెంచ్ మోంటానా ప్రేమకథ గురించి గత కొంతకాలంగా మీడియాలో కథనాలు వస్తున్నాయి. విడాకుల తర్వాత దుబాయ్‌లో వీరిద్దరూ కలిసి కనిపించడం, పారిస్ ఫ్యాషన్ వీక్‌లో కలిసి పాల్గొనడం వంటి సంఘటనలు ఈ ఊహాగానాలకు బలం చేకూర్చాయి. ఈ ఏడాది జూన్‌లో పారిస్ ఫ్యాషన్ వీక్ సందర్భంగా నిశ్చితార్థం జరిగినట్లు మోంటానా ప్రతినిధి వెల్లడించారు. అయితే ఈ విషయాన్ని ఇప్పటివరకు గోప్యంగా ఉంచారు. రెండు కుటుంబాలు ఈ బంధాన్ని ఆమోదించాయని, త్వరలోనే పెళ్లి తేదీని ప్రకటిస్తారని సమాచారం.

**మొదటి వివాహం, విడాకుల సంచలనం**

షేకా మహ్రా గతంలో దుబాయ్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త షేక్ మనా బిన్ మొహమ్మద్ అల్ మక్తూమ్‌ను వివాహం చేసుకున్నారు. 2023 మే 27న జరిగిన ఈ పెళ్లి కేవలం ఒక సంవత్సరం మాత్రమే కొనసాగింది. వారికి ఒక బిడ్డ కూడా ఉంది. 2024 జులైలో మహ్రా తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో "ఐ డివోర్స్ యూ.. టేక్ కేర్" అని పోస్ట్ చేసి అందరినీ షాక్ గురిచేశారు. ఈ పోస్ట్ అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. అంతేకాదు విడాకుల తర్వాత 'డివోర్స్' అనే పేరుతో ఒక ప్రత్యేక పర్ఫ్యూమ్‌ను కూడా విడుదల చేసి మరోసారి వార్తల్లో నిలిచారు.

**ఫ్రెంచ్ మోంటానా ఎవరు?**

మొరాకో-అమెరికన్ రాపర్ అయిన ఫ్రెంచ్ మోంటానా అసలు పేరు కరీమ్ ఖార్బుచ్. 'అన్‌ఫర్గెటబుల్' , 'నో స్టైలిస్ట్' వంటి పాటలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. గతంలో నదీన్‌ను వివాహం చేసుకున్న మోంటానాకు విడాకుల తర్వాత 16 ఏళ్ల కుమారుడు ఉన్నాడు.

**ప్రజల స్పందన**

ఈ నిశ్చితార్థం వార్త బయటకు వచ్చిన తర్వాత, షేకా మహ్రాకు, ఫ్రెంచ్ మోంటానాకు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత త్వరగా రెండో పెళ్లి నిర్ణయం తీసుకున్నందుకు షేకా మహ్రా ధైర్యాన్ని చాలా మంది ప్రశంసిస్తున్నారు. ఈ కొత్త బంధం గురించి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ దుబాయ్ యువరాణి-అమెరికన్ రాపర్ బంధం ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

## ఇదో నీలం కోడిగుడ్డు.. నిజాలు బయటపెట్టిన అధికారులు!



**దేవనగిరి-నవభూమి:** సాధారణంగా ఎక్కడైనా సరే కోడిగుడ్డు కలర్ ఏంటి అంటే అందరూ టక్కున చెప్పేది వైట్ కలర్ మాత్రమే. కొన్ని కోళు పెట్టే గుడ్లు గోధుమ రంగులో.. మరికొన్ని కాస్త లేత పసుపు రంగులో ఉంటాయి. కానీ ఇప్పుడు మనం చెప్పుకోబోయే గుడ్డు కలర్ మాత్రం ఇప్పటివరకు ఏ కోడి పెట్టి ఉండదు. ఎందుకంటే ఈ కోడి ఇప్పటివరకు మనం ఎక్కడా వినని కలర్లో గుడ్డు పెట్టింది. ఆ కోడి పెట్టిన గుడ్డు కలర్ ఏంటంటే..బ్లూ కలర్.. అవును మీరు వినేది నిజమే. నీలం రంగులో ఓ కోడి గుడ్డును పెట్టిందట. మరి బ్లూ కలర్ లో గుడ్డు పెట్టిన ఆ కోడి ఏ రాష్ట్రానికి చెందింది. గుడ్డు తెలుపు కాకుండా నీలం రంగులో ఉండడానికి గల కారణం ఏమిటి? దీనిపై పరిశోధన జరిపిన అధికారులు ఎలాంటి కామెంట్స్ చేశారు? అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.. తాజాగా బ్లూ కలర్ లో గుడ్డు పెట్టిన కోడికి సంబంధించి ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.. కర్ణాటక రాష్ట్రంలోని దేవనగిరి జిల్లా నల్లూరు గ్రామంలో ఉండే సయ్యద్ నూర్ చాలా రోజుల నుండి కోళ్లను పెంచుతున్నారు. ప్రస్తుతం ఆయన దగ్గర 10 నాటు కోళ్లు ఉన్నాయట. అయితే సడన్ గా తన దగ్గర పెంచే నాటు కోళ్లలో ఒక కోడికి సంబంధించి ఒక వింత అనుభవం ఎదురయ్యిందట. అదేంటంటే.. ప్రతిరోజు తెలుపు రంగులో గుడ్డు పెట్టే ఆ కోడి ఒకరోజు నీలం రంగులో గుడ్డు పెట్టిందట. అయితే ఇదేంటి కోడిగుడ్డు ఇలా నీలం రంగులో ఉంది అని ఆయన మొదట ఆశ్చర్యపోయి ఇంట్లో వాళ్ళందరికీ చూపించారట. ఆ తర్వాత ఇదేదో వెరైటీ గుడ్డులా ఉంది అని ఆ గుడ్డుని తీసి జాగ్రత్తగా భద్రపరిచారట. అయితే ఈ విషయం ఇంటి పక్క వాళ్ళ నుండి ఊరంతా వ్యాపించి గ్రామంలో ఉన్న వాళ్ళందరూ సయ్యద్ ఇంట్లో ఉండే ఆ నీలి రంగు గుడ్డు చూడడానికి పోటెత్తారట. ఆ నోటా ఈ నోటా పాకి విషయం కాస్త సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో చాలామంది ఈ గుడ్డు గురించే చర్చించుకుంటున్నారు. అలా చివరికి జంతు సంరక్షణ అధికారులకు కూడా ఈ విషయం తెలియడంతో వాళ్లు ఆ గుడ్డును పరిశీలించి షాకింగ్ విషయం బయట పెట్టారు. కొన్నిసార్లు కోళ్లు లేత ఆకుపచ్చ రంగులో గుడ్లను పెట్టడం చూసాం. కానీ ఇలా బ్లూ కలర్ లో ఉండే గుడ్డును చూడడం ఇదే మొదటిసారి అంటూ వాళ్లు కూడా ఆశ్చర్యపోయారు. అంతేకాకుండా కోడి క్లోమంలో ఉండే బిలివర్డిన్ అనే వర్ణ ద్రవ్యం కారణంగా ఈ కోడి నీలిరంగులో ఉండే గుడ్డును పెట్టినట్టు తమ అభిప్రాయాన్ని చెప్పారు. కొన్ని కొన్ని కోళ్లలో జన్యుపరమైన లోపాలు ఉన్నప్పుడు ఇలాంటి వింత రంగులో ఉండే గుడ్లను కూడా పెడుతుంటాయని తెలియజేశారు. అంతేకాకుండా ఈ గుడ్లు మిగతా గుడ్ల కంటే స్పెషల్ ఏమీ కావని, కేవలం రంగు మాత్రమే వింతగా ఉంటుంది. మిగతా గుడ్డు లాగే ఈ గుడ్డులో కూడా పోషక విలువలు అన్ని సేమ్ ఉంటాయి అని చెప్పారు. అయితే ఇలాంటి నీలిరంగు గుడ్లు పెద్ద వింతేమీ కాదు అంటున్నారు కొంతమంది. ఎందుకంటే అమెరికా, లాటిన్ వంటి దేశాలలో ఇప్పటికే ఇలాంటి రంగులో ఉండే గుడ్లను చాలా కోళ్లు పెడతాయట. కోళ్ల క్లోమంలో బిలివర్డిన్ అనే వర్ణద్రవ్యం ఎక్కువగా ఉండడం వల్లే ఈ రంగులో ఉండే గుడ్లు పెడతాయని అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ నీలిరంగు గుడ్డు పెట్టి వార్తల్లోకెక్కింది కర్ణాటకకి చెందిన ఈ కోడి.

## 55 ఏళ్ల వయసులో 17వ బిడ్డకు జన్మనిచ్చిన మహిళ



**జైపూర్-నవభూమి:** రాజస్థాన్ రాష్ట్రంలో అత్యంత అరుదైన సంఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ 55 ఏళ్ల వయసులో 17వ బిడ్డకు జన్మనిచ్చింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఉదయ్‌పూర్‌లోని జండోల్‌కు చెందిన రేఖ,కవ్‌రా భార్యాభర్తలు. వీరికి 15 ఏళ్ల క్రితం పెళ్లయింది. గిరిజన తెగకు చెందిన ఈ దంపతులు చిత్తు కాగితాలు సేకరించి అమ్ముతుంటారు. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వీరికి ఇప్పటికే 16 మంది పిల్లలు ఉన్నారు. వీరిలో నలుగురు కొడుకులు, ఓ కూతురు పుట్టిన వెంటనే చనిపోయారు. మిగిలిన వారిలో ఐదు మందికి పెళ్లిళ్లు అయి వారికి కూడా పిల్లలు ఉన్నారు. రేఖ మంగళవారం మరో బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో స్థానికులు షాక్ అయ్యారు. కల్బేలియా ఫ్యామిలీ ఆర్థిక కష్టాల గురించి తెలిసిన వాళ్లు కోప్పడుతున్నారు. ఇక, తల్లి 17వ బిడ్డకు జన్మనివ్వటంపై కూతురు శిల్ప మాట్లాడుతూ.. 'మేమందరమూ చాలా ఇబ్బందులు ఎదుర్కోవల్సి వచ్చింది. మా అమ్మకు 17 మంది పిల్లలని తెలిసి అందరూ షాక్ అవుతున్నారు' అని అంది. పిల్లల తండ్రి కవ్‌రా మాట్లాడుతూ..'మాకు సొంత ఇల్లు లేదు. నేను 20 రూపాయల వడ్డీకి డబ్బులు తెచ్చి పిల్లలను సాకుతున్నాను. లక్షల రూపాయలు చెల్లించాను. కానీ, అప్పులు మాత్రం తీరటం లేదు. మేము చెత్త ఏరుకుని జీవనం సాగిస్తున్నాము. తినడానికి, పెళ్లిళ్లకు, చదువుకోవడానికి ఎలాంటి వనరులు లేవు' అని అన్నారు. ఇక, రేఖకు డెలివరీ చేసిన డాక్టర్ మాట్లాడుతూ..'ఇది తన నాలుగవ కాన్పు అని ఆమె చెప్పింది. అది తన 17వ బిడ్డ అని తర్వాత తెలిసింది' అని అన్నారు.


## ఎన్నికలు న్యాయంగా జరిగితే, బీహార్‌లో ఎన్డీఏ ఓడిపోతుంది: ఓటర్ అధికార్ యాత్రలో స్టాలిన్



**ముజఫర్‌పూర్-నవభూమి:** తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఇండియా కూటమి తరపున బీహార్ లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బిజెపి నేతృత్వంలోని కేంద్రం.. ఎన్నికల కమిషన్‌ను కీలుబొమ్మగా మార్చిందని విమర్శించారు. ఎన్నికలు న్యాయమైన రీతిలో జరిగితే, రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ ఓడిపోతుందని ఆయన జోస్యం చెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో బీహార్‌లో జరుగుతోన్న 'ఓటరు అధికార్ యాత్ర'లో పాల్గొన్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ముజఫర్‌పూర్‌లో జరిగిన ర్యాలీలో ప్రసంగించారు. మోదీ నేతృత్వంలోని కేంద్రం.. ఎన్నికల సంఘాన్ని రిమోట్ కంట్రోల్ ద్వారా నడుపుతూ దానిని కీలుబొమ్మగా మార్చిందని ఆరోపించారు. బీహార్ ప్రజలను ఓటర్ల జాబితా నుండి తొలగించడం సరైంది కాదని స్టాలిన్ తమిళంలో జనాన్ని ఉద్దేశించి చెప్పుకొచ్చారు. ఇండియా కూటమి పార్టీలు ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఐక్యంగా ఉన్నాయన్నారు. రాహుల్ గాంధీ - తేజస్వి యాదవ్ మధ్య స్నేహం కేవలం రాజకీయ సంబంధం కాదని, ఇది ఇద్దరు సోదరుల మధ్య సంబంధమని స్టాలిన్ అన్నారు. ఈ స్నేహం వారిని విజయ తీరాలకు చేరుస్తుందని.. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి తామంతా ఐక్యంగా ఉన్నామని స్టాలిన్ తెలిపారు. 'నా సోదరులకు మద్దతు ఇవ్వడానికి నేను తమిళనాడు నుండి వచ్చాను. ఎన్నికల కమిషన్ చేసిన 'ఓటు చోరీ'ని రాహుల్ గాంధీ బయటపెట్టారు. రాహుల్ గాంధీ అఫిడవిట్ ఇవ్వాలి లేదా క్షమాపణ చెప్పాలి అని జ్ఞానేష్ కుమార్ అంటున్నారు. రాహుల్ గాంధీ ఎప్పుడైనా ఇలాంటి వాటికి భయపడతారా?... ఈరోజు, బిజెపి ఎన్నికలను ఎలా జోక్‌గా మార్చిందో చూపించినందున రాహుల్ పై దాడి చేస్తోంది' అని స్టాలిన్ అన్నారు. అంతకుముందు, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్, వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) వ్యవస్థాపకుడు ముఖేష్ సహాని, సీపీఐ (ఎంఎల్) నాయకుడు దీపాంకర్ భట్టాచార్యతో కలిసి ఓపెన్ వాహనం నుండి ఇండియా కూటమి మద్దతుదారులతో కలిసి స్టాలిన్ ర్యాలీలో పాల్గొన్నారు.

## రోడ్డుపై ఒంటరి ఏనుగు సంచారం..

**హొసూరు-నవభూమి:** శానమావు అటవీ ప్రాంతాలలోని జాతీయ రహదారిపై ఏనుగుల సంచారం అధికమైంది. ఈ నేపథ్యంలో అటవీశాఖ చుట్టుపక్కల గ్రామాల ప్రజలను హెచ్చరించింది. పోటూరు, అజియాళం, నాయకనపల్లి, బీర్జెపల్లి, శానమావు, దొరపల్లి, అంబలట్టి గ్రామాలకు చెందిన గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతీయ రహదారిపై ఏనుగుల సంచారంతో వాహనచోదకులు బెంబేలెత్తుతున్నారు. మంగళవారం కూడా ఒక ఏనుగు సంచరించగా కొంతమంది ఫోటోలతోపాటు సెల్ఫీలు తీసుకునే యత్నం చేశారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.





# కుక్క కాటుకు యాంటీ రేబీస్ దెబ్బ

కుక్క కరిచిన ప్రదేశాన్ని సబ్బు నీళ్లతో శుభ్రం చేసుకుని సరిపెట్టుకునే వాళ్లుంటారు. కానీ పెంపుడు కుక్క, వీధి కుక్క.. ఏది కరిచినా రేబీస్ రాకుండా ఇంజెక్షన్లు తీసుకోవడం తప్పనిసరి. కుక్కలకు సోకే రేబీస్ వైరస్ వాటి శరీరంలో దీర్ఘకాలం పాటు ఉండిపోతుంది. వ్యాధి తీవ్రమై, కుక్క ప్రాణాలు కోల్పోయే లోపు అది ఎంత మందిని కరిస్తే, అంతమందికీ రేబీస్ వైరస్ సోకుతుంది. అయితే కుక్కకు రేబీస్ సోకిందో లేదో తెలుసుకోవడం కోసం కుక్కలో కొన్ని లక్షణాలను మనం గమనించవచ్చు. అవేంటంటే...

చలాకీగా కదిలే కుక్క అకస్మాత్తుగా నీరసించడం
ఒంటరిగా ఉండిపోవడం
నోటి నుంచి సొంగ కారడం
నీటికి దూరంగా ఉండడం
గుండ్రంగా తిరుగుతూ ఉండడం

ఇలాంటి లక్షణాలు కనిపించిన కుక్కకు దూరంగా ఉండాలి. వాటికి ఆహారం తినిపించడం, వాటితో ఆడడం లాంటివి చేయకూడదు.

ఏ కుక్క కరిచినా..కుక్క కరిచినప్పుడు, ఎంత లోతుగా కరిచింది అనే దాని మీదే చికిత్స ఆధారపడి ఉంటుంది. కుక్క గోళ్లతో గోకడాన్ని గ్రేడ్ ఎగా, కొరికినప్పుడు పంటి గాటు ఏర్పడితే ఆ గాయాన్ని గ్రేడ్ బిగా, పంటిగాటుతో పాటు రక్తస్రావమైతే గ్రేడ్ సిగా పరిగణించాలి. ఈ గాయాలకు రేబిక్యూర్ వ్యాక్సిన్‌తో పాటు, రేబీస్ ఇమ్యునోగ్లోబ్యులిన్ కూడా ఇవ్వవలసి ఉంటుంది. కుక్కకు ఎలాంటి టీకాలు ఇప్పించకపోయినా, అది వీధి కుక్క అయినా, పెంపుడు కుక్క అయినా రేబీస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. సాధారణంగా చాలా మంది వీధిలో రోజూ కనిపించే కుక్క, దానికేం కాలేదు కాబట్టి మాక్కూడా ఏం జరగదు అని చికిత్సను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ అది

# ఫ్యాషన్ టస్సర్ ట్రెండ్

హుందాగా, విలాసవంతంగా కనిపించాలనుకుంటే టస్సర్ చీరలు కట్టాలి. అన్ని రకాల వేడుకలకూ నప్పే టస్సర్ చీరల సొబగుల గురించి తెలుసుకుందామా?

ప్రత్యేకమైన ఆకృతి, సహజసిద్ధమైన స్వర్ణం మెరుపులను కలిగిన అద్భుతమైన వస్త్రమే టస్సర్. వైల్డ్ సిల్క్‌తో తయారయ్యే టస్సర్ చీరలకు ఎన్నో ప్రత్యేకతలుంటాయి.

వైల్డ్ సిల్క్: యాంథెరీ మాత్‌ల గూళ్ల నుంచి సేకరించిన పట్టుతో వైల్డ్ పట్టును తయారుచేస్తారు. ఈ వైల్డ్ పట్టు పురుగులు మల్బరీ ఆకులు మినహా ఇతరత్రా ఆకులను తింటాయి

టెక్స్‌చర్: కాస్త గురుకుగా ఉండే ఈ వస్త్రం, సుతిమెత్తని మల్బరీ పట్టుకు భిన్నంగా ఉంటుంది

మెరుపు: ఈ పట్టు సహజసిద్ధ బంగారు మెరుపు కలిగి ఉంటుంది

రంగు: బీజ్, క్రీమ్, గోధుమ రంగుల్లో తయారవుతుంది

డిజైన్: సంప్రదాయ బెంగాలీ టస్సర్ చీరలు, నేత బార్డర్లు, కొంగులను కలిగి ఉంటాయి. అలాగే చీర మొత్తం పూల మోటిఫ్సను కలిగి ఉంటాయి

పేర్లు: టస్సర్ సిల్క్‌నే కోసా సిల్క్ అని కూడా అంటారు



ప్రత్యేకతలివే!

సహజ సిద్ధం: ఈ పట్టు తయారీలో సహజరంగులనే ఉపయోగిస్తారు

ఫ మన్నిక: టస్సర్ పట్టు ఎంతో మన్నికైనది. దీనికి ముడతలు, చిరుగులు ఏర్పడవు

ఫ వైవిధ్యం: సాధారణ వేడుకలు మొదలు, పెళ్లిళ్లు, పండగలకు కూడా ఈ చీరలెంతో చక్కగా సూటవుతాయి.










# హైడ్రేటెడ్‌గా ఉంటేనే.. అందం!



వేసవి వేడి.. మీ చర్మం తేమను కోల్పోయేలా చేస్తుంది. చర్మం పొడిబారి.. అందం బీటలు వారుతుంది. అంతేకాదు.. సూర్యుడి హానికరమైన యూవీ కిరణాలు.. చర్మంలో మెలనిన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. తద్వారా చర్మం రంగు మారడంతోపాటు ముఖంపై నల్ల మచ్చలూ ఇబ్బంది పెడుతాయి. వీటినుంచి బయట పడాలంటే.. ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే!

చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి పుష్కలంగా నీరు తాగాలి. రోజుకు కనీసం 8–10 గ్లాసులైనా తీసుకోవాలి. దీనివల్ల శరీరం నుంచి టాక్సిన్స్ బయటికి వెళ్లిపోతాయి. చర్మం లోపలి నుంచి హైడ్రేటెడ్‌గా మారుతుంది.

నీటిశాతం అధికంగా ఉండే దోసకాయలు, పుచ్చకాయ, నారింజ, స్ట్రాబెర్రీలను ఎక్కువగా తీసుకోండి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేయడమే కాకుండా.. చర్మానికి అవసరమైన పోషకాలను కూడా అందిస్తాయి.

ఆహారంలో యాంటి ఆక్సిడెంట్స్, విటమిన్ సి ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవి యూవీ కిరణాల నుంచి చర్మానికి రక్షణ కల్పిస్తాయి. విటమిన్ సి.. శరీరంలో ఫ్రీరాడికల్స్‌తోపాటు మెలనిన్ ఉత్పత్తిని నిరోధిస్తుంది. నల్లమచ్చలు రాకుండా కాపాడుతుంది.

ఇక ఎక్కువ సమయంపాటు ఏసీ గదుల్లో ఉన్నా.. చర్మం పొడిబారుతుంది. ఏసీల నుంచి వచ్చే పొడిగాలి.. చర్మంలో తేమను తొలగిస్తుంది. కాబట్టి, ఇంట్లో, కార్యాలయాల్లో హ్యూమిడిఫయర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఇవి గాలికి తేమను అందించి.. చర్మం ఎక్కువ పొడిగా మారకుండా నిరోధిస్తాయి.

చర్మ సంరక్షణ కోసం కలబంద వంటి హైడ్రేటింగ్ పదార్థాలను కలిగిన మాయిశ్చరైజర్లు వాడాలి. ఇవి చర్మం తేమను కోల్పోకుండా కాపాడతాయి. చర్మాన్ని మృదువుగా మార్చడంలో సహాయపడతాయి.

వేసవిలోనే కాదు.. ఏడాదంతా సన్‌స్క్రీన్ లోషన్ వాడటం మంచిది. ఇది హైపర్‌పిగ్మెంటేషన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తుంది. రసాయనాలు తక్కువగా ఉండే ఉత్పత్తులను ఎంచుకోండి. ఇక వేసవిలో ప్రతి రెండుమూడు గంటలకు ఒకసారి సన్‌స్క్రీన్ లోషన్‌ను అప్లయి చేస్తూ ఉండాలి.

# డోనట్‌లో తాగేద్దాం!

ఎండకాలం వేడిని తట్టుకోవాలంటే కూలర్లలోనే కాదు, పొట్టలోనూ నీళ్లను దండిగా నింపాల్సిందే. కానీ ఎంత ఎండకాలమైనా మాటిమాటికీ నీళ్లు తాగడం కాస్త కష్టంగానే ఉంటుంది. కానీ ఆ పనిని ఆకర్షణీయంగా మార్చేందుకు సరికొత్త ఆకృతుల్లో వాటర్ బాటిళ్లు మార్కెట్లోకి వస్తున్నాయి. ఆ కోవలోవే ఈ 'డోనట్ షేప్డ్ వాటర్ బాటిళ్లు'. తియ్యగా మనం తినే డోనట్ మధ్యలో రంధ్రం ఉన్నట్టే ఈ బాటిళ్లకు కూడా మధ్యలో ఖాళీ ఉంటుంది.

చూసేందుకు భిన్నంగా పట్టుకోవడానికి వీలుగా ఉంటాయి. కొన్నిటికి ఇలా మధ్యలో రంధ్రం రాకపోయినా చూసేందుకు మాత్రం అచ్చం డోనట్‌లా ఉండి తగిలించుకునేందుకు స్ట్రాప్ ఉండేలా వస్తున్నాయి. వీటిని బయటికి వెళ్లినప్పుడు ఎంచక్కా భుజానికి వేసుకుని వెళ్లొచ్చు. లేదా స్ట్రాప్‌లు తీసేసి ఫ్రిజ్‌లో పెట్టుకోవచ్చు. పిల్లలు కూడా వాడగలిగేలా సిప్పర్ తరహాలో తయారవుతున్నాయివి. కావాలంటే నచ్చిన రంగు, డిజైన్లలో వీటిని చేసిచ్చే కంపెనీలూ ఉన్నాయి. కాబట్టి డోనట్ తినడమే కాదు, ఇప్పుడు డోనట్‌లో ఎంచక్కా తాగేయొచ్చు కూడా!





# మహిళా ఉద్యోగులకు పట్టం!



మహిళా ఉద్యోగులకు ప్రైవేట్ సెక్టార్ పట్టం కడుతున్నది. గత ఆరేళ్లలో వివిధ రంగాల్లో.. ఆడవాళ్ల భాగస్వామ్యం ఆరు శాతం పెరిగింది. మహిళా నియామకాలు 2019లో 26 శాతం ఉండగా.. 2024లో 32 శాతానికి పెరిగినట్లు టాలెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ సంస్థ 'కెరీర్‌నెట్' అధ్యయనం తేల్చింది. ఇందుకోసం 2019 నుంచి 2024 క్యాలెండర్ ఇయర్స్‌కు సంబంధించిన 1,80,000 ప్లేస్‌మెంట్ నమూనాలను విశ్లేషించింది. ఈ సందర్భంగా 'దేశంలో మహిళల ఉపాధిస్థితి'కి సంబంధించిన అనేక విషయాలను పంచుకున్నది.

వివిధ రంగాల్లో మహిళల నియామకాలు ఆరు శాతం పెరిగినట్లు తేల్చింది. నగరాల వారీగా చూస్తే.. బెంగళూరు (32%), ఢిల్లీ (28%)తోపాటు హైదరాబాద్ (27%) ముందు వరుసలో నిలిచాయి. అదే సమయంలో టైర్–2 నగరాల్లోనూ మహిళా అభ్యర్థుల నియామకాల్లో స్థిరమైన పెరుగుదల నమోదైంది.

గత మూడేళ్లలో ఈ నగరాల్లో 5 శాతం పెరుగుదల కనిపించింది. వివిధ రంగాల విషయానికి వస్తే.. ఐటీ రంగం 29 – 30 శాతంతో స్థిరమైన భాగస్వామ్య రేటును కొనసాగిస్తున్నది. స్టార్టప్స్‌లోనూ.. 2022 నుంచి 2024 వరకు మహిళల భాగస్వామ్యం 9 శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడిస్తున్నది. అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. మహిళల నియామకాల్లో ఫ్రెషర్లే ఆధిపత్యం చలాయిస్తున్నారు.

అయితే, 2023 నుంచి వీరిలోనూ 2 శాతం తగ్గుదల ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. 3 నుంచి 12 ఏళ్ల పని అనుభవం ఉన్న మధ్యస్థాయి స్థానాల్లో.. మహిళల నియామకం స్థిరంగా కొనసాగుతున్నది. అదే.. 12 ఏళ్లకుపైగా అనుభవం ఉన్న సీనియర్ స్థాయిలో .. మహిళల నియామకాలు స్వల్పంగా తగ్గాయి. 2024లో 1 శాతం తగ్గి 19 శాతానికి చేరుకున్నాయి.

# అమ్మ వంటను అందలం ఎక్కించింది



అమ్మ పెట్టిన ఆవకాయ ఆల్వేస్ అద్భుతః. అన్నంలో ఎర్రగా కలుపుకొని, లొట్టలేసుకొని తింటే.. ఆ క్షణం స్వర్గంలో ఉన్నట్టుంటుంది. అక్కడికే తృప్తిపడలేదు ఆమె! అమ్మ హస్తవాసితో తన చేతి గీతను దిద్దుకుంది. అమ్మ చేసిన సంప్రదాయ వంటకాలను సామాజిక మాధ్యమాల వారధిగా విదేశాలకు ఎగుమతి చేయడం మొదలుపెట్టింది. మారుమూల పల్లె ఘుమఘుమల్ని అమెరికాలోని తెలుగువాళ్లు ఆఘ్రాణించేలా బ్రాండ్ నెలకొల్పింది. 'ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు' పేరుతో పచ్చళ్లు, పిండివంటలు, పొడులు తయారు చేయించి ఏడాదికి కోటికిపైగా టర్నోవర్ సాధిస్తున్నది. సాఫ్ట్‌వేర్ కొలువును వదిలిపెట్టి.. పచ్చళ్ల వ్యాపారంలో పైపైకి ఎదుగుతున్న చిలువేరు సాహితి నయా జర్నీ ఆమె మాటల్లోనే..

మాది మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రం. ఆ ఊళ్లోనే నాన్న సత్యనారాయణ కిరాణా షాపు నిర్వహిస్తారు. అమ్మ కన్యాకుమారి గృహిణి. వంటలు చాలా బాగా చేస్తుంది. నన్ను, మా ఇద్దరు అన్నలను వాళ్లు ఎంతో కష్టపడి చదివించారు. మేడ్చల్‌లోని మల్లారెడ్డి కాలేజీలో 2019లో బీటెక్ చేశాను. అదే సంవత్సరం క్యాంపస్ సెలక్షన్స్‌లో టీసీఎస్‌లో జాబ్ వచ్చింది. ఇంట్లో వాళ్లు హ్యాపీ.. నేను కూడా సంతోషపడ్డా. కానీ, ఎంత కష్టపడ్డా మనసుకు ప్రశాంతత ఉండేది కాదు. 2020లో కరోనా సమయంలో ఇంటికి వచ్చినప్పుడు ఖాళీ సమయంలో ఇంట్లో అమ్మ చేసే వంటకాలతో రీల్స్ చేసేదాన్ని. ఓ రోజు అమ్మ పెట్టిన ఆవకాయ రీల్ వైరలైంది.

చాలామంది అమ్ముతారా అని అడిగారు. అప్పుడు వచ్చింది ఈ ఆలోచన. వెంటనే కొన్ని పచ్చళ్లు చేసి అడిగిన వారికి పంపించాం. అలా నా స్టార్టప్ జర్నీ మొదలైందన్నమాట. కానీ, చాలామంది 'పచ్చళ్లు అమ్ముకొని ఏం సాధిస్తారు. మీతో ఇది అయ్యే పనేనా?' అని హేళన చేశారు. ఆ మాటలతో మాలో పట్టుదల ఇంకా పెరిగింది. కేఎఫ్‌సీ చికెన్ ఎక్కడినుంచో వచ్చి మన దగ్గర బిజినెస్ చేస్తున్నది. అలాంటప్పుడు మన తెలుగు సంప్రదాయ వంటకాలకు ప్రపంచవ్యాప్తంగా రీచ్ ఎందుకు ఉండొద్దు అనుకున్నా! అలా అమ్మ చేసిన పచ్చళ్లు, పిండి వంటల వీడియోలు ఇన్‌స్టాలో పోస్టు చేయడం మొదలుపెట్టాను. మాకు వచ్చే ఆర్డర్ల సంఖ్య కూడా పెరిగింది. మాకంటూ ఒక బ్రాండ్ ఉండాలని 2022లో 'ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు' మొదలుపెట్టాం.

**విదేశాల తెలుగువాళ్లే..**

మా వినియోగదారుల్లో సింహభాగం విదేశాలకు చెందినవాళ్లే ఉన్నారు. దేశదేశాల్లో స్థిరపడిన తెలుగువాళ్లు నా ఇన్‌స్టా



చూసి ఆర్డర్లు ఇవ్వడం మొదలుపెట్టారు. ఎప్పుడో విదేశాలకు వెళ్లి అక్కడే ఉంటున్నవాళ్ల పేరెంట్స్ ఇప్పుడు వాళ్లకు కావాల్సిన పిండివంటలు, పచ్చళ్లు పంపించే పరిస్థితిలో ఉండరు. అలాంటి వాళ్లంతా ఇప్పుడు 'ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు' బ్రాండ్ యూజర్లుగా మారారు. మంచి ఫీడ్‌బ్యాక్ కూడా ఇస్తున్నారు. మునుపు వేల సంఖ్యలో ఉన్న నా ఇన్‌స్టా హ్యాండిల్ ఫాలోవర్ల సంఖ్య ఇప్పుడు 2.27 లక్షలకు పెరిగింది. మాకు వచ్చే ఆర్డర్లలో ఇన్‌స్టా నుంచి వచ్చేవే ఎక్కువ! ఒక్కసారి మా బ్రాండ్ రుచి చూసివాళ్లు మళ్లీ మళ్లీ ఆర్డర్ పెడుతున్నారు.

మా అమ్మ చేసినట్టు ఉంద'ని, 'మా నానమ్మను, అమ్మమ్మను గుర్తు చేశార'ంటూ కామెంట్లు చేస్తున్నారు. విదేశాల్లో వాళ్ల స్నేహితులకు సైతం మా ఫ్లేవర్స్ రిఫర్ చేస్తున్నారు. మొదట్లో నెలకు 50 ఆర్డర్లు వచ్చేవి. ఇప్పుడు ప్రతిరోజూ 50కి పైగానే వస్తున్నాయి. అమ్మపెట్టిన ఆవకాయతో మొదలైన మా జర్నీ ఇప్పుడు వంద ప్రొడక్ట్స్‌కు చేరువైంది. పండుగ సమయాల్లో అస్సలు తీరిక ఉండదు. గత సంక్రాంతికి 15 రోజుల్లో దాదాపు 500 కిలోల ఆర్డర్లు డెలివరీ చేశాం. ఇవన్నీ విదేశాలకు ఎగుమతి చేసినవే! యూకే, కెనడా, యూఎస్, జర్మనీ, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్ ఇలా తెలుగువాళ్లు ఉండే దాదాపు పదికిపైగా దేశాల్లో మా కస్టమర్లు ఉన్నారు.

**పది కుటుంబాలకు ఆసరా..**

ఈ బిజినెస్ స్టార్ట్ చేసినప్పుడు చుట్టూ ఉన్నవాళ్లు ప్రోత్సహించక పోగా, హేళనగా చూశారు. 'ఏసీ కింద కూర్చుని ఉద్యోగం చేసుకోక.. ఈ పిల్లకు ఏమైంది' అనుకున్నారు. కానీ, ఉద్యోగంలో లేనిది, ఈ బిజినెస్‌లో నాకు దొరికింది ప్రశాంతత! ఏడాదికి ఆరు లక్షల ప్యాకేజీ తీసుకున్నా! ఇప్పుడు.. ఆడుతూ, పాడుతూ నెలకు పదిలక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నా! ఖర్చులు, జీతాలు పోగా నెలకు దాదాపు 15 శాతం లాభం వస్తున్నది. మా గ్రామానికి చెందిన పదిమంది మహిళలు మా దగ్గర పనిచేస్తున్నారు. వాళ్లు చేసే పనినిబట్టి వేతనాలు ఇస్తున్నా! పది కుటుంబాలకు ఆసరాగా నిలిచానన్న సంతృప్తి కూడా ఉంది. మా దగ్గర ఆవకాయ, నిమ్మకాయ, ఉసిరికాయ, రేగుపండ్ల పచ్చడి ఇలా 20 రకాల పచ్చళ్లు తయారు చేస్తున్నాం. సీజన్‌ను బట్టి పచ్చళ్లు మారుతుంటాయి. అప్పడాలు, వడియాలు అమ్ముతున్నాం. పులిహోర మిక్స్, పల్లికారం, నువ్వుల కారం, మసాలా కారం, ఇతర పొడులు, స్వీట్లు ఇలా వంద రకాల ఉత్పత్తులు తయారుచేస్తున్నాం. వచ్చిన ఆర్డర్‌ను బట్టి అప్పటికప్పుడు పదార్థాలు తయారుచేస్తుంటాం.

మంచిర్యాల డీటీడీసీ కొరియర్ ద్వారా పంపితే.. వాళ్లు డీహెచ్‌ఈఎల్, యూపీఎస్ ద్వారా విదేశాలకు చేరవేస్తున్నారు. ఇప్పుడు విదేశాలతోపాటు మనదేశంలో వివిధ రాష్ట్రాల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. సోషల్ మీడియాలోనే మార్కెటింగ్ చేస్తుండటం కారణంగా మాకు కలిసివస్తున్నది. ఇప్పటికైతే నెన్నెలలోనే రెండు గదుల్లో వ్యాపారం నిర్వహిస్తున్నా! రానున్న రోజుల్లో మంచిర్యాలలో పెద్దగా ప్రారంభించాలనే ఆలోచన ఉంది. వినియోగదారుల ఆదరణ లభిస్తే వ్యాపారాన్ని మరింత విస్తరిస్తాం. దానిద్వారా మరింత మందికి ఉపాధి కల్పించవచ్చు కదా!



## వరుసగా రెండో రోజూ భారీ నష్టాలే.. సెన్సెక్స్ 700 పాయింట్లు డౌన్..

**ముంబై-నవభూమి:**భారత ఉత్పత్తులపై 50 శాతం సుంకాలు అమల్లోకి రావడంతో మంగళవారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు గురువారం కూడా అదే తరహాలో పయనించాయి. వరుసగా రెండో రోజూ కూడా నష్టాలను మూటగట్టుకున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు కూడా అమ్మకాలకు దిగుతుండడం మదుపర్లను మరింత కలవరపెడుతోంది. మంగళవారం విదేశీ మదుపర్లు 6, 516 కోట్లు విలువైన షేర్లును విక్రయించారు. ఆ ప్రభావం కూడా పడడంతో గురువారం సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాలను చవిచూశాయిమంగళవారం ముగింపు (80, 786)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ రోజంతా




నష్టాల్లోనే కదలాడింది మధ్యాహ్నం తర్వాత ఆ నష్టాలు మరింత పెరిగాయి. గురువారం సెన్సెక్స్ 80, 013- 80, 775 శ్రేణి మధ్యలో కదలాడింది. చివరకు సెన్సెక్స్ 705 పాయింట్ల నష్టంతో 80, 080 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 211 పాయింట్ల నష్టంతో 24, 500 వద్ద స్థిరపడింది సెన్సెక్స్‌లో కల్యాణ్ జువెల్లర్స్, యూనో మిండా, జిందాల్ స్టెయిన్‌లెస్, టైటాన్ కంపెనీ, పెట్రోనాట్ ఎల్‌ఎన్‌జీ షేర్లు లాభాలను ఆర్జించాయి. అదానీ టోటల్ గ్యాస్, ఆదిత్య బిర్లా ఫ్యాషన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్స్, పూనావాలా ఫిన్‌కార్ప్, సీఈఎస్‌సీ షేర్లు నష్టాల బాటలో నడిచాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 718 పాయింట్లు కోల్పోయింది.

## బంగారం ధరల్లో పెరుగుదల.. నేటి రేట్లు ఏంటంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌పై అమెరికా సుంకాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. రేట్లు క్రమంగా పెరుగుతు న్నాయి . గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,02,450గా ఉంది. 22 క్యారెట్ 10 గ్రాముల గోల్డ్ ధర రూ.93,910గా ఉంది. ఇక 18 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.76,840గా ఉంది. కిలో వెండి ధర రూ.1,19,900గా ఉంది. 10 గ్రాముల ప్లాటినం ధర రూ.38,090గా ఉంది.

దేశంలోని వివిధ నగరాల్లో బంగారం ధరలు ఇలా
చెన్నై: 1,02,450 ; 93,910 ; 77,710
ముంబయి:1,02,450 ; 93,910 ; 76,840
ఢిల్లీ: 1,02,600 ; 94,060 ; 76,960
కోల్‌కతా: ,02,450 ; 93,910బీ ?76,840
బెంగళూరు:1,02,450బీ ?93,910 ; 76,840
హైదరాబాద్: 1,02,450 ; 93,910 ;?76,840
కేరళ: 1,02,450 ; 93,910 ;76,840
పుణె: 1,02,450 ;93,910 ;76,840
వడోదరా: 1,02,500 ; 93,960 ;76,880
అహ్మదాబాద్: 1,02,500 ; 93,960 ; 76,880

## పీఎం-కుసుమ్ పథకంలో భాగంగా మహారాష్ట్రలో
# 10,714 సోలార్ పంపింగ్ సిస్టమ్స్ ఏర్పాటుకు రూ.320 కోట్ల ఆర్డర్

**న్యూఢిల్లీ-నవభూమి:**పునరుత్పాదక ఇంధన జల పరిష్కారాల్లో అగ్రగామి అయిన (సీఆర్ఐ) పంప్స్ విభాగం (సీఆర్ఐ) సోలార్ "మాగెల్ త్యాలా సౌర్ కృషి పంప్" పథకం కింద రూ.320 కోట్ల విలువైన 3 5 న్యా, 7.5 సామర్థ్యాలతో కూడిన 10,714 ఆఫ్-గ్రిడ్ సోలార్ ఫొటోవోల్టాయిక్ వాటర్ పంపింగ్ సిస్టమ్స్ డిజైన్, సరఫరా, ఇన్‌స్టాలేషన్, కమిషనింగ్ కోసం మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ నుంచి లెటర్ ఆఫ్ ఎంప్యానెల్‌మెంట్ పొందింది. అంతర్‌నిర్మిత ఆధారిత రిమోట్ మానిటరింగ్ సిస్టమ్‌తో రిపేర్లు, మెయింటె నెన్స్ కవర్ చేస్తూ 5 వారంటీతో వస్తుంది.తక్కువ నీటి సరఫరా, ఆఫ్-గ్రిడ్ గ్రామీణ ప్రాంతాలలో నమ్మకమైన నీటి సదుపాయాన్ని అందించడంలో ఈ చర్య సాయపడుతూ సంప్రదాయ ఇంధనంపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించి నీటిపారుదల విశ్వసనీయత పెంచి వ్యవసాయ ఉత్పాదకత, గ్రామీణ శ్రేయస్సుకు ఊతంగా నిలుస్తుంది.

భారీ స్థాయి సోలార్ ప్రాజెక్టులను అత్యంత నాణ్యతతో సకాలంలో, సమర్థవంతంగా అమలు చేయడంలో (సీఆర్ఐ) సోలార్‌కు ఉన్న నిరూపిత నైపుణ్యాన్ని ఉపయోగించుకుంటూ నిర్దేశించిన గడువు ప్రకారం ప్రాజెక్టు అమలు ప్రారంభమవుతుంది.కీలక మైలురాయి చేరుకున్న సందర్భంగా (సీఆర్ఐ) గ్రూప్ ఛైర్మన్ జి. సౌందరరాజన్ మాట్లాడుతూ, నుంచి రూ.320 కోట్ల రూపాయల విలువైన ఎంప్యానెల్‌మెంట్ అనేది కేవలం ఒక వ్యాపార విజయం మాత్రమే కాదు, ఇది భారతీయ రైతులకు శుభ్రమైన, విశ్వసనీయమైన, సుస్థిర జల పరిష్కారాలు అందించే సాధికారతలో ఒక కీలక అడుగు. పునరుత్పాదక ఇంధన స్వీకరణను వేగవంతం చేస్తూ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు నమ్మకమైన నీటిపారుదల అందించడంలో మహారాష్ట్రకు సహకరించడం మాకు గర్వకారణం" అన్నారు.దేశవ్యాప్తంగా ఆధారిత స్మార్ట్ పంపుల ద్వారా 1,81,000లకు పైగా సోలార్ పంపింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసి ఇంధన సామర్థ్య సుస్థిర జలమౌలిక సదుపాయాల దిశగా భారతదేశాన్నినడిపించే పరివర్తనను సీఆర్ఐ) కొనసాగిస్తోంది. ఈ ప్రాజెక్టులు 6,100 మిలియన్ యూనిట్ల ఇంధనాన్ని పొదుపు చేయడంతో పాటు 4.8 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలను నిరోధించాయి. ఇవన్నీ పర్యావరణ నిర్వహణ, దేశ పురోగతి, గ్రామీణ అభ్యున్నతిలో (సీఆర్ఐ) నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయి.అధిక సామర్థ్యంతో కూడిన సోలార్ పంపింగ్ వ్యవస్థలు, తెలివైన రిమోట్ పర్యవేక్షణ, అమ్మకాల తర్వాత సమగ్ర మద్దతు వంటి పోర్ట్‌ఫోలియోతో ప్రభుత్వ నేతృత్వంలోని పునరుత్పాదక ఇంధనం, నీటిపారుదల కార్యక్రమాలకు విశ్వసనీయ భాగస్వామిగా (సీఆర్ఐ) సోలార్ నిలుస్తూ రైతులు, గ్రామీణవర్గాలకు నమ్మకమైన, పర్యావరణ అనుకూలమైన నీటి పరిష్కారాలు అందిస్తోంది..

**(సీఆర్ఐ) పంప్స్ గురించి**

1961లో ఏర్పాటైన (సీఆర్ఐ) పంప్స్ సమగ్ర ఫ్లూయిడ్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ అందించడంలో ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతూ అత్యంత విశ్వసనీయ బ్రాండ్స్‌లో ఒకటిగా నిలుస్తోంది. నిబద్ధత, విశ్వసనీయత, ఆవిష్కరణలు ప్రధాన విలువలుగా (సీఆర్ఐ) నిరంతరం ప్రపంచ స్థాయి ఇంజినీరింగ్, కస్టమర్-కేంద్రీకృత ఆవిష్కరణలు అందిస్తూ పరిశ్రమ ప్రమాణాలను పునర్‌నిర్వచిస్తోంది.

బలమైన అంతర్జాతీయ ఉనికితో 120 దేశాల్లోని 30,000o ఔట్‌లెట్స్‌తో కూడిన నెట్‌వర్క్ ద్వారా . (సీఆర్ఐ) ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. దీనికి తోడ్పాటు అందించేందుకు ప్రపంచవ్యాప్తంగా 1,500 సర్వీస్ సెంటర్లున్నాయి.

భారత ప్రభుత్వపు సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ గుర్తింపు సహా అంతర్జాతీయ ప్రామాణికత కలిగిన ఫ్లూడిన్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటరుతో (సీఆర్ఐ) పంప్స్ ఇంజినీరింగ్ నైపుణ్యం అనుసంధానమై ఉంది. ఈ సెంటర్ నిరంతర ఆవిష్కరణలు ప్రోత్సహిస్తూ ఫ్లూయిడ్ టెక్నాలజీలో (సీఆర్ఐ) ముందంజలో నిలుపుతూ విభిన్న పారిశ్రామిక రంగాలకు కావాల్సిన తెలివైన, సమర్థవంతమైన భవిష్యత్తుకు సిద్ధంగా నిలిచే పరిష్కారాలు అందించేలా చూస్తోంది. సుస్థిరత, ప్రతిభ విషయంలో నిబద్ధతకు గుర్తింపుగా ఇంజినీరింగ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్ అవార్డు 22సార్లు, భారత ప్రభుత్వపు నేషనల్ ఎనర్జీ కన్సర్వేషన్ అవార్డు 8సార్లు సంస్థ గెలుచుకుంది.

నీళ్లు వ్యర్థ జలాలు, సోలార్, ప్రాసెస్ పరిశ్రమలు, మురుగు, పారిశ్రామిక జలాల శుద్ధి ప్లాంట్లు, ఫైర్ ఫైటింగ్, మెటల్, మైనింగ్, ఫుడ్ బెవరేజ్, వ్యవసాయం, నివాసాలు సహా వివిధ రంగాల అవసరాలు (సీఆర్ఐ) పంపులు తీర్చుతున్నాయి.

## 2038 నాటికి ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

**న్యూఢిల్లీ-నవభూమి:** ఇప్పటివరకు అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉన్న ఇండియా, త్వరలోనే ప్రపంచంలో టాప్ ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలవబోతోంది. ఈ విషయం ఏదో ఊహ కాదు... ప్రముఖ అంతర్జాతీయ కాంపెనీ తాజా నివేదిక ప్రకారం, 2038 నాటికి భారతదేశం కొనుగోలు శక్తి సమతుల్యత ప్రకారం ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతుంది.PPP అంటే ఏంటి?:కొంతమందికి అన్న పదం కొత్తగా అనిపించవచ్చు. సింపుల్‌గా చెప్పాలంటే, ఒక్కో దేశంలో ఒకే తరహా వస్తువులకు ఉన్న ధరల తేడా ఆధారంగా ఆ దేశం ఆర్థిక శక్తిని అంచనా వేస్తారు. దీనివల్ల వాస్తవానికి ప్రజలు ఎంత కొనగలుగుతున్నారన్న దాని మీద స్పష్టమైన అవగాహన వస్తుంది. ఈ నివేదిక అంచనాల ఆధారంగా రూపొందించబడింది. 2030 నాటికి భారత్ ఆర్థిక వ్యవస్థ $%20.7 ట్రిలియన్ స్థాయికి చేరుకుంటుందని అంచనా. ఇది అమెరికా, జర్మనీ, జపాన్ లాంటి పెద్ద దేశాల కంటే ఎక్కువ కావడం విశేషం.

**భారత్ ఎదుగుదలకు కొన్ని ప్రత్యేక కారణాలు:**

యువ జనాభా: 2025 నాటికి భారత జనాభా మాధ్య వయస్సు 28.8 సంవత్సరాలు మాత్రమే. ఇది పని చేయగల శక్తివంతమైన వయస్సు.ఉన్నత ఆదాయం పొదుపు రేటు: భారత్?లో పొదుపు చేయడానికీ పెట్టుబడులకు మంచి ఆదరణ ఉంది.కరెంట్ అకౌంట్ స్థిరత్వం: ప్రభుత్వ రుణం జీడీపీతో పోల్చినప్పుడు 2024లో 81.3% ఉండగా, 2030 నాటికి అది 75.8%కి తగ్గే అవకాశం ఉంది.ఇతర దేశాల పరిస్థితి ఎలా ఉంది?చైనా ఇప్పటికీ ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది, అయితే వారిలో వృద్ధాప్య జనాభా పెరగడం, ప్రభుత్వ రుణం పెరగడం వంటి సవాళ్లు ఉన్నాయి.అమెరికా మంచి స్థితిలో ఉన్నా, వారి రుణం జీడీపీ కంటే 120% ఎక్కువగా ఉంది. జర్మనీ, జపాన్ వంటి దేశాలు వృద్ధ జనాభా, గ్లోబల్ ట్రేడ్‌పై ఎక్కువ ఆధారపడటం వల్ల కొంత పరిమితుల మధ్య కొనసాగుతున్నాయి.

**వికసిత భారత్ 2047**

నివేదిక ప్రకారం, మనం టెక్నాలజీ, మానవ వనరులు, పెట్టుబడుల పరంగా ముందుకు సాగుతున్నాం. మార్పుల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా మారుతోంది. భారత్‌కు ఉన్న యువశక్తి, పెట్టుబడుల అవకాశాలు, స్థిరమైన అప్పు పరిమితి ఇవన్నీ గ్లోబల్ అస్థిరత ఉన్నా మనకు మంచి వృద్ధిని కలిగిస్తాయని నివేదిక అంచనా వేస్తోంది. 2028 నాటికి మార్కెట్ ఎక్స్ఛేంజ్ రేట్ ప్రకారం జర్మనీని దాటి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారనుంది.

## అశ్రయ ఆకృతి - ఆప్టమ్ ఇండియా 'మొబైల్ హియరింగ్ క్లినిక్' ఆవిష్కరణ






**హైదరాబాద్-నవభూమి:** సమగ్ర ఆరోగ్య సంరక్షణ దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా, వికలాంగులను సాధికారత చేయడంలో కృషి చేస్తున్న అశ్రయ ఆకృతి అనే స్వచ్ఛంద సంస్థ, ఆప్టమ్ ఇండియాతో భాగస్వామ్యాన్ని మరింత బలపరుస్తూ అశ్రయ ఆకృతి మొబైల్ హియరింగ్ క్లినిక్‌ను ఆవిష్కరించింది. పూర్తిగా సకల సదుపాయాలతో సిద్ధమైన ఈ మొబైల్ యూనిట్, హైదరాబాద్‌లోని వెనుకబడిన వర్గాలకు నేరుగా చేరుకొని సమగ్ర చెవి-ముక్కు-గొంతు (ఆరోగ్య సేవలను అందించనుంది.ఈ కార్యక్రమం ద్వారా ఆధునిక వైద్య పరికరాలు, శ్రవణ పరీక్షలు, తొందరగా గుర్తింపు, సకాలంలో చికిత్సలు లాంటి కీలక సేవలు అందుబాటులోకి వస్తాయి. వెనుకబడిన సమాజాల గడప వద్దకే ఆరోగ్య సేవలను తీసుకెళ్లడం ద్వారా, ఈ మొబైల్ క్లినిక్ ఆరోగ్య లోటుపాట్లను పూడ్చి వినికిడి సమస్యలతో బాధపడుతున్న వారి జీవిత నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ మొబైల్ హియరింగ్ క్లినిక్ను అశ్రయ ఆకృతి వ్యవస్థాపకుడు డి.పి.కే. బాబు గారు, ఆప్టమ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి ఉమా రత్నం కృష్ణన్‌తో కలిసి ఆప్టమ్ హైదరాబాద్ కార్యాలయంలో ఆవిష్కరిం చారు. ప్రారంభోత్సవంతోపాటు పలు కమ్యూని టీ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించబడతాయి. వీటిలో లబ్ధిదారులు ఉచిత పరీక్షలు, నిపుణులైన వైద్యుల సలహాలు పొందవచ్చు.

ఈ సందర్భంగా అశ్రయ ఆకృతి వ్యవస్థాపకుడు డి.పి.కే. బాబు మాట్లాడుతూ -"అశ్రయ ఆకృతి లో, ఒక చిన్నారి వినికిడి పొందినప్పుడు వారి లోకమే ఎలా మారిపోతుందో మేము చూశాం. విద్య, స్నేహాలు, భవిష్యత్తు అవకాశాలకై కొత్త తలుపులు తెరుచుకుంటాయి. ఆప్టమ్ ఇండియాతో భాగస్వామ్యంలో ప్రారంభిస్తున్న మొబైల్ హియరింగ్ క్లినిక్ ఈ వాస్తవాన్ని మార్చడానికి హృదయపూర్వకమైన అడుగు. వెనుకబడిన వర్గాలకు నేరుగా చేరుకొని, వినికిడి సమస్యలను తొందరగా గుర్తించి చికిత్స చేయడం మాత్రమే కాదు, ఆశ, గౌరవం, ఆత్మవిశ్వాసం పునరుద్ధరించడం కూడా మా లక్ష్యం" అని అన్నారు.ఈ భాగస్వామ్యం ప్రతి ఒక్కరికి వినడానికి, నేర్చుకోవడానికి, ఎదగడానికి సమాన అవకాశం కలిగిన సమాజాన్ని నిర్మించాలనే నిబద్ధతను ప్రతిబింబిస్తోంది.ఆప్టమ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి ఉమా రత్నం కృష్ణన్ ం మాట్లాడుతూ -"ఆప్టమ్ ఇండియాలో, అర్థవంతమైన మార్పు తీసుకురావడంలో భాగస్వామ్య శక్తిపై మాకు నమ్మకం ఉంది. 'ఇన్ ఇండియా, ఫర్ ఇండియా' అనే మా ధ్యేయంతో, మా %జూ=% కార్యక్రమాల ద్వారా 4 లక్షల మందికి పైగా ప్రత్యక్షంగా, దాదాపు 10 లక్షల మందికి పరోక్షంగా మేము ప్రభావం చూపగలిగాము. అశ్రయ ఆకృతితో మా భాగస్వామ్యం ఈ లక్ష్యానికి నిదర్శనం. వారి హియరింగ్ క్లినిక్‌లకు మేము అందిస్తున్న మద్దతు వల్ల హైదరాబాద్‌లో మరింత మందికి వినికిడి సేవలు చేరువ అవుతున్నాయి. ఇప్పుడు మొబైల్ హియరింగ్ క్లినిక్ ప్రారంభం కావడం ద్వారా సమీప జిల్లాలకు కూడా ఈ సేవలు విస్తరించబోతున్నాయి. ఇది మా సమిష్టి ప్రభావాన్ని మరింత పెంచే ఒక కీలక మైలురాయి" అని పేర్కొన్నారు.

**అశ్రయ ఆకృతి గురించి**

1996లో స్థాపించబడిన అశ్రయ ఆకృతి వికలాంగులకు మద్దతు అందించి, వారి ఎదుగుదలకు అనుకూల వాతావరణాన్ని కల్పించే స్వచ్ఛంద సంస్థ. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఉచిత సేవలు అందించి వెనుకబడిన వర్గాల జీవితాలను మారుస్తూ వస్తోంది. వరల్డ్ హియరింగ్ ఫోరం గుర్తింపు, సర్టిఫికేషన్, భారత ప్రభుత్వ రిజిస్ట్రేషన్తోపాటు పలు పురస్కారాలు అందుకుంది - 2016లో హైదరాబాద్‌లో బెస్ట్ తెలంగాణ ప్రభుత్వంచే 2016-17లో బెస్ట్ అవార్డు, 2024లో వికలాంగుల సాధికారతకు స్టేట్ అవార్డు.

**ఆప్టమ్ ఇండియా గురించి**

ఆప్టమ్ ఇండియా, ప్రపంచంలోని ఫార్చ్యూన్ 3 కంపెనీ యునైటెడ్ హెల్త్ గ్రూప్ కు చెందిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్. 20 ఏళ్లకు పైగా భారతదేశంలో తమ సేవలతో, ఆరోగ్యరంగంలో డేటా అనలిటిక్స్, టెక్నాలజీ పరిష్కారాలు, ఇన్నోవేషన్ ద్వారా నాణ్యమైన ఆరోగ్య ఫలితాలను అందిస్తోంది. ప్రజలు ఆరోగ్యంగా జీవించేందుకు, ఆరోగ్య వ్యవస్థ మరింత సులభం, చేరువ, అందుబాటులో ఉండేలా చేయడమే ఆప్టమ్ లక్ష్యం.

## ఇది మోదీ యుద్ధం.. భారత్ అలా చేస్తే రేపటి నుంచే 25 శాతం సుంకాలు : అమెరికా



**న్యూఢిల్లీ-నవభూమి:** మిత్రదేశం అంటూనే భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అక్కసును వెళ్లగక్కుతున్నారు. రష్యా చమురు కొనుగోలు కారణం చూపి న్యూఢిల్లీపై భారీగా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. తాజాగా న్యూఢిల్లీ పై అగ్రరాజ్యం మరోసారి తన అక్కసు వెళ్లగక్కింది. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగేందుకు ఇండియానే కారణం అని ట్రంప్ సలహాదారుడు పీటర్ నవారో విమర్శించారు. దీన్ని 'మోదీ యుద్ధం'గా అభివర్ణించారు. ఇదే సమయంలో అమెరికా సుంకాల నుంచి భారత్ తప్పించుకోవాలంటే రష్యా నుంచి చమురును కొనుగోలు చేయడం వెంటనే ఆపేయాలని భారత్‌కు సూచించారు.భారత్‌పై అమెరికా విధించిన 50శాతం సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓ టెలివిజన్‌తో పీటర్ నవారో మాట్లాడారు. 'రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగేందుకు ఇండియానే ప్రధాన కారణం. రష్యా నుంచి రాయితీపై భారత్ ముడిచమురు కొనుగోలు చేయడమే యుద్ధంలో పుతిన్ దూకుడుకు ఆజ్యం పోసినట్లైంది. భారత్ ఆ పని చేయకపోతే యుద్ధం ఇంత కాలం కొనసాగి ఉండేది కాదు. ఇది ముమ్మాటికీ మోదీ యుద్ధమే. అయినా భారత్ తీరు చాలా విచిత్రంగా ఉంది. రష్యా విషయంలో మోదీ ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు. భారత్ చర్యల వల్ల అమెరికా పన్ను చెల్లింపుదారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి చర్యలకు భారత్ కూడా సహకరించాలి. ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదు. రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ వెంటనే ఆపేయాలి. భారత్ ఆ దిశగా చర్యలు ప్రారంభిస్తే తర్వాతి రోజు నుంచే 25శాతం సుంకాలు అమల్లోకి వస్తాయి' అని పీటర్ నవారో వ్యాఖ్యానించారు.

## అమెరికా ఫెడ్ రిజర్వ్ గవర్నర్ లిసా కుక్‌కు ఉద్వాసన



**న్యూయార్క్-నవభూమి:**తనఖా రుణాల అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ లిసా కుక్‌కు ఉద్వాసన చెప్పాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం నిర్ణయించారు. ఫెడ్‌కు గవర్నర్‌గా నియమితురాలైన తొలి ఆఫ్రికన్-అమెరికన్ ఆమె. ట్రంప్ నియమించిన ఫెడరల్ హౌసింగ్ ఫైనాన్స్ ఏజెన్సీ చీఫ్ విలియం పుల్టే.. లిసా తనఖా పెట్టిన రెండు నివాసాలు ఆమెకు సంబంధించినవేనని ఆరోపించారు. దీన్ని ఆధారం చేసుకుని లిసాను రాజీనామా చేయాలని ఈ నెల 20న ట్రంప్ ఆదేశించారు. అంతేకాకుండా "మిమ్మల్ని పదవి నుంచి తొలగించేందుకు తగిన ఆధారాలున్నట్టు నేను నిర్ధారించుకున్నాను" అని ట్రంప్ ఆమెకు రాసిన లేఖలో పేర్కొన్నారు. తనఖా దరఖాస్తుల్లో ఆమె తప్పుడు సమాచారం ఇచ్చారని కూడా ఆరోపించారు. ఫెడ్ నాయకత్వంలో మార్పు లు చేయాలన్న తన ప్రయత్నంలో భాగంగా ట్రంప్ అనుసరిస్తున్న ఒత్తిడి వ్యూహమని విశ్లేషకులంటున్నారు. వడ్డీరేట్ల తగ్గింపు విషయంలో ఫెడ్‌కు, ట్రంప్‌కు మధ్యన విభేదాలున్న విషయం విదితమే.


## ఈ వర్షాకాలంలో KAI ఇండియా నెయిల్ క్లిప్పర్‌తో సుందరంగా, పరిశుభ్రంగా ఉండండి

### మీకు అవసరమని తెలియని మాన్‌సూన్ హ్యాక్!



**న్యూఢిల్లీ-నవభూమి:** వర్షాకాలం వేసవి వేడి నుండి రిఫ్రెష్‌గా ఉపశమనాన్ని అందించినప్పటికీ, ఇది పెరిగిన తేమ చెమ్మను కూడా తీసుకువస్తుంది, ఇది వ్యక్తిగత పరిశుభ్రతను ముఖ్యంగా గోళ్ల సంరక్షణనుప్రభావితం చేస్తుంది. తడి పరిస్థితులు తరచుగా గోళ్ల చుట్టూ బ్యాక్టీరియా మరియు ఫంగల్ పెరుగుదలకు దారితీస్తాయి, దీనివల్ల క్రమం తప్పని గ్రూమింగ్ కేవలం ఒక అలవాటు మాత్రమే కాదు, ఒక ఆవశ్యకతగా మారుతుంది. నిజం చెప్పాలంటే, నెయిల్ క్లిప్పర్‌లకు సాధారణంగా అంత ప్రాధాన్యత లభించదు మరియు అవి తరచుగా తక్కువగా అంచనా వేయబడతాయి, కానీ ఇది నిజంగా దానికి అర్హమైనది. ఈ సీజన్‌లో వినియోగదారులు అప్రయత్నంగా సుందరంగా మరియు సురక్షితంగా ఉండటానికి సహాయపడటానికి, KAI% తన 100% స్టెయిన్‌లెస్ స్టీల్ నెయిల్ క్లిప్పర్‌ను పరిచయం చేస్తోందిఇది రోజువారీ ఉపయోగం కోసం కచ్చితత్వం, పరిశుభ్రత, మరియు శైలి యొక్క ఆదర్శవంతమైన మిశ్రమం.సాంప్రదాయ జపనీస్ హస్తకళా నైపుణ్యాన్ని భారతీయ అలవాట్లతో నైపుణ్యంగా మిళితం చేస్తూ, సుమెకిరి (నెయిల్ క్లిప్పర్)ఒక సొగసైన, ఎర్గోనామిక్ డిజైన్ ఒక పటిష్టమైన లివర్‌ను కలిగి ఉంటుంది, ఇది సున్నితమైన, సులభమైన గోళ్ల కత్తిరింపును నెయిల్ ట్రేని నిర్ధారిస్తుంది. దాని ఉన్నత-శ్రేణి స్టెయిన్‌లెస్ స్టీల్ బాడీ స్థిరమైన కాఠిన్యం మన్నికను అందిస్తుంది, తేమతో కూడిన వాతావరణంలో కూడా పదునును నిలుపుకుంటుంది. ఇది వర్షాకాలంలో ఒక ఆదర్శవంతమైన గ్రూమింగ్ సాధనంగా చేస్తుంది, ఈ సమయంలో క్రమం తప్పని గోళ్ల సంరక్షణ చాలా ముఖ్యం.సాంప్రదాయ క్లిప్పర్‌ల వలె కాకుండా, నెయిల్ క్లిప్పర్ ఒక మేధావి ఆవిష్కరణ. ఇది అధిక ఒత్తిడి అవసరం లేకుండా పనిచేయడానికి రూపొందించబడింది, ప్రతి వాడకాన్ని మరింత సౌకర్యవంతంగా చేస్తుంది. ఇది ఇంటిగ్రేటెడ్ నెయిల్ ఫైల్ మరియు మురికి తొలగించే సాధనాన్ని కూడా కలిగి ఉంటుంది, ఇది గోళ్లను సులభంగా ఆకృతి చేయడానికి మరియు శుభ్రపరచడానికి అనుమతిస్తుంది ముఖ్యంగా బురద నీరు లేదా తడి పాదరక్షలకు గురైన తర్వాత ఇది చాలా ఉపయోగపడుతుంది.

## సుంకాలు అమల్లో వస్తే..భారత్‌లోని ప్రభావిత రంగాలు




**న్యూఢిల్లీ-నవభూమి:** రష్యా నుంచి చమురు కొనుగోళ్లు బూచీగా చూపుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై విధించిన అదనపు 25 శాతం సుంకం ఇవాళ్టి (బుధవారం) నుంచి అమల్లోకి వచ్చింది. ఇది భారత్ పై అమెరికా విధించిన సుంకాల మొత్తాన్ని 50 శాతానికి తీసుకువచ్చింది. ఆగస్టు 7న భారత్ పై 25 శాతం పరస్పర సుంకాలను ట్రంప్ ప్రకటించారు. ఆ సుంకాలు భారత్ తోపాటు దాదాపు 70 ఇతర దేశాలపై కూడా అమలులోకి వచ్చాయి.అయితే, రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోళ్లు చేస్తున్నందుకు గాను ఆగస్టు 7న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. భారత వస్తువులపై సుంకాలను 50 శాతానికి రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించారు.

థింక్ ట్యాంక్ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ ప్రకారం, భారతదేశం ప్రతి సంవత్సరం USకి దాదాపు 86.5 బిలియన్ డాలర్ల వస్తువులను ఎగుమతి చేస్తుంది. ఇందులో దాదాపు మూడింట రెండు వంతులు అంటే 60.2 బిలియన్ డాలర్ల వస్తువులు 50 శాతం సుంకాన్ని ఎదుర్కొంటున్నాయి.ప్రభుత్వ అంచనాలు దీనికి కొంచెం తక్కువగా ఉన్నప్పటికీ, సుంకాలు 48.2 బిలియన్ల విలువైన ఎగుమతులపై ప్రభావం చూపుతాయి. కొత్త సుంకాలు %ఖూ%కి షిప్‌మెంట్‌లను వాణిజ్యపరంగా లాభదాయకంగా చేయవు. వ్యాపార నష్టాలకు కారణమవ్వడమే కాకుండా ఆర్థికవృద్ధి మందగించవచ్చని సమాచారం.

**అత్యంత ప్రభావిత రంగాలు**

టెక్స్‌టైల్స్, రత్నాలు, ఆభరణాలు, తోలు వస్తువులు, ఆహారం, ఆటోమొబైల్స్ వంటి వంటి రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయనిGTRI% సూచిస్తోంది. ప్రభావిత రంగాలలో ఎగుమతులు 70 శాతం కుప్పకూలిపోవచ్చని, $60.2 బిలియన్ల నుంచి $%18.6 బిలియన్లకు తగ్గుతాయని థింక్ ట్యాంక్ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ హెచ్చరించారు. అంతేకాకుండా, %US%కి మొత్తం షిప్‌మెంట్‌లు 43 శాతం తగ్గవచ్చు, భారతదేశ ఎగుమతి కేంద్రాలలో లక్షలాది ఉద్యోగాలను ప్రమాదంలో పడేస్తాయి.అధిక సుంకాల మధ్య భారతదేశ ఉత్పత్తులు పోటీతత్వాన్ని కోల్పోవచ్చు. ఇది చైనా, వియత్నాం వంటి దేశాలకు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. ఎందుకంటే భారతదేశంపై విధించిన సుంకాలు చైనా (30 శాతం), వియత్నాం (20 శాతం), ఇండోనేషియా (19 శాతం), జపాన్ (15 శాతం) వంటి ఇతర ఆసియా దేశాల కంటే కూడా ఎక్కువగా ఉన్నాయి.

రొయ్యలు: భారతదేశం 2025 ఆర్థిక సంవత్సరంలో USకి $2.4 బిలియన్ల విలువైన రొయ్యలను ఎగుమతి చేసింది. ఇది మొత్తం రొయ్యల ఎగుమతుల్లో 32.4 శాతం వాటా కలిగి ఉంది. ముఖ్యంగా ఒలిచిన, డీవీన్ చేసిన, వండిన, బ్రెడ్ చేసిన రొయ్యలకు US భారతదేశం అగ్ర మార్కెట్. ఈ రంగంలో మొత్తం సుంకాలు 60 శాతానికి పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ-గేట్ ధరలు కుప్పకూలి విశాఖపట్నం, పశ్చిమ గోదావరిలోని ప్రాసెసింగ్ హబ్‌ల మనుగడకు ముప్పు వాటిల్లుతుంది. అయితే GTRI ప్రకారం ఈక్వెడార్, వియత్నాం, ఇండోనేషియా, థాయిలాండ్ వంటి పోటీదారులు మార్కెట్ వాటాను స్వాధీనం చేసుకుంటారు.

రత్నాలు, ఆభరణాలు: ఈ రంగంలో %US%కి భారతదేశం $10 బిలియన్ల ఎగుమతులు చేస్తోంది. అలాగే ప్రపంచ ఎగుమతుల్లో 40 శాతం వాటా కలిగి ఉంది. అయితే ప్రస్తుతం సుంకాలు 2.1 శాతం నుంచి 52.1 శాతానికి పెరుగుతాయి. దీని వల్ల సూరత్, ముంబై, జైపూర్‌లలో ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక్కడ పరిశ్రమ కటింగ్, పాలిషింగ్, తయారీలో లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది.

వస్త్రాలు, దుస్తులు: 2025 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు భారతదేశపు వస్త్రాలు, దుస్తుల ఎగుమతులు $10.8 బిలియన్లు. అమెరికాకు ఎగుమతుల్లో దుస్తులు మాత్రమే $5.4 బిలియన్లు. భారతదేశ దుస్తుల ఎగుమతుల్లో అమెరికా వాటా 35 శాతం. సుంకాలు 13.9 శాతం నుంచి 63.9 శాతానికి పెరుగుతాయి. దీని వల్ల వాటి ధరలు వాటి ధరలు బాగా పెరుగుతాయి. ఫలితంగా వాటి ధర ప్రయోజనం తొలగిపోతుంది. ఇది తిరుప్పూర్, నోయిడా-గురుగ్రామ్, బెంగళూరు, లూథియానా, జైపూర్‌లోని క్లస్టర్‌లను ప్రభావితం చేస్తుంది. బంగ్లాదేశ్, వియత్నాం, మెక్సికో, CAFTA-DR దేశాలు భారతీయ సరఫరాదారులను భర్తీ చేస్తాయని భావిస్తున్నారు.

తివాచీలు: 2025 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు భారతదేశం ఎగుమతులు $1.2 బిలియన్లు. భారత కార్పెట్ ఎగుమతుల్లో వాషింగ్టన్ 58.6 శాతం వాటాను కలిగి ఉంది. సుంకాలు 2.9 శాతం నుండి 52.9 శాతానికి పెరిగి, భదోహి, మీర్జాపూర్, శ్రీనగర్‌లలో చేతివృత్తుల జీవనోపాధిని భయపెడుతున్నాయి. అయితే టర్కీ, పాకిస్తాన్, నేపాల్, చైనా మనకు విధించిన సుంకాల కారణంగా లాభపడుతున్నాయి.హస్తకళలు: 2025 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు భారతదేశపు చేతివృత్తుల ఎగుమతులు $1.6 బిలియన్లు. వాషింగ్టన్ భారత ఎగుమతుల్లో 40 శాతం వాటాను కలిగి ఉంది. దీని వలన జోధ్‌పూర్, జైపూర్, మొరాదాబాద్, సహారన్‌పూర్‌లలో ఫ్యాక్టరీ మూసివేత ప్రమాదం ఉంది. వియత్నాం, చైనా, టర్కీ, మెక్సికోలకు దీనివల్ల లబ్ధి చేకూరుతుంది.

## ఫార్మాపై జీఎస్టీని హేతుబద్ధీకరించాలి

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రతిపాదిత జీఎస్టీ సంస్కరణలు ఫార్మా పరిశ్రమకు తోడ్పడేలా ఉండాలని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఛైర్మన్ సతీష్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సంస్కరణలు హేతుబద్ధంగా, ఫార్మా కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేలా ఉండాలన్నారు. చాలా కాలంగా ఫార్మా కంపెనీలు ఔషధాలపై తక్కువ పన్ను, ముడి పదార్థాలపై ఎక్కువ పన్నుల సమస్యను ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తు చేశారు. దీనివల్ల ఉత్పత్తి వ్యయం పెరిగి, రోగులకూ ఔషధాలు అందుబాటు ధరల్లో లేకుండా పోతున్నాయన్నారు. త్వరలో చేపట్టే సంస్కరణలు ఈ కీలక సవాళ్లను అధిగమించేలా ఉంటాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. పన్నుల హేతుబద్ధీకరణ ద్వారా ప్రతి పౌరుడికి అత్యవసర మందుల ధర అందుబాటులో ఉండే అవకాశం ఏర్పడుతుందన్నారు. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లోనూ మన కంపెనీల పోటీ సామర్థ్యం పెరిగి సరికొత్త ఔషధాలనూ ఉత్పత్తి చేయగలుగుతామని సతీష్ రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమకు మేలు చేసే సంస్కరణల కోసం ప్రభుత్వంతో కలిపి పని చేసేందుకూ సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతం తుది ఔషధాలపై 12 శాతం, వాటి తయారీ కోసం వినియోగించే ముడి పదార్థాలపై 18 శాతం జీఎస్టీ అమల్లో ఉంది. సంస్కరణల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న నాలుగు జీఎస్టీ శ్లాబులను ప్రభుత్వం 5, 18 పేరుతో రెండు శ్లాబులుగా మార్చాలని యోచిస్తోంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ మంగళవారం 26 । ఆగస్టు । 2025

## నాగార్జున, చైతూ కలిసి కారులో జర్నీ



తన తండ్రి నాగార్జునను కారులో కూర్చోబెట్టుకుని డ్రైవింగ్ చేశాడు యువ నటుడు అక్కినేని నాగచైతన్య. హైదారాబాద్‌లో ఈ ఘటన జరుగగా.. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. బీఎండబ్ల్యూ ఏం2 అనే కొత్త సిరీస్ కారును చైతూ డ్రైవింగ్ చేస్తుండగా.. నాగార్జున పక్కన కూర్చున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోను మీరు చూసేయండి. సినిమాల విషయానికి వస్తే.. ఇటీవల కుబేర, కూలీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌లు అందుకున్నాడు నాగార్జున. కూలీ సినిమాలో తాను పోషించిన సైమన్ పాత్రకు అయితే మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. నాగ చైతన్య విషయానికి వస్తే.. ఇటీవలే తండేల్‌తో సూపర్ హిట్‌ను అందుకున్నాడు. ప్రస్తుతం విరుపాక్ష దర్శకుడు కార్తిక్ దండుతో ఒక సినిమా చేస్తున్నాడు.




## 'సయ్యారా' బ్యూటీ రిస్కీ డెసిషన్?



డెబ్యూ నటీమణులకు చాలా ప్రయోగాలు చేయాలనే కోరిక ఉండొచ్చు. సెలక్టివ్ గా ముందుకు సాగాలనే ఉచిత సలహాలు ఇచ్చేవాళ్లుంటారు. కానీ అన్ని సందర్భాల్లో అందరికీ ఇవి వర్తించవు. కొన్నిసార్లు రాజీ పడి నిర్ణయాలు తీసుకోవాల్సి రావొచ్చు. అలాంటి పరిస్థితిలో సయ్యారా బ్యూటీ అనీత్ పద్దా కూడా ఉన్నారా? అంటే అవుననే తాజా పరిణామం చెబుతోంది. నటించిన మొదటి సినిమాతోనే సంచలనం సృష్టించిన ఈ అందాల యువకథానాయిక తదుపరి ఒక పెద్ద దర్శకుడితో అగ్ర బ్యానర్ లో పని చేయడానికి సిద్ధమవుతోంది. టైగర్ 3 లాంటి భారీ ఫ్లాప్ సినిమాని తెరకెక్కించిన మనీష్ శర్మ తిరిగి తన శుద్ దేశీ రొమాన్స్ జానర్ కి షిఫ్ట్ అవుతున్నాడు. అతడు తన కెరీర్ తొలి నాళ్లలో రూపొందించిన బ్యాండ్ బాజా బరాత్, శుద్ దేశీ రొమాన్స్ తరహాలో ఇప్పుడు ఒక రొమాంటిక్ కామెడీని తెరకెక్కించేందుకు అతడు సన్నాహకాలలో ఉన్నాడు. ఈ సినిమా కోసం సయ్యారా బ్యూటీ అనీత్ పద్దాను ఎంపిక చేయడం అతడికి పెద్ద ప్లస్ కానుంది. %ూశ్రీంశీ =ఘుం% - ఐకాన్ స్టార్ బాలీవుడ్ ఎంట్రీ టాలీవుడ్ రాత మార్చేలా! అయితే ఒక పెద్ద ఫ్లాప్‌ని ఎదుర్కొన్న దర్శకుడితో పని చేయడం నిజానికి అనీత్ పద్దాకు కెరీర్ పరంగా పెద్ద మైనస్. కానీ అతడు తిరిగి తన పాత జానర్ కి వచ్చి పెద్ద హిట్టిస్తాడనే హోప్ కూడా లేకపోలేదు. అందుకే వైఆర్ఎఫ్ సంస్థ కూడా తిరిగి అతడిపై పెట్టుబడులు పెడుతోంది. అనీత్ పద్దా ప్రస్తుతం యష్ రాజ్ ఫిలింస్ రేంజు, ఫేమ్ గురించి ఆలోచిస్తోంది. ఇంత పెద్ద నిర్మాణ సంస్థలో అవకాశాన్ని కాదనలేని స్థితిలో ఉంది. ప్రస్తుతం వెంటపడుతున్న దర్శకనిర్మాతలకు నో చెప్పే స్థాయి తనది కాదు. అందుకే తన రెండో ప్రయత్నం ఎలా ఉండబోతోందో వేచి చూడాలి. అనీత్ పద్దా- అహాన్ పాండే జంటగా నటించిన సయ్యారా బాక్సాఫీస్ వద్ద దాదాపు 350 కోట్లు వసూలు చేసింది. ఈ చిత్రానికి మోహిత్ సూరి దర్శకత్వం వహించగా యష్ రాజ్ ఫిలింస్ నిర్మించింది.

## చైతూ, సామ్ విడాకులు.. నాగ్ సిస్టర్ ఏమన్నారంటే?





టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో స్టార్ అండ్ క్యూట్ కపుల్ గా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు అక్కినేని నాగచైతన్య, సమంత రూత్ ప్రభు. బ్లాక్ బస్టర్ హిట్ ఏమాయ చేసావే మూవీ సమయంలో ఫస్ట్ టైమ్ కలుసుకున్న చైతూ, సామ్ లవ్ లో పడ్డారు. కానీ ఆ తర్వాత వారిద్దరూ ప్రేమలో ఉన్నారని ఎన్నో వార్తలు వచ్చినా ఎప్పుడూ స్పందించలేదు. కానీ సడెన్ గా తాము ఇద్దరం పెళ్లి చేసుకుంటున్నామని చెప్పి షాక్ ఇచ్చారు. ఆ తర్వాత పెద్దల అంగీకారంతో వివాహ బంధంతో నాగచైతన్య- సమంత ఒక్కటయ్యారు. గోవాలో చాలా గ్రాండ్ గా హిందూ, క్రిస్టియన్ సంప్రదాయాల ప్రకారం వారిద్దరి వివాహ వేడుక జరిగింది. ఆ తర్వాత వైవాహిక జీవితాన్ని ఇద్దరూ ఫుల్ గా ఎంజాయ్ చేశారు. టాలీవుడ్ ఇండస్ట్రీ లో జరిగిన ఈవెంట్స్ తో పాటు ఫ్యామిలీ ఫంక్షన్స్ లో సందడి చేశారు. ఆ తర్వాత ఇద్దరూ విడిపోతున్నారని ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. కానీ అవి రూమర్సేనని అందరూ అనుకున్నారు. కానీ అదే నిజమైంది. తామిద్దరం విడిపోతున్నామని నాగచైతన్య, సమంత.. సోషల్ మీడియాలో వేర్వేరుగా ప్రకటించారు. దీంతో సినీ ప్రియులు, ఫ్యాన్స్ చాలా నిరాశ వ్యక్తం చేశారు. విడాకులకు గల కారణాలపై రకరకాల వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ ఇప్పటివరకు ఇరు కుటుంబాలకు చెందిన సభ్యులు, సన్నిహితులు స్పందించలేదు. ఇప్పటి వరకు ఎక్కడా మాట్లాడలేదు. కొన్ని నెలల క్రితం అక్కినేని నాగార్జున సోదరి, చైతూ మేనత్త నాగసుశీల ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇంటర్వ్యూ పాతదే అయినా ఇప్పుడు వీడియో వైరల్‌గా మారింది. నాగార్జున, నాగచైతన్య, సుమంత్.. సినిమా నటులు కాబట్టి వారి ఫీల్డ్‌లోని వ్యక్తులను పెళ్లి చేసుకున్నారని గుర్తు చేశారు.

వారు తమ ఫీల్డ్‌ను అర్థం చేసుకుంటారని, కానీ అప్పుడు చైతన్యకు అలా జరిగిందని అన్నారు. ఆ విషయంలో ఇందులో మరొకరిని నిందించడానికి ఏం లేదని చెప్పారు. ఎప్పుడైనా ఏం జరిగినా భార్యాభర్తలే కారణమని అన్నారు నాగసుశీల. భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకోవాలని, అయితే విడిపోవాల్సి వస్తే ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా విడిపోవడమే మంచిదని అన్నారు. ఎందుకంటే సమాజం కోసమో, ఫ్యామిలీ పరువు కోసమో ఇబ్బంది పడుతూ కలిసుండాల్సిన అవసరం ఈ రోజుల్లో లేదని అన్నారు. విడిపోయి ఇద్దరూ స్నేహితులుగా మిగిలిపోవచ్చని, అలాంటి వారిని ఎంతోమందిని చూశానని చెప్పుకొచ్చారు.

కానీ కొన్ని జంటలు మాత్రం ఇంకా కొట్టుకుంటూ ఉన్నారని నాగసుశీల వ్యాఖ్యానించారు. ఇప్పుడు నాగసుశీల కామెంట్స్ బట్టి చూస్తే.. చైతూ, సామ్ కూడా ఇబ్బంది పడకుండా విడిపోయినట్లు కనిపిస్తుందని అనేక మంది నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

## ఐకాన్ స్టార్ బాలీవుడ్ ఎంట్రీ టాలీవుడ్ రాత మార్చేలా!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ బాలీవుడ్ ఎంట్రీ ఎప్పుడు ఉంటుందో తెలియదు. కానీ ఎంట్రీ ఇస్తే గనుక టాలీవుడ్ రాత మార్చేలా ఉండాలి. ఎందుకంటే ఇప్పటి వరకూ టాలీవుడ్ నుంచి బాలీవుడ్ లో లాంచ్ ఏ హీరో కూడా సక్సెస్ అవ్వలేదు. సీనియర్ హీరోల నుంచి తర్వాత తరం హీరోల వరకూ ఏ నటుడికి సరైన లాం చింగ్ చిత్రం పడలేదు. సీనియర్లలో చిరంజీవి, నాగార్జు, వెంకటేష్, జూనియర్లలో రామ్ చరణ్, ప్రభాస్, ఎన్టీఆర్ వీళ్లంతా బాలీవుడ్ లో ఇప్పటికే లాంచ్ అయిన స్టార్లు. కానీ ఎవరికీ అక్కడ గ్రాండ్ లాంచింగ్ దక్కలేదు. హిందీ రికార్డులే చెరిపేసిన స్టార్: సీనియర్ స్టార్లను మినహాయిస్తే తర్వాత జనరేషన్ హీరోలైనా గ్రాండ్ విక్టరీలు నమోదు చేయాలి. కానీ ఇంత వరకూ ఆ ఛాన్సే లేకుండా పోయింది. 'వార్ 2'తో యంగ్ టైగర్ ఎన్టీఆర్ అయినా షేక్ చేస్తాడనుకుంటే అతడు తేలిపోయాడు. రానున్న రోజుల్లో మరింత మంది స్టార్లు అక్కడ లాంచ్ అయ్యే అవకాశం ఉంది. కానీ అందరికంటే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పైనే అందరి నమ్మకాలు బలంగా ఉన్నాయి. ఓ తెలుగు సినిమాతో తిరగరాసాడు బన్నీ. అర్జున్ సహ టాలీవుడ్ ఏమాత్రం ఊహించని సన్నివేశం ఇది. 1800 కోట్ల వసూళ్లతో వరల్డ్ వైడ్ బాహుబలి రికార్డులను సైతం తిరగరాసిన చరిత్ర బన్నీకి సాధ్యమైంది. అదే 'పుష్ప' ది రైజ్ చిత్రంతో జాతీయ ఉత్తమ నటుడిగానూ ఎంపికయ్యాడు. 100 ఏళ్ల తెలుగు సినీ చరిత్రలో ఏ నటుడికి దక్కని అరుదైన గౌరవం, గుర్తింపు బన్నీకి సాధ్యమయ్యాయి. ఇలా బన్నీ పేరిట బాలీవుడ్‌లో నమోదైన రికార్డుల ఫలితంగా ఉత్తరాదిన స్ట్రెయిట్ సినిమా తీస్తే బ్లాక్ బస్టర్ అయ్యేది అది బన్నీ ఇమేజ్తోనే సాధ్యవమతుందని పరిశ్రమలో కొత్తగా చర్చ మొదలైంది. మరి బన్నీ బాలీవుడ్‌లో ఎప్పుడు లాంచ్ అవుతాడో? చూడాలి.

## మరి కొద్ది రోజుల్లోనే అనుష్క ఘాటి రిలీజ్.. ఇంకా అనుష్క ప్రమోషన్స్‌కి దూరంగా ఉంటుందేంటి?

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల అనుష్క ఈ మధ్య స్లో అండ్ స్టడీగా సినిమాలు చేస్తుంది. అయితే ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో అనుష్క ఘాటి అనే చిత్రం చేయగా, ఈ మూవీ సెప్టెంబర్ 5న విడుదలకు సిద్ధమవుతుంది. ప్రముఖ నటి అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తోంది. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన ఈ యాక్షన్ క్రైమ్ డ్రామా, గంజాయి మాఫియా నేపథ్యంలో నడుస్తూ, అనుష్కను ఓ శక్తివంతమైన గిరిజన మహిళ పాత్రలో చూపించనుంది.



మూవీ ట్రైలర్, గ్లింప్స్, ఫస్ట్ లుక్ అన్నింటికి మంచి రెస్పాన్స్ వచ్చింది. అనుష్క అదిరిపోయే గెటప్‌తో ప్రేక్షకులను అలరించగా, ఫ్యాన్స్ ఫుల్ హైప్‌లో ఉన్నారు. అయితే చిత్ర ప్రమోషన్స్‌లో అనుష్క పాల్గొనకపోవడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. ఘాటి టీం దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రమోషన్లు నిర్వహిస్తున్నా, అనుష్క ఎక్కడా కనిపించడం లేదు. దీనిపై ఓ ఎక్స్ పోస్టులో చిత్ర నిర్మాత స్పందిస్తూ, "అనుష్క ప్రమోషన్లలో పాల్గొనబోనని షూటింగ్‌కు ముందే స్పష్టంగా తెలిపింది. ఆ మేరకు ఒప్పందం కుదిరింది" అని చెప్పారు. అయితే అనుష్క ఎందుకు ప్రమోషన్స్‌కు దూరంగా ఉంటోంది? అనే అంశంపై టాలీవుడ్ వర్గాల్లో అనేక రూమర్లు వినిపిస్తున్నాయి. వ్యక్తిగత కారణాలా? లేక ఇతర సినిమాల కమిట్‌మెంట్సా? అన్నది స్పష్టంగా తెలియాల్సి ఉంది. అయితే ఆమె అభిమానులు మాత్రం కొంత నిరాశలో ఉన్నారు. అనుష్క హాజరు లేకపోయినా, ఘాటి ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. ఫస్ట్ లుక్ నుంచే సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. సినిమా డిజిటల్ హక్కులని అమెజాన్ ప్రైమ్ భారీ ధరకు దక్కించుకుందన్న వార్తలు వస్తున్నాయి. ఒక్క ప్రీరిలీజ్ ఈవెంట్‌కి అయినా అనుష్క హాజరవుతుందా? అన్నది ప్రస్తుతం ఫ్యాన్స్‌లో చర్చనీయాంశంగా మారింది. అయితే 'ఘాటి' సినిమా షూటింగ్ వరకు మాత్రమే అనుష్క కమిటైందని, ప్రమోషన్, సక్సెస్ మీట్ వంటి కార్యక్రమాలకు ఆమె హాజరుకాదనేది నిజమని కొందరు చెప్పుకొస్తున్నారు.

## ఐటీ ఉద్యోగి కిడ్నాప్ కేసు.. నటి లక్ష్మీ మేనన్‌కు ఊరట





కేరళలోని కొచ్చిలో ఐటీ ఉద్యోగిని కిడ్నాప్ చేసి, దాడి చేసిన కేసులో తమిళ నటి లక్ష్మీ మీనన్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో నటి లక్ష్మీ మేనన్‌కు ఊరట లభించింది. కేరళ కోర్టు సెప్టెంబర్ 17 వరకూ నటికి ముందస్తు బెయిల్‌ను మంజూరు చేసింది. అప్పటి వరకూ ఆమెను అరెస్ట్ చేయొద్దని పోలీసులకు సూచించిం ది. అసలేం జరిగిందంటే.. గత ఆదివారం కొచ్చిలోని ఒక రెస్టారెంట్ బార్ వద్ద లక్ష్మీ మీనన్ గ్యాంగ్‌కి, ఐటీ ఉద్యోగినికి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ గొడవ తర్వాత, నటి లక్ష్మీ మీనన్ ఆమె స్నేహితులు ఐటీ ఉద్యోగిని వెంబడించి, అతడి కారును అడ్డగించారు. ఆ తర్వాత అతడిని బలవంతంగా తమ కారులోకి లాక్కొని దాడికి పాల్పడ్డారని సమాచారం. అయితే దీనిపై కేసును నమోదు చేసిన ఎర్నాకులం నార్త్ పోలీసులు నటి స్నేహితులైన మిథున్, అనీష్, సోనామోల్ అనే ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఇక నిందితుల్లో ఒకరిగా ఉన్న నటి లక్ష్మీ మీనన్ కోసం ప్రస్తుతం పరారీలో ఉందని ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉందని పోలీసులు తెలిపారు. ఆమెను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అయితే నటి పేరును ఇంకా ఎఫ్ఐఆర్‌లో పోలీసులు చేర్చలేదని సమాచారం. లక్ష్మీ మీనన్ ప్రధానంగా తమిళ చిత్రాలలో ఎక్కువగా నటించింది. ఆమె నటించిన చిత్రాలలో కుమ్కి సుందరపాండియన్ జిగర్తాండ వేదాలం చంద్రముఖి 2 వంటి తదితర చిత్రలతో నటిగా గుర్తింపు తెచ్చుకుంది. విశాల్ నటించిన ఇంద్రుడు చిత్రంతో సూపర్ హిట్ అందుకుంది.


## జాన్వీ అందాలకు సెన్సార్ పడలేదు



అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ త్వరలో 'పరమ్ సుందరి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీగా ఉంది. ఇప్పటి వరకు హిందీలో జాన్వీ కపూర్ చాలా సినిమాలు చేసింది. మొదటి సినిమా సమయంలో ఉన్నంత ఆసక్తి ప్రేక్షకుల్లో ఆ తర్వాత కనిపించలేదు. కానీ బాలీవుడ్‌తో పాటు అన్ని భాషల ప్రేక్షకులు జాన్వీ కపూర్ తాజా చిత్రం 'పరమ్ సుందరి' పై చాలా అంచనాలు, ఆసక్తి పెట్టుకుని ఎదురు చూస్తున్నారు. సోషల్ మీడియాలో పరమ్ సుందరి సినిమాకు పెరిగిన బజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పరమ్ సుందరి ఫస్ట్ లుక్ వచ్చినప్పుడు మొదలైన హైప్, ఇటీవల విడుదలైన భీగీ సారి పాటతో పీక్స్‌కి వెళ్లింది. సిద్ధార్థ్ మల్హోత్రతో జాన్వీ కపూర్ చేసిన రెయిన్ డాన్స్ తో అభిమానులు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరూ తడిసి ముద్ద అయ్యారు అనడంలో సందేహం లేదు. జాన్వీ కపూర్ రెయిన్ డాన్స్ జాన్వీ కపూర్ కెరీర్‌లోనే బెస్ట్ రొమాంటిక్ రెయిన్ డాన్స్‌గా దీన్ని అభిమానులు చెప్పుకుంటున్నారు. ఈ పాట యూట్యూబ్ వరకే పరిమితం అవుతుందా.. థియేటర్‌లో చూస్తామా అనే అనుమానంను చాలా మంది వ్యక్తం చేశారు. ఈ మధ్య కాలంలో బాలీవుడ్ సినిమాలకు కాస్త కఠినంగానే సెన్సార్ కట్స్ ఉంటున్నాయి. కనుక సెన్సార్ కత్తెరకి జాన్వీ కపూర్ ఈ రొమాంటిక్ రెయిన్ డాన్స్ కట్ అవుతుందేమో అని అభిమానులు ఆందోళన చెందారు. సినిమాకు కావాల్సినంత బజ్ క్రియేట్ చేసిన ఈ రొమాంటిక్ రెయిన్ సాంగ్ ను మేకర్స్ ఎట్టి పరిస్థితుల్లో సినిమాలో ఉంచాలని భావించారు. అందుకోసం సెన్సార్ బోర్డ్ ముందు చాలా గట్టిగానే వాదించారు అంటూ హిందీ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఆ పాట పూర్తిగా ఏ సర్టిఫికెట్ వచ్చేది కాదు, కనుక యూ/ఏ ఇవ్వడంతో పాటు 13ం వయసు వారి వరకే అని ప్రత్యేకంగా సెన్సార్ బోర్డ్ కండిషన్ పెట్టినట్లు తెలుస్తోంది. పరమ్ సుందరితో జాన్వీ కపూర్ భీగీ సారి పాటలో సింగిల్ ఫ్రేమ్ కూడా కట్ చేయకుండా సెన్సార్ బోర్డ్ క్లియరెన్స్ ఇవ్వడం అనేది ఖచ్చితంగా జాన్వీ కపూర్ యొక్క అభిమానులకు పెద్ద గుడ్ న్యూస్‌గా చెప్పుకోవచ్చు.


అభిమానులకు మాత్రమే కాకుండా చిత్ర యూనిట్ సభ్యులకు, ముఖ్యంగా చిత్ర నిర్మాతకు, బయ్యర్లకు, డిస్ట్రిబ్యూటర్లకు ఇది చాలా పెద్ద గుడ్ న్యూస్‌గా చెప్పుకోవచ్చు. ఈ రొమాంటిక్ సాంగ్ ఉండటం వల్ల ఖచ్చితంగా సినిమాకు మినిమం ఓపెనింగ్స్ దక్కే అవకాశాలు ఉన్నాయి. అందుకే నిర్మాతలు ఈ సినిమాలో ఆ పాట ఉండాల్సిందే అనుకున్నారు, వారు అనుకున్నట్లుగానే పాట ఉండటంతో సినిమాకు మరింత బజ్ క్రియేట్ అవుతుందని సినీ విశ్లేషకులు, ఇండస్ట్రీ వర్గాల వారు, బాక్సాఫీస్ సర్కిల్స్ వారు మాట్లాడుకుంట ున్నారు. ఈ పాటతో సినిమాకు డబుల్ ఇన్‌కమ్ అనే ప్రచారం సోషల్ మీడియాలో ప్రముఖంగా జరుగుతోంది. రామ్ చరణ్ పెద్దిలో.. బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయినప్పటికీ ఇప్పటి వరకు జాన్వీ కపూర్ కమర్షియల్ బిగ్ బ్రేక్ దక్కే విధంగా హిట్ సినిమాను దక్కించుకోలేక పోయింది.

## ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్స్‌లో చరిత్ర సృష్టించిన చికిత.. అభినందించిన డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్-నవభూమి:** ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్స్‌లో ఇండియా తరపున చరిత్ర సృష్టించిన తెలంగాణ ముద్దుబిడ్డ చికితను అభినందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందించారు. రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత తానిపర్తి ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్స్‌లో అండర్-21 మహిళల విభాగంలో స్వర్ణ పతకం సాధించడంపై డిప్యూటీ సీఎం భట్టి హర్షం వ్యక్తం చేశారు. విశ్వవేదికలపైనే దేశ పతాకాన్ని రెపరెపలాడిస్తున్న చికిత మరిన్ని ఘన విజయాలు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. శనివారం కెనడాలోని విన్నిపెగ్‌లో జరిగిన టోర్నమెంట్‌లో ఈ ఘనత సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా నిలిచిన చికిత దేశానికి, రాష్ట్రానికి గర్వకారణమన్నారు. 20 ఏళ్ల ఈ యువ ఆర్చర్ టోర్నమెంట్ అంతటా అద్భుతమైన ఫామ్‌ను ప్రదర్శించిందని ప్రశంసించారు. అంతర్జాతీయ వేదికలపైన భవిష్యత్తులో సైతం చికిత ఇలాంటి అద్భుత విజయాలు సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కాగా, ఆగస్టు 28 సాయంత్రం 4 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోనున్న చికిత తానిపర్తికి స్వాగతం పలికేందుకు క్రీడాభిమానులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన రవిచంద్రన్ అశ్విన్



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఐపీఎల్‌కు వీడ్కోలు పలికాడు. ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన అశ్విన్.. తాజాగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ నుంచి కూడా తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు వినాయక చవితి రోజున బుధవారం (ఆగస్టు 27, 2025) సోషల్ మీడియా పోస్ట్ పెట్టాడు. ప్రతి ముగింపుకి ఒక కొత్త ఆరంభం ఉంటుందని పెద్దలు అంటారు. ఐపీఎల్ క్రికెటర్‌గా నా ప్రయాణం ఈ రోజుతో ముగుస్తోంది, కానీ ప్రపంచవ్యాప్తంగా వివిధ లీగ్‌లలో ఆటను అన్వేషించే నా సమయం ఈ రోజు నుంచే మొదలవుతుంది. ఇన్నేళ్ల పాటు నాకు ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలను, అనుబంధాలను ఇచ్చిన అన్ని ఫ్రాంచైజీలకు, ముఖ్యంగా ఐపీఎల్, బీసీసీఐకి నా కృతజ్ఞతలు. ముందున్న నా ప్రయాణాన్ని ఆస్వాదించడానికి, సద్వినియోగం చేసుకోవడానికి ఎదురుచూస్తున్నాను. అంటూ అశ్విన్ ఎక్స్ వేదికగా రాసుకోచ్చాడు. ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర ఫ్రాంచైజీ లీగ్స్‌లో ఆడాలని అశ్విన్ భావిస్తున్నాడు. అతడి పోస్ట్ ద్వారా తెలుస్తుంది. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ వంటి ఐదు జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. అలాగే పంజాబ్ జట్టుకు కెప్టెన్‌గా కూడా వ్యవహరించాడు. ఐపీఎల్‌లో మొత్తం 221 మ్యాచ్‌లు ఆడిన అశ్విన్ 187 వికెట్లు పడగొట్టాడు. ఈ లీగ్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ఐదో స్థానంలో ఉన్నాడు.

## నా పని తేలిక చేసినందుకు థ్యాంక్యూ పుజ్జీ.. అద్భుతమైన కెరీర్ నీది..!



**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఛతేశ్వర్ పూజారా భారత జట్టుపై చెరగని ముద్రవేశాడు. అత్యంత కష్టమైన మూడో స్థానంలో క్రీజులోకి వచ్చి వికెట్ల పతనాన్ని అడ్డుకొని టీమిండియాను ఒడ్డున పడేసిన వీరుడు అతడు. ఆస్ట్రేలియాపై అత్యుత్తమ బ్యాటింగ్ నైపుణ్యాలు కనబరిచి 'నయావాల్' ట్యాగ్‌కు వందపాళ్లు న్యాయం చేశాడీ మిస్టర్ ఫర్ఫెక్ట్. పునరాగమనం కోసం రెండేళ్లుగా ఎదురు చూసిన పుజారా ఇక చోటు కష్టమేనని తెలిసి వీడ్కోలు వార్తతో అందరిని తన ఆట గురించి చర్చించుకునేలా చేశాడు.

టాపార్డర్‌లో అలుపెరగని యోధుడిలా పోరాడి.. చిరస్మరణీయ విజయాల్లో భాగమైన ఈ సౌరాష్ట్ర బ్యాటర్‌పై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. మాజీ సారథి విరాట్ కోహ్లీ సైతం టెస్టు స్పెషలిస్ట్ రిటైర్మెంట్‌పై స్పందిస్తూ ధన్యవాదాలు తెలిపాడు. మూడో స్థానంలో ఆడి తనపై ఒత్తిడి తగ్గించినందుకు పూజారాకు ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా కోహ్లీ కృతజ్ఞతలు తెలియజేశాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**